సత్యమేవ జయతే


# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+16 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 276

శుక్రవారం 27-12-2019




‘ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత’




‘మిల్లీమీటర్’ స్పెక్ట్రం విక్రయంపై కసరత్తు

-బిజినెస్‌లో




ప్రతిభా మూర్తులు.. పోరాట యోధులు

-ఫ్యామిలీలో


SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | KARIMNAGAR | MUMBAI | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


# కృష్ణా జలాల రివర్స్‌!

## జూరాలకు నీటి లభ్యత పెంచేలా చర్యలు

- పాలమూరు–రంగారెడ్డి నుంచి తరలింపు
- కర్వెన రిజర్వాయర్‌ నుంచి పంపేలా ప్రణాళిక
- నెలకు ఒక టీఎంసీ కోయిల్‌సాగర్, సంగం బండకు.. మరో 1.5 టీఎంసీ జూరాలకు..
- రూ.400 కోట్ల ఖర్చుతో ప్రాథమిక అంచనాలు.. సీఎం కేసీఆర్‌తో చర్చించాక తుది ప్రతిపాదనలు



సాక్షి, హైదరాబాద్‌

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను రివర్స్‌ పంపింగ్‌ చేస్తున్నట్లే కృష్ణా నదీ జలాలనూ పాలమూరు–రంగారెడ్డి ద్వారా జూరాలకు తరలించే ప్రాథమిక ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. సాధారణంగా కృష్ణా నది సహజ ప్రవాహాలు జూరాల నుంచి శ్రీశైలానికి వెళ్తుంటాయి. అయితే వర్షాకాలం తర్వాత ఎగువ నుంచి వరద ప్రవాహం ముగిశాక జూరాలలో నీటి లభ్యత పడిపోతుండటం, అవసరాలు భారీగా ఉన్న నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రివర్స్‌లో జూరాలకు నీటిని తరలించాలని సాగునీటి శాఖ ప్రణాళిక రచించింది. ఇందుకోసం శ్రీశైలంపై ఆధారపడి చేపట్టిన పాలమూరు ప్రాజెక్టులోని కర్వెన రిజర్వాయర్‌ ద్వారా నీటిని జూరాలకు తరలించేందుకు యోచిస్తున్నారు. దీంతో వేసవిలో కూడా జూరాల ద్వారా తాగునీరు, యాసంగి ఆయకట్టుకు సాగు నీరిచ్చే వీలు కలుగుతుంది. ఇందుకోసం దాదాపు రూ.400 కోట్లతో ప్రాథమిక అంచనాలు వేశారు. ఈ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పరిశీలించి ఆమోదం తెలిపిన అనంతరం ఈ ప్రతిపాదనలకు తుదిరూపం రానుంది.

### సామర్థ్యం తక్కువ, అవసరాలు ఎక్కువ


జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, నికర నిల్వ సామర్థ్యం 6.79 టీఎంసీలుగా ఉంది. దీని కింద ఆయకట్టు 1.04 లక్షల ఎకరాలు కాగా, దీనికే 17.84 టీఎంసీల అవసరం ఉంటుంది. దీనికి తోడు జూరాలపై ఆధారపడి నెట్టెంపాడు (21.42 టీఎంసీ–2 లక్షల ఎకరాలు), బీమా (20 టీఎంసీ–2.03 లక్షల ఎకరాలు), కోయిల్‌సాగర్‌ (3.9 టీఎంసీ– 50,250 ఎకరాలు) ఎత్తిపోతల పథకాలు చేపట్టారు. దీంతో పాటే మిషన్‌ భగీరథ కింద మరో 7.43 టీఎంసీల అవసరాలకు జూరాలపై ఆధారపడి ఉన్నాయి. జూరాల కింది తాగు, సాగునీటి అవసరాలకు నీటిని అందించాలంటే రోజూ 10 వేల క్యూసెక్కుల మేర నీటి అవసరం ఉంటుంది. అయితే జూరాలలోని నికర నిల్వ సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఈ నిల్వ నీటితో 8 రోజులకు మించి నీరు సరిపోదు. అదీగాక నవంబర్‌ తర్వాత ఎగువ నుంచి వరద ఆగాక జూరాలకు వచ్చే ప్రవాహాలు 2001–2018 వరకు చూస్తే రోజుకు 2,678 క్యూసెక్కులకు మించి లేదు. ఈ నీటితో జూరాలపై ఉన్న నీటి అవసరాలకు, యాసంగిలో సాగునీటి అవసరాలకు నీరివ్వడం సాధ్యం కాదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 215 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీశైలంపై ఆధారపడి చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల నుంచి జూరాలకు రివర్స్‌లో నీటిని తరలించి, వేసవిలోనూ

మిగతా 2వ పేజీలో ▶

## జీఎస్‌టీ రిటర్న్‌ ఎగవేస్తే..
# ఖాతా జప్తే

బిజినెస్‌లో

జీఎస్‌టీ రిటర్నులు దాఖలు చేయని అసెసీలు కఠిన చర్యలు ఎదుర్కొనాల్సి రానుంది. ప్రభుత్వం.. అలాంటి అసెసీల బ్యాంకు ఖాతాలను స్తంభింప చేయడం లేదా ఏకంగా రిజిస్ట్రేషన్‌ను కూడా రద్దు చేసే అవకాశాలు ఉన్నాయి.



# సూర్య గ్రహణం

గురువారం కోజికోడ్‌ (కేరళ)లో సూర్యగ్రహణం దృశ్యాల మాలిక


**ఆకాశంలో అద్భుతం**

- వివరాలు 5లో

**మరికొన్ని చిత్రాలు**

- వివరాలు 2లో

# నర్సుల ‘వేతన’ కష్టాలు



## ప్రైవేటు ఆసుపత్రుల్లో అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న నర్సులు

- కనీస వేతనాలు అందని వైనం.. రూ.15 వేలూ దాటని దుస్థితి
- ఆస్ట్రేలియా, కెనడాల మాదిరిగా ‘కాల్‌ ఆన్‌ డ్యూటీ’ పద్ధతితో అభద్రత
- దుర్భర స్థితిలో వేలాది మంది.. ప్రభుత్వ భర్తీలు లేక నిరాశ
- వచ్చే ఏడాదిని నర్సుల సంవత్సరంగా ప్రకటించిన డబ్ల్యూహెచ్‌ఓ

సాక్షి, హైదరాబాద్‌

డాక్టర్‌ వైద్యం చేస్తే... నర్సులు సేవలు చేస్తారు. అటువంటి నర్సులకు ప్రైవేటు, కార్పొరేట్‌ ఆసుపత్రులు తక్కువ వేతనం ఇస్తూ వారి జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. నర్సులకు కనీసం రూ.20 వేల వేతనమివ్వాలని 2016లో కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అలాగే 200 పడకల ఆసుపత్రుల్లోని నర్సులకు, ప్రభుత్వ ఆసుపత్రుల మాదిరిగానే జీతం చెల్లించాలని సుప్రీంకోర్టు కూడా స్పష్టంచేసింది. ఆ ప్రకారం కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే కనీస వేతనాలు అమలవుతున్నాయి. ఢిల్లీ, మహారాష్ట్ర ప్రభుత్వాలు అమలుకు నోటిఫికేషన్లు ఇచ్చాయి. తమిళనాడులో రూ. 17 వేల కనీస వేతనం అమలు చేస్తున్నారు. కానీ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం ఇప్పటివరకూ అటువంటి ప్రయత్నాలేవీ చేయడం లేదన్న విమర్శలున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో 8 గంటలకు బదులు 10 నుంచి 12 గంటలు పనిచేయిస్తున్నారు. కానీ వేతనాలు మాత్రం రూ.15 వేలు దాటడం లేదని నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కార్పొరేట్‌ ఆస్పత్రుల ‘కాల్‌ ఆన్‌ డ్యూటీ’

కార్పొరేట్‌ ఆస్పత్రులు ‘కాల్‌ ఆన్‌ డ్యూటీ’పేరుతో కొత్త రకపు పద్ధతులను ప్రవేశపెట్టాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకే, కెనడా తదితర దేశాల్లో ఉన్న కాల్‌ ఆన్‌ డ్యూటీ పద్ధతి ఇటీవల రాష్ట్రంలో విస్తరిస్తోంది. ఆ పద్ధతి ద్వారా రోజువారీ, షిఫ్టుల వారీగా వేతన చెల్లింపుల ప్రాతిపదికన సిబ్బందిని నియమించుకుంటున్నాయి. దీంతో ఇప్పటికే ఉన్న సిబ్బంది అభద్రతకు గురవుతున్నారు. అత్యవసర సేవల విభాగం ఐసీయూలో కాల్‌ ఆన్‌ డ్యూటీలో నర్సులను నియమిస్తున్నారు. ఆయా అత్యవసర విభాగాలకు కేసులు వచ్చిన సమయంలో మాత్రమే షిఫ్టుల వారీగా, రోజు వారీగా చెల్లింపు ప్రాతిపదికన అప్పటికప్పుడు ఫోన్‌ చేసి పిలిపించుకుంటున్నారు. అలాంటి వారికి రోజు కూలి కొంత ఎక్కువగా ఇస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత మాత్రం లేదు. అయితే ఎక్కువ పని గంటలు చేయాల్సి ఉంటుంది. సరాసరిగా రోజుకు ఐసీయూలో విధులు

మిగతా 2వ పేజీలో ▶

# హింసకు నేతలే కారణం

## సీఏఏ వ్యతిరేక ఆందోళనలపై ఆర్మీ చీఫ్‌ వివాదాస్పద వ్యాఖ్య
## మండిపడ్డ కాంగ్రెస్, ఇతర పక్షాలు

సీఏఏకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో ప్రజలు హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. నిరసనకారుల్లో ఎక్కువమంది విద్యార్థులు కూడా ఉన్నారు. ఇలా ప్రజలను హింసకు ప్రేరేపించడం నాయకత్వ లక్షణం కాదు

5 లో

నాయకుడంటే సరైన దిశలో నడిపించేవాడు. మంచి సూచనలిస్తూ మన సంక్షేమం పట్ల శ్రద్ధ తీసుకునేవాడు. అతడు ముందు వెళ్తుంటే ప్రతి ఒక్కరూ అనుసరిస్తారు. అయితే, ఇది అనుకున్నంత సులువు కాదు. చాలా క్లిష్టమైన వ్యవహారం.











ఇదం జగత్‌



# దుర్జనులకు భయం..
# సజ్జనులకు ప్రేమ



## మన శక్తిని చూస్తే ఇదే భావన కలుగుతోంది

- సమాజంలో దేశభక్తి పెంపొందించాలి
- సంఘ కార్య విస్తరణకు ప్రేమ, శ్రమే సాధనాలు
- చీఫ్‌ను కాదు.. మీరు నియమించుకున్న వ్యక్తిని మాత్రమే
- ఆర్‌ఎస్‌ఎస్‌ సర్‌సంఘ్‌చాలక్‌ మోహన్‌ భాగవత్‌
- ముగిసిన ఆర్‌ఎస్‌ఎస్‌ విజయ సంకల్ప శిక్షణ శిబిరం

సాక్షి, రంగారెడ్డి జిల్లా/ఇబ్రహీంపట్నం రూరల్‌

‘మన శక్తిని చూస్తే దుర్జనులకు భయం కలుగుతోంది. సమాజ శ్రేయస్సు కోరే సజ్జనుల్లో ప్రేమ పుడుతుంది’అని ఆర్‌ఎస్‌ఎస్‌ సర్‌సంఘ్‌చాలక్‌ మోహన్‌ భాగవత్‌ అన్నారు. సమాజంలో దేశభక్తి పెంపొందించేలా పని చేయాలని కరసేవకులకు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి వద్ద భారత్‌ ఇంజనీరింగ్‌ కాలేజీలో మూడు రోజులుగా జరుగుతున్న ఆర్‌ఎస్‌ఎస్‌ విజయ సంకల్ప శిబిరం ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మోహన్‌ భాగవత్‌ మాట్లాడుతూ.. సంఘ కార్య విస్తరణకు సమాజం పట్ల ప్రేమ, శ్రమించే తత్వమే ప్రధాన సాధనాలని పేర్కొన్నారు. ప్రవర్తన, భాష, సమాజహితం కోరే ఆలోచనలు స్వయం సేవకులకు ముఖ్యమని, వాటిని తెలియజేసే విధానం కార్య విస్తరణలో కీలకమని, వీటిని ఎప్పుడూ విస్మరించకూడదని చెప్పారు. శిబిరం, సార్వజనికోత్సవం ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో స్వయం సేవకులు తమ కార్యక్షేత్రాల్లో పని చేయాలని ఆకాంక్షించారు.

### నేను చీఫ్‌ను కాదు..

‘బయట నన్ను అందరూ ఆర్‌ఎస్‌ఎస్‌ చీఫ్‌ అంటున్నారు. నేను మీకు చీఫ్‌ను కాదు. మీరు నియమించుకున్న వ్యక్తిని’అని మోహన్‌ భాగవత్‌ పేర్కొన్నారు. దండాలు పెట్టడం, దండలు వేయడం, ఫొటో ఫ్లెక్సీలు పెట్టడం హిందూ సమాజ సంస్కృతి కాదని చెప్పారు. ఇతర సంఘాలకు, ఆర్‌ఎస్‌ఎస్‌కు తేడా ఉందని, మనకంటూ ప్రత్యేకత ఉండాలన్నారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలతో సమాజాన్ని జాగృతం చేయాలని, హిందు సమాజ నిర్మాణానికి

మిగతా 2వ పేజీలో ▶

# లేదు.. తెలియదు.. కాదు..!

## జడ్జి ప్రశ్నలకు ఇదీ సైకో శ్రీనివాస్‌రెడ్డి సమాధానం

- హాజీపూర్‌ హత్యల కేసులో నిందితుడిని విచారించిన నల్లగొండ కోర్టు
- తదుపరి విచారణ జనవరి 3వ తేదీకి వాయిదా

- వివరాలు 13లో




## నేడు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** కోమోరిన్ ప్రాంతం నుంచి దక్షిణ తమిళనాడు వరకు ఏర్పడిన ఉపరితల ద్రోణి బలహీనంగా మారడంతోపాటు ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. దీంతో శుక్రవారం రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు పేర్కొన్నారు.

## అమరావతిపై పునరాలోచన వద్దు

**కేరళ సెంట్రల్ వర్సిటీ చాన్స్‌లర్ ప్రొ.ఎస్వీఎస్**

**సాక్షి, హైదరాబాద్:** అమరావతి విషయంలో పునరాలోచన చేయకుండా అక్కడే రాజధానిని నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేరళ సెంట్రల్ వర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్వీ శేష గిరిరావు విజ్ఞప్తి చేశారు. అమరావతిపై రాష్ట్ర సర్కారే వివాదాన్ని కలిగించడం దురదృష్టకరమని ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. అమరావతికి అతి పురాతనమైన, చారిత్రక నేపథ్యం ఉందని, 450 ఏళ్లు వెలసిల్లిన శాతవాహనుల రాజధాని ఆ నగరమని చెప్పారు. చివరి శాతవాహన చక్రవర్తులు బౌద్ధ మతాన్ని ప్రోత్సహించాక అది ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రంగా అలరారిందని గుర్తు చేశారు. అమరావతి వంటి ప్రపంచ ఖ్యాతి కలిగిన నగరం ఏపీలో మరొకటి లేదని వివరించారు.


## దేశానికి మతం లేదు

**సాక్షి, హైదరాబాద్:** భారతదేశానికి ఓ మతం అంటూ లేదని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. గురువారం హైదరాబాద్ దారుస్సలాంలో అసదుద్దీన్ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ భారత్‌కు ఒక మతం ఉండాలనీ, అదీ హిందూ మతమే కావాలని భావిస్తోందన్నారు. రాజ్యాంగం ప్రకారం దేశానికి ఒకే మతం ఉండటానికి వీల్లేదని, దేశం అన్ని మతాలను గౌరవిస్తోందని పేర్కొన్నారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలపై ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ చేసిన వ్యాఖ్యలపై ఒవైసీ మండిపడ్డారు. నిరసన రాజ్యాంగబద్ధమైన హక్కని.. హింస జరిగితే ఆపడానికి పోలీసు, పారా మిలటరీ దళాలున్నాయని చెప్పారు. పౌరుల విషయాల్లో సైన్యం ఎందుకు జోక్యం చేసుకుంటోందని ప్రశ్నించారు.


అసదుద్దీన్ ఒవైసీ

## కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీలో చల్లాకు చోటు

**సాక్షి, న్యూఢిల్లీ:** ఢిల్లీ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల వడపోతకు ఏఐసీసీ ఆ రాష్ట్రానికి స్క్రీనింగ్ కమిటీని నియమించింది. రాజీవ్ సాతవ్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో ఏఐసీసీ కార్యదర్శి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీ చంద్‌రెడ్డిని సభ్యుడిగా నియమించారు. మరో సభ్యుడిగా వీరేందర్‌సింగ్ రాథోడ్ నియమితులయ్యారు. ఎక్స్–అఫీషియో సభ్యులుగా ఢిల్లీ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి పీసీ చాకో, పీసీసీ అధ్యక్షుడు సుభాష్ చోప్రా, ఏఐసీసీ సెక్రటరీ ఇన్‌చార్జి కుల్జీత్ ఎస్ నగ్రా ఉంటారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.




## ఆలస్యంగా బయలుదేరనున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీకి వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ (12723) శుక్రవారం ఆలస్యంగా బయలుదేరనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.25 గంటలకు బయలుదేరాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్.. 2 గంటలు ఆలస్యంగా ఉదయం 8.25కు బయలుదేరుతుందని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన ఓ రైలు ఆలస్యంగా నడవడమే ఈ జాప్యానికి కారణమన్నారు.

## నేడు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న సీతారాం ఏచూరి

**సాక్షి, హైదరాబాద్:** శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే పలు కార్యక్రమాల్లో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొననున్నారు. ఉదయం 11కు ఓయూలోని ఐసీఎస్‌ఎస్‌ఆర్ లైబ్రరీ హాలులో 'భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం.. లౌకిక వ్యవస్థను పరిరక్షిద్దాం' అంశంపై ఆయన మాట్లాడుతారు. మధ్యాహ్నం 3కు హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో 'సీఏఏ, ఎన్‌ఆర్సీ: సామాజిక న్యాయం–రాజ్యాంగ విలువలు' అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్‌లో ప్రసంగిస్తారు. సాయంత్రం 5.30కు ఎన్టీఆర్ స్టేడియంలోని హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో 'జమ్మూ, కశ్మీర్ విచ్ఛిన్నం' పుస్తకాన్ని విడుదల చేస్తారు. సాయంత్రం 7కు చార్మినార్ సానా గార్డెన్ ఫంక్షన్ హాలులో 'రాజ్యాంగాన్ని రక్షించండి–సెక్యులరిజాన్ని కాపాడండి' అంశంపై ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారు.



గురువారం ఒంగోలులో సూర్యగ్రహణం పట్టువిడుపుల చిత్రమాలిక




హైదరాబాద్‌లో..


మంచిర్యాలలో..


నల్లగొండలో..

## జనవరి చివర్లో విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు!

- తీవ్ర నష్టాలతో కొట్టుమిట్టాడుతున్న డిస్కంలు
- చార్జీల పెంపుతో లభించనున్న ఉపశమనం
- రూ.1000 కోట్ల వరకు చార్జీల పెంపునకు యోచన

**సాక్షి, హైదరాబాద్:** ఆర్థిక లోటు ఏటేటా పెరిగిపోతుండటంతో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రంలోని విద్యుత్ డిస్కంలు చార్జీల పెంపును ప్రతిపాదించనున్నాయి. జనవరి 25తో మునిసిపల్ ఎన్నికలు ముగియనుండగా, 31న ఈఆర్సీకి డిస్కంలు తమ వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్)లో భాగంగా ఈ పెంపు ప్రతిపాదనలను సమర్పించనున్నాయి. రాష్ట్రంలో గత మూడేళ్లుగా విద్యుత్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం అనుమతించలేదు. 2019–20 ముగిసే నాటికి డిస్కంల ఆర్థిక లోటు రూ. 11,000 కోట్లకు చేరనుందని, రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించిన రూ.6,079 కోట్ల విద్యుత్ రాయితీలు పోగా మొత్తం రూ.5,000 కోట్ల ఆర్థిక లోటు మిగలనుందని ఇంధనశాఖ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ సబ్సిడీలు తీసేసినా, 2020–21లో ఆర్థిక లోటు రూ. 6,000 కోట్లకు చేరనుందని అధికారవర్గాలు అంచనా వేశాయి.

**అన్ని రకాల కేటగిరీలపై ప్రభావం...**

చార్జీల పెంపు ద్వారా సుమారు రూ.1,000 కోట్ల అదనపు ఆదాయాన్ని ఆర్జించాలని డిస్కంలు భావిస్తున్నాయి. గృహ, వాణిజ్య, పారిశ్రామిక తదితర అన్ని కేటగిరీలపై వినియోగదారులపై మోస్తారుగా విద్యుత్ చార్జీల పెంపు ప్రభావం పడనుంది. నెలకు 100–200 యూనిట్ల విద్యుత్ వినియోగించే మధ్యతరగతి, 300 యూనిట్లపైగా వినియోగించే ఎగువ తరగతి కుటుంబాలపై చార్జీల పెంపు ప్రభావం చూపే అవకాశముంది. పారిశ్రామిక కేటగిరీ చార్జీలను స్వల్పంగా పెంచే అవకాశాలున్నాయి. డిస్కంల ప్రతిపాదనలపై ఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించి 2020–21కి సంబంధించిన టారిఫ్ ఉత్తర్వులను జారీ చేయనుంది. దీంతో 2020 ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలో చార్జీల పెంపు అమల్లోకి రానున్నాయి.

## విశ్వవిద్యాలయ కులపతిని బహిష్కరించిన విద్యార్థులు!

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లోని జాదవ్‌పూర్ వర్సిటీ విద్యార్థులకు, రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జగదీప్ ధంకార్‌కు మధ్య వివాదాలు ముదిరి పాకాన పడుతున్నాయి. పౌరసత్వ సవరణ చట్టంతోసహా అనేక అంశాల్లో కులపతి వైఖరి రుచించని విద్యార్థులు అతడిని ఇప్పటికే పలు సందర్భాల్లో విమర్శించిన సంగతి తెలిసిందే. తాజాగా గురువారం వర్సిటీ విద్యార్థులు ఏకంగా కులపతిని బహిష్కరిస్తున్న ట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆర్ట్స్ ఫ్యాకల్టీ స్టూడెంట్స్ యూనియన్(ఏఎఫ్ఎస్‌యూ), ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ స్టూడెంట్స్ యూనియన్(ఎఫ్ఈటీఎస్‌యూ)లు జగదీప్ ధంకార్‌కు ఓ బహిరంగ లేఖ రాశాయి. 'మాజీ కులపతి'అన్న సంబోధనతో మొదలైన ఈ లేఖలో విద్యార్థి సంఘాలు ధంకార్‌ను కులపతి పదవి నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 19న వర్సిటీ ప్రాంగణంలో బాంబులు వేసిన, విద్యార్థినులపై లైంగిక దాడులకు పాల్పడిన దుండగులతో కులపతి కలిసి ఉన్నారని ఆరోపించారు. 'మీ ప్రవర్తన శైలిపై, ఉద్దేశాలపై మేము విచారణ జరిపాం. విద్యార్థుల దృష్టిని ఆకర్శించేందుకు మీరు సిగ్గులేకుండా ప్రయత్నించారన్న అంచనాకు వచ్చాం' అని విమర్శలు గుప్పించారు. వర్సిటీ అధికారుల సమీక్షలో భాగంగా తాము గవర్నర్‌కు పలు అంశాలపై ప్రశ్నలు సంధించామని, వీటికి ఆయన ఇచ్చిన సమాధానాలు సంతృప్తికరంగా లేవని, అందువల్ల కులపతి స్థానం నుంచి తప్పిస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థి సంఘాలు రాసిన లేఖను గురువారం మీడియాకు విడుదల చేశారు.

**ట్వీట్‌తో సమాధానమిచ్చిన ధంకార్...**

కులపతిగా తనను బహిష్కరిస్తున్నట్లు విద్యార్థి సంఘాలు రాసిన లేఖపై పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగదీప్ ధంకార్ గురువారం ట్విట్టర్‌లో స్పందించారు. 'నిరసన తెలపడమన్నది ప్రజాస్వామిచ్చిన విలువైన బహుమతి. అసహనంగా మారినా, శాంతియుతంగా ఉండకపోయినా దానిపై (నిరసన) మరకలు ఏర్పడతాయి'అని ట్వీట్ చేశారు.

## నర్సుల 'వేతన' కష్టాలు

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించేందుకు రూ.1,000, ఇన్‌వార్డులో విధులకు రూ.750, నైట్‌షిఫ్ట్ అయితే రూ 1,200 ఇస్తున్నట్టు సమాచారం.

**2020 నర్సుల సంవత్సరం..**

వచ్చే ఏడాదిని నర్సుల సంవత్సరంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రకటించింది. రోగులకు ఆరోగ్య సేవలను అందించడంలో నర్సులు కీలకపాత్ర పోషిస్తారని తెలిపింది. అందువల్ల నర్సింగ్, మిడ్‌వైఫరీ వర్క్‌ఫోర్స్‌లో ఎక్కువ పెట్టుబడులు పెట్టడం ద్వారా మాత్రమే సార్వత్రిక ఆరోగ్య కవరేజీని సాధించగలమని డబ్ల్యూహెచ్‌ఓ చెప్పింది. కానీ అందుకు విరుద్ధంగా పరిస్థితులున్నాయి. డబ్ల్యూహెచ్‌ఓ లెక్కల ప్రకారం ప్రతీ వెయ్యి మందికి ఒక డాక్టరు, ప్రతీ 400 మందికి ఒక నర్సు ఉండాలి. కానీ ఇప్పుడు ప్రతి 1,200 మందికి ఒక డాక్టరు, ప్రతీ 600 మందికి ఒక నర్సు చొప్పున ఉన్నారు. ప్రపంచంలో నర్సులను తీర్చిదిద్దుతున్న టాప్ ఐదు దేశాల్లో భారత్ కూడా ఒకటి. అయినా ఇక్కడ నర్సులకు తీవ్ర కొరత ఉంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 19.80 లక్షల మంది నర్సులుండగా ఇంకా 20 లక్షల మంది నర్సులు అవసరం. ఇక రాష్ట్రంలో ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల్లో దాదాపు 88 వేల మంది నర్సులున్నట్లు అంచనా. ఇంకా 30 వేల మంది అవసరముంది. ఇదిలావుండగా రాష్ట్రంలో సర్కారు దవాఖానల్లో సుమారు 6 వేల నర్సింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెరిగిన అవసరాలకు అనుగుణంగా మరో 8 వేల పోస్టులు అవసరమవుతాయి. అయినప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు భర్తీపై దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి.

**కనీస వేతనాలు లేవు..**

రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేసే నర్సులకు దారుణంగా వేతనాలు ఇస్తున్నారు. రూ.15 వేలకు మించడంలేదు. కనీసంగా రూ.20 వేలు వేతనం ఇవ్వాలన్న కేంద్రం సిఫార్సులు అమలు కావడం లేదు. దీనిపై రాష్ట్రంలో వైద్య అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఖాళీలను భర్తీ చేయకపోవడంతో అనేక మంది నర్సింగ్ కోర్సు చదివినవారు నిరుద్యోగులుగా మారుతున్నారు.

– రుడావత్ లక్ష్మణ్, జనరల్ సెక్రటరీ, నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్, తెలంగాణ

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో భర్తీ లేకపోవడం వల్లే..**

చాలామంది నర్సింగ్ కోర్సు చదివి బయటకు వస్తుండటం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులు తక్కువ వేతనాలు ఇస్తున్నాయి. జిల్లాల్లో రూ.10 వేలు, నగరాల్లో రూ.12 వేల నుంచి రూ.15 వేల మధ్య మాత్రమే వేతనాలు ఇస్తున్నారు. కనీస వేతనాలు అమలు చేయడంలేదు. ప్రైవేటు ఆసుపత్రుల్లో టైమింగ్స్ కూడా అదనంగా ఉంటున్నాయి. దీంతో తీవ్రమైన పని భారం పడుతోంది.

– నిర్మలారాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ, నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్, తెలంగాణ

## 'జార్ఖండ్ ఓటమికి కారణాలపై సమీక్ష'

శ్రీనగర్

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి దారితీసిన కారణాలపై త్వరలో విశ్లేషణ జరుపుతామని బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ గురువారం తెలిపారు. ఎన్నికల ఫలితాలు తమ అంచనాల కంటే తక్కువగానే ఉన్నాయని, ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాలను మార్చడం జార్ఖండ్ ప్రజల తీరుగా కనిపిస్తోందని ఆయన విలేకరులతో అన్నారు. ఓటమికి కారణాలేమిటో తెలుసుకోవడంతోపాటు లోపాలను సరిదిద్దేందుకు పార్టీ చర్యలు చేపడుతుందన్నారు. మహారాష్ట్రలో ఫలితాలు తమకు అనుకూలంగా ఉన్నా.. తమ భాగస్వామి మోసం చేయడంతో అధికారం చేపట్టలేకపోయామని అన్నారు. మొత్తం 81 స్థానాలున్న జార్ఖండ్ అసెంబ్లీకి ఇటీవల ఐదు దశల్లో ఎన్నికలు జరగ్గా డిసెంబరు 23న ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్, ఆర్జేడీల కూటమికి 47 స్థానాలు దక్కగా, బీజేపీ 25 స్థానాలకు పరిమితమైంది.

## 'తెలుగు' ఉత్సవానికి సర్వం సిద్ధం

- నేటి నుంచి 4వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు
- విజయవాడ వేదికగా మూడు రోజులపాటు నిర్వహణ

**విజయవాడ కల్చరల్:** ప్రపంచ తెలుగు రచయితల 4వ మహాసభలు శుక్రవారం నుంచి ఆరంభం కానున్నాయి. మూడు రోజులపాటు ఇవి కొనసాగుతాయి. విజయవాడలోని మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల వేదికగా ఈ మహాసభలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలుగు భాష.. సంస్కృతి పరిరక్షణలో భాగంగా ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో నివసించే సాహిత్యాభిమానులైన తెలుగువారందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి భాషా వికాసానికి కృషి చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ మహాసభలను నిర్వహిస్తున్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం సహకారంతో ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మహాసభల్లో తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ, విదేశాలనుంచి 100 మందికిపైగా ప్రతినిధులు, 500 మందికిపైగా తెలుగు ప్రముఖులు పాలుపంచుకోనున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కంబార్ చేతులమీదుగా శుక్రవారం ఉదయం ఈ మహాసభలు ప్రారంభమవుతాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేవీ వరప్రసాద్‌రెడ్డి (శాంతా బయోటెక్), ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, రచయిత్రి శివరాజు సుబ్బలక్ష్మి, సినీ గేయ రచయితలు సిరివెన్నెల సీతారామశాస్త్రి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొంటారు.

- తొలిరోజున విదేశీ తెలుగు ప్రతినిధుల సదస్సు, చమత్కార చతుర్ముఖ పారాయణం, తెలుగు అవధానం, మహాసభల ప్రత్యేక కవి సమ్మేళనం జరుగుతుంది. పుస్తక ఆవిష్కరణలు జరుగుతాయి.
- రెండోరోజైన శనివారం నాటి సదస్సులో రాజకీయరంగ ప్రముఖుల సదస్సు, పాలనారంగ ప్రముఖుల సదస్సు, సంగీత నవావధానం, కావ్యాలలో తెలుగు తదితర అంశాలుంటాయి.
- మూడవ రోజైన ఆదివారం నాడు రాష్ట్రేతర తెలుగు ప్రతినిధుల సభ, పత్రికా ప్రసార మాధ్యమరంగ తెలుగు ప్రతినిధుల సదస్సు, మహిళా ప్రతినిధుల సమావేశం అంశాలు ఉంటాయి. అనంతరం ముగింపు సభ జరుగుతుంది. ఇందులో జస్టిస్ గ్రంధి భవానీప్రసాద్, జస్టిస్ కేజీ శంకర్, సీనియర్ సంపాదకులు ఎంవీఆర్ శాస్త్రి, సినీ గేయ రచయితలు సుద్దాల అశోక్‌తేజ, చంద్రబోస్ తదితరులు పాల్గొంటారు.

## కృష్ణా జలాల రివర్స్!

▶ మొదటి పేజీ తరువాయి

జూరాలలో నీటిలభ్యత పెంచే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. పాలమూరు ప్రాజెక్టులోని నాలుగో రిజర్వాయర్ అయిన 17.34 టీఎంసీల సామర్థ్యం ఉన్న కర్వెన రిజర్వాయర్ నుంచి కోయిల్‌సాగర్, సంగంబండలకు నెలకు ఒక టీఎంసీ, అటునుంచి జూరాలకు నెలకు 1.5 టీఎంసీల నీటిని తరలించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. దీనిపై ప్రాజెక్టు ఇంజనీర్లు ప్రాథమిక ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

**తరలింపు ఇలా..**

కర్వెన రిజర్వాయర్ కింద హై లెవల్ కెనాల్ (హెచ్‌ఎల్‌సీ)108 కిలోమీటర్లు ఉండగా, దాని ప్రవాహ సామర్థ్యం 2,213 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం కోయిల్‌సాగర్, సంగంబండ మీదుగా జూరాల వరకు నీటిని తరలించాలంటే దాని సామర్థ్యాన్ని 3,564 క్యూసెక్కులకు పెంచాల్సి ఉంటుంది. హెచ్‌ఎల్‌సీ 32వ కిలోమీటర్ నుంచి ఒక తూము (ఓటీ) నిర్మించి దాని నుంచి 386 క్యూసెక్కుల నీరు (నెలకు ఒక టీఎంసీ) తరలించేలా కాల్వలను నిర్మించి దాన్ని కోయిల్‌సాగర్ రిజర్వాయర్‌లో కలిసే హన్వాడ మండలంలోని చిన్నవాగులో కలపాలి. ఇలా కోయిల్‌సాగర్‌కు నీటిని తరలించేందుకు రూ.65 కోట్లు ఖర్చు కానుంది. ఇక కర్వెన రిజర్వాయర్ కింది హెచ్‌ఎల్‌సీ 90.7వ కిలోమీటర్ వద్ద మరో తూము నిర్మాణం చేసి, 965 క్యూసెక్కులు (నెలకు 2.5 టీఎంసీ, ఇందులో 1 టీఎంసీ సంగంబండకు, మరో 1.5 టీఎంసీలు జూరాలకు) తరలించేలా కాల్వలను తవ్వి దాన్ని నారాయణపేట మండలం సింగారం గ్రామంలో ఉన్న మాలవాగులో కలపాలి. దీనికి రూ.155 కోట్ల మేర ఖర్చు కానుంది. ఇక సంగంబండలో నీరు మిగులు అయితే అవి పెద్దవాగు ద్వారా జూరాల ప్రాజెక్టును చేరతాయి. అయితే ఈ నీటిని తరలించే క్రమంలో వివిధ నిర్మాణాలకు కలిపి రూ.180 కోట్లు ఖర్చు కానుంది. అయితే కర్వెన నుంచి జూరాలకు వరద నీటిని తరలించే క్రమంలో ఇప్పటికే ఎన్ని నిర్మాణాలు ప్రభావితం అవుతాయి.. ఇప్పటికే సాగులో ఉన్న ఆయకట్టు ఏమైనా దెబ్బతింటుందా? అన్న అంశం సమగ్ర సర్వేలోనే తేలనుంది. ప్రస్తుతం సిద్ధం చేసిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించిన అనంతరం ఆయన ఆమోదం మేరకు తుది ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు.

## దుర్జనులకు భయం.. సజ్జనులకు ప్రేమ

▶ మొదటి పేజీ తరువాయి

కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారతీయ సహసర్ కార్యవాహ్ ముకుందా, దక్షిణ మధ్య క్షేత్ర సంఘ చాలక్ నాగరాజు, తెలంగాణ ప్రాంత సంఘ చాలక్ బూర్ల దక్షిణామూర్తి, క్షేత్ర ప్రచారక్ ఆలే శ్యామ్‌కుమార్, దూసి రామకృష్ణతో పాటు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ ఎంపీ వివేక్, మాజీ మంత్రులు డీకే ఆరుణ, విజయ రామారావు, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ పాల్గొన్నారు.

**కార్యకర్తలతో కలసి భోజనం..**

మోహన్ భాగవత్‌తో పాటు బీజేపీ జాతీయ నేతలు, కేంద్ర మంత్రులు, ఎంపీలు, మాజీ మంత్రులకు కూడా ఒకే రకమైన భోజనం వడ్డించారు. అందరూ సాధారణ కార్యకర్తలతో కలిసే భోజనం చేశారు. ఆహార పదార్థాలు వృథా కాకుండా ప్రతి ఒక్కరూ భుజించడం ప్రత్యేకంగా కన్పించింది. కాగా, శిబిరం ముగింపు కార్యక్రమం వేదికపై మోహన్ భాగవత్‌తో పాటు దక్షిణ మధ్య క్షేత్ర సంఘ్‌చాలక్ నాగరాజు, తెలంగాణ ప్రాంత సంఘ్ చాలక్ దక్షిణామూర్తి ఉన్నారు. అయితే మోహన్ భాగవత్ ఒక్కరే ప్రసంగించారు.


విజయ సంకల్ప శిబిరంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

**క్రమశిక్షణకు మారుపేరుగా..**

మూడు రోజుల పాటు భారత్ కళాశాలలో సంఘ్ కార్యకర్తలు వసతి పొందారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన 7,940 స్వయం సేవకులు, మరో వెయ్యి మంది ప్రబంధకులు కలసిమెలసి ఉన్నారు. శిబిరం ముగియడంతో వారంతా తమ ప్రాంతాలకు తిరుగు పయనమయ్యారు. ఈ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమాలకు హాజరయ్యేందుకు చక్కటి నడవడిక, సమయ పాలన పాటించడాన్ని చూసి ఆహూతులు మంత్రముగ్ధులయ్యారు.

# మానసిక సుస్తీ

### పెరుగుతున్న ఆందోళన, ఆత్రుత వంటి మానసిక రుగ్మతలు


- దేశంలో ప్రతీ ఏడుగురిలో ఒకరికి మానసిక రోగం
- ఆ ప్రకారం 19.73 కోట్ల మందికి డిప్రెషన్ వంటి సమస్యలు
- ఉరుకులు పరుగుల జీవితాలు, చాలీచాలని జీతాలే ప్రధాన కారణాలు
- దక్షిణాదిలోనే ఆత్మహత్యల రేటు అధికం
- భారతీయ వైద్య పరిశోధన మండలి అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్

తెలంగాణలో అనేకమంది కుంగుబాటు (డిప్రెషన్), ఆత్రుత (యాంగ్జయిటీ) వం టి మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. తెలంగాణతోపాటు కేరళ, తమిళనాడుల్లో నూ ఈ రకమైన మానసిక రుగ్మతలు 1.4 రెట్లు పెరగడం గమనార్హం. 1990 నుంచి 2017 వరకు దేశంలో వివిధ రాష్ట్రాల్లో మానసిక రుగ్మతలపై కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) అధ్యయనం చేసింది. 'భారతదేశంలో మానసిక రుగ్మతల భారం'అనే పేరుతో ఒక నివేదికను తాజాగా విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం 2017లో దేశంలో 19.73 కోట్ల మందికి మానసిక రుగ్మతలు ఉన్నాయి. అంటే దేశంలోని మొత్తం జనాభాలో 14.3 శాతం మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. బాల్యం, టీనేజీల్లో మానసిక రుగ్మతల ప్రాబల్యం 1990–2017 మధ్య తగ్గినప్పటికీ, యుక్తవయసులో మానసిక రుగ్మతల ప్రాబల్యం పెరిగింది. ప్రతీ ఏడుగురు భారతీయులలో ఒకరు వివిధ రకాల తీవ్రమైన మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. 1990–2017 మధ్య మానసిక రుగ్మతలతో బాధపడే వారి సంఖ్య రెట్టింపు అయిందని నివేదిక తెలిపింది. ఆత్మహత్యల రేటు ఉత్తరాది రాష్ట్రాల కంటే దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కువగా ఉంది. 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు తెలంగాణలో మానసిక రుగ్మతల జాబితాలో ఉన్నారు. పురుషుల కంటే స్త్రీలు అధికంగా కుంగుబాటు, ఆత్రుతలకు గురవుతున్నారు. దీనికి ప్రధానంగా హార్మోన్ల అసమతుల్యత, కుటుంబ ఒత్తిడి తదితర కారణాలున్నాయి.

#### అకాల మరణాలు..

మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వ్యక్తులు అకాలంగా మరణిస్తారు. లేకుంటే మానసిక సమస్యల కారణంగా వైకల్యానికి గురవుతున్నారని నివేదిక తెలిపింది. మానసిక రోగాలతో బాధపడే వారిలో చాలామంది ఆస్పత్రుల్లో చేరడంలేదు. మన దేశంలో 1982లో నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాంను ప్రారంభించారు. దీన్ని 1996లో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమంగా మార్పులు చేసి తిరిగి ప్రారంభించారు. జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014లో అందుబాటులోకి వచ్చింది. 2017లో మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం వచ్చింది. ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ మానసిక ఆరోగ్య సేవలను సరిగా అమలు చేయడంలేదు. మానసిక, శారీరక ఆరోగ్యానికి సంబంధించిన రోగుల అవసరాలను గుర్తించడం, చికిత్స చేయడం తక్షణ కార్యక్రమంగా చేపట్టాలి. మహిళలు ఆత్మహత్యల వైపు పోకుండా చూడాలి. ఎందుకంటే భారతీయ మహిళలు ప్రపంచ మహిళా ఆత్మహత్య మరణాల రేటులో రెండింతలు కలిగి ఉన్నారు. యోగా కూడా మానసిక రుగ్మతల నుంచి కాపాడటానికి ఉపయోగపడుతుందని నివేదిక తెలిపింది.



**తెలంగాణలో ప్రతీ లక్ష మందిలో..**

| 3,750 | 3,600 | 4,000 | 742 |
|---|---|---|---|
| మందికిపైగా కుంగుబాటుతో బాధపడుతున్నారు | మంది ఆత్రుతతో బాధపడుతున్నారు | మంది వరకు మేధో వైకల్యం (ఇంటలెక్చువల్ డిజెబిలిటీస్)తో బాధపడుతున్నారు. | మంది ప్రవర్తన రుగ్మత (కండక్ట్ డిజార్డర్స్)తో బాధపడుతున్నారు. |

#### ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం..

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కావడం, ఎక్కడెక్కడో ఒంటరి బతుకు పోరాటం చేయడం.. చాలీచాలని జీతాలతో బతకడం.. పెళ్లిళ్లు పేరంటాలకు వెళ్లే పరిస్థితి లేకపోవడం.. ఇలా పలు కారణాలతో అనేకమంది మానసికంగా బాధపడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం ఆరోగ్యమంటే ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా పటిష్టంగా ఉండటమే. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. పోటీ ప్రపంచంలో ఉరుకులు పరుగుల జీవితమైంది. మానసిక సమస్యలతో బాధపడే వారిలో గ్రామాల కంటే పట్టణాల్లోనే రెండు మూడు రెట్లు అధికంగా ఉన్నట్లు తేలింది. అందువల్ల పట్టణాల్లో ప్రత్యేకంగా మానసిక చికిత్సాలయాలు మరిన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.

#### పీహెచ్‌సీ స్థాయి నుంచి మానసిక వైద్యం

ఇప్పటికే కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మానసిక రుగ్మతలపై రాష్ట్రాలను హెచ్చరించింది. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) స్థాయి నుంచి కూడా మానసిక రోగులకు వైద్యం అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డలో ఉన్న మానసిక చికిత్సాలయంలో మానసిక రోగులకు చికిత్స చేస్తున్నారు. అది కూడా అత్యంత తీవ్రమైన స్థాయికి వచ్చాకే జరుగుతోంది. కానీ మానసికంగా వివిధ స్థాయిల్లో ఉన్న రోగులకు వారివారి స్థితిని బట్టి చికిత్స చేసే పరిస్థితి లేనేలేదు. కాబట్టి పీహెచ్‌సీల్లోనూ మానసిక రోగులకు చికిత్స అందించేలా ప్రణాళిక రచించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. అందుకోసం కొందరికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

## 2 నెలల్లో భర్తీ చేయండి

### ఎఫ్‌ఎస్‌ఓ పోస్టుల భర్తీపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



**సాక్షి, హైదరాబాద్:** ఖాళీగా ఉన్న ఆహార భద్రతాధికారి పోస్టులు (ఎఫ్‌ఎస్‌ఓ) 36, గెజిటెడ్ స్థాయి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 6 ఫుడ్ కంట్రోలర్ పోస్టును 2 నెలల్లోగా భర్తీ చేయాలని టీఎస్‌పీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర జనాభా ప్రాతిపదికన ఎన్ని ఎఫ్‌ఎస్‌ఓ పోస్టులు అవసరమో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడుల్లో ఉన్న పోస్టుల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవాలని, గిరాకీ సరఫరాల ప్రాతిపదికపై మన రాష్ట్రంలో ఎన్ని పోస్టులు అవసరమో నిర్ణయించాలని సూచించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కార్బైడ్ వంటి రసాయనాలతో పండ్లను కృత్రిమంగా మగ్గబెట్టి మార్కెట్‌లో విక్రయిస్తున్నారని పత్రికల్లో వచ్చిన కథనాన్ని ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన ధర్మాసనం గురువారం దానిని మరోసారి విచారించింది. ప్రభుత్వం 61 పోస్టులను మంజూరు చేసిందని, అయితే అందులో 36 ఎఫ్‌ఎస్‌ఓ పోస్టుల్ని భర్తీ చేయలేదని కోర్టుకు సహాయకులుగా నియమితులైన సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి ధర్మాసనం దృష్టికి తేవడంతో పై ఉత్తర్వులు వెలువడ్డాయి. పిల్ విచారణ చేపట్టిన 2015 నుంచి 2019 నవంబర్ వరకూ కార్బైడ్‌తో పండ్లను కృత్రిమంగా మగ్గబెట్టి ఆహార భద్రతా చట్టాన్ని ఉల్లంఘించినట్లు ఎన్ని కేసులు నమోదయ్యాయో, ఎంతమందిని ప్రాసిక్యూట్ చేశారో, ఎంత మందికి శిక్ష పడిందో వంటి పూర్తి వివరాలతో కౌంటర్ పిటిషన్‌ను జనవరి 3 లోగా దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 6కి వాయిదా వేసింది.


### నేడు రాష్ట్రపతిని కలవనున్న

## ఉత్తమ్‌కుమార్ దంపతులు

**సాక్షి, హైదరాబాద్:** శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలవనున్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రామ్‌నాథ్ కోవింద్‌ను ఉత్తమ్‌కుమార్ మధ్యాహ్నం 12 గంటలకు సతీసమేతంగా కలవనున్నట్లు టీపీసీసీ వర్గాలు మీడియాకు తెలిపాయి.

## సర్కారు బడిలోనే పూర్వ ప్రాథమిక విద్య


- ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు పెంచితే నమోదు రెట్టింపు
- పీఆర్టీయూ తెలంగాణ విద్యా సదస్సులో వక్తలు
- సంఘ డైరీని ఆవిష్కరించిన హోంమంత్రి మహమూద్ అలీ



**సాక్షి, హైదరాబాద్:** ప్రతీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యను అందుబాటులోకి తేవాలని పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన విద్యా సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో పీఆర్టీయూ తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో విద్యా సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేరెడ్డి అంజిరెడ్డి అధ్యక్షత వహించగా.. రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రస్తుత పరిస్థితులను ప్రస్తావిస్తూ పలువురు ఉపాధ్యాయ నేతలు, విద్యావేత్తలు ప్రసంగించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు ఆంగ్ల మాధ్యమ తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సీసీఈ విధానంతో ఎలాంటి ఉపయోగం లేదని, ఈ విధానంలో మార్పులు అవసరమన్నారు. ప్రతి మండలానికి బాల, బాలికల కోసం ప్రత్యేకంగా గురుకుల పాఠశాలలను ప్రారంభించాలని, కులాలతో నిమిత్తం లేకుండా ప్రవేశాలు కల్పించాలన్నారు. ఆర్వీవో వ్యవస్థను బలపర్చాలని, పాఠశాలల్లోనే ప్రయోగాలు చేసేలా సౌకర్యాలు కల్పించాలని, అవసరానికి అనుగుణంగా పాఠశాలలను హేతుబద్ధీకరించి మరింత పటిష్టం చేయాలన్నారు. ఇంగ్లిష్ మీడియం పాఠశాలలను ప్రత్యేకంగా తెరిస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు వక్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ తెలంగాణ సంఘం రూపొందించిన డైరీని హోంమంత్రి మహమూద్ అలీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంప్లాయి ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉందని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే, సాధక బాధకాలు తెలిసిన నేత సీఎంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, వందేమాతరం ఫౌండేషన్ కార్యదర్శి ఎ.మాధవరెడ్డి, పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపకుడు పాతూరి సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంపై కేసీఆర్, అసద్ దాడి

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్



**సాక్షి, హైదరాబాద్:** టీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేస్తున్నది బీజేపీపై యుద్ధభేరి కాదని దేశ ప్రజాస్వామ్యంపై దాడి అని, దీనిని భారత సమాజం తిప్పికొడుతుందని బీజేపీ అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. కొన్ని రాజకీయ పక్షాలు అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, వాటిలో టీఆర్‌ఎస్, ఎంఐఎం కూడా ఉన్నాయని ఓ ప్రకటనలో ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రజలు వారి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్ర ప్రజలు టీఆర్‌ఎస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. పార్లమెంటులో చేసిన చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమనడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందన్నారు. అఖిల భారత ముస్లిం కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిజామాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీఎంకు అసదుద్దీన్ ఒవైసీ తెలపగా, అన్ని పార్టీల నేతలను ఆహ్వానించాలని సీఎం కోరడం దురదృష్టకరమన్నారు. దేశాన్ని రెండు వర్గాలుగా విభజించాలన్న విషపూరిత ఆలోచన కేసీఆర్‌లో ఉందనే విషయం దీని ద్వారా స్పష్టమవుతోందన్నారు. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ జనాభా పట్టికకు వ్యతిరేకంగా సీఎం కేసీఆర్ జనవరి 30న హైదరాబాద్‌లో 'గాంధీ కావాలా? గాడ్సే కావాలా?'అన్న నినాదంతో బహిరంగ సభ నిర్వహించే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోందని, సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రజల మధ్య విభజన తీసుకొచ్చేందుకు ప్రయత్నించడం సమంజసం కాదన్నారు. కేసీఆర్‌కు మున్సిపల్ ఎన్నికల భయం పట్టుకుందన్నారు. అందుకే జనవరి 30న సభ అని చెప్పి మున్సిపల్ ఎన్నికల్లో ముస్లిం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా టీఆర్‌ఎస్‌కు వేయించుకోవాలన్న దురుద్దేశం కనిపిస్తోందన్నారు.

## 2 నుంచి 7 వరకు నిరసనలు

### ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్

**సాక్షి, హైదరాబాద్:** ఢిల్లీలో నిర్వహించిన 'పరివర్తన్ సంగోష్ఠి'లో రైల్వే మంత్రిత్వ శాఖ తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా జనవరి 2 నుంచి 7 వ తేదీ వరకు నిరసన వారం నిర్వహించనున్నామని ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బ్రాంచి స్థాయిలో ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు, గేట్ సమావేశాలను నిర్వహిస్తామని వెల్లడించారు. రైల్వే ఉద్యోగులు ఈ నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఐఎంఎస్‌లో బినామీలపై నిఘా

### మరిన్ని అరెస్టులకు సిద్ధమవుతున్న ఏసీబీ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఈఎస్‌ఐకి చెందిన ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) కుంభకోణం కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దూకుడు పెంచింది. ఇప్పటికే ఐఎంఎస్ మాజీ డైరెక్టర్ దేవికారాణి, మాజీ జాయింట్ డైరెక్టర్ పద్మ, ఇతర ఉద్యోగులతోపాటు పలు ఫార్మా కంపెనీల యజమానులు, వారి బినామీలతో కలిపి 21 మంది నిందితులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దాదాపు రూ.1,000 కోట్లుగా అనుమానిస్తోన్న ఈ మొత్తం కుంభకోణంలో అరెస్టయిన వారంతా చంచల్‌గూడ జైలులోనే ఉన్నారు. ఇటీవల పలు ఫార్మా కంపెనీలతో దేవికారాణి నడిపిన అవకతవలకు సంబంధించి ఇద్దరి బినామీలను ఏసీబీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంలో ఇప్పటిదాకా దేవికారాణికి చెందిన బినామీలే అధికంగా అరెస్టయ్యారు. ఈ బినామీల జాబితా మరింత ఉందని తెలిసింది.

**మరో 10 మంది వరకు..**

ఈ కేసులో ఏసీబీ ఇంకా ప్రశ్నించాల్సిన వ్యక్తులు చాలామంది ఉన్నారు. ఇప్పటికే దేవికారాణి భర్త గురుమూర్తిని అరెస్టు చేసిన పోలీసులు, వారి కుటుంబ ఆస్తులు రూ.100 కోట్లకుపైగానే ఉంటాయని తెలిపారు. నిధుల దారి మళ్లింపునకు సంబంధించి అరెస్టు చేయాల్సిన బినామీలు మరో 10 మంది దాకా ఉన్నారని సమాచారం. వీరిలో సనత్‌నగర్‌లో పనిచేస్తోన్న ఓ ఉద్యోగి కీలక బినామీగా ఉన్నారని తెలిసింది. ఈ ఉద్యోగి బినామీగా వ్యవహరిస్తూ ఈఎస్‌ఐలో దారిమళ్లించిన నిధులతో బాగానే సంపాదించారు. తన పేరిట ఎలాంటి ఆస్తులు పెట్టుకోకుండా తన కుటుంబ సభ్యుల పేరిట భారీగా భూములు కొన్నారని ఏసీబీ ఆధారాలు సంపాదించింది. ఇతడి వద్ద దేవికారాణికి సంబంధించిన డొల్ల కంపెనీల లిస్టు మొత్తం ఉందని సమాచారం.

**పీఎంజేపైనా కేసు..?:** దేవికారాణి దాదాపు రూ.7.3 కోట్ల విలువైన నగలను నగరానికి చెందిన పీఎంజే జ్యువెలరీస్‌లో కొన్నట్లు అధికారులు గుర్తించారు. నగలకు కావాల్సిన మొత్తాన్ని పీఎంజే జ్యువెలరీస్ నగదు రూపంలో తీసుకున్నట్లు గుర్తించారు. దేవికారాణి తాను తీసుకునే లంచాలను తన మనుషుల ద్వారా నేరుగా పీఎంజే జ్యువెలరీస్‌కు తరలించి, నగలను ఆర్డర్ చేసినట్లు కూడా ఏసీబీ ఆధారాలు సంపాదించింది. ఆన్‌లైన్ లావాదేవీలు జరిపితే ట్యాక్స్ ఇబ్బందులు తలెత్తుతాయన్న భయంతో చెల్లింపులన్నీ నగదు రూపంలోనే జరిగాయని సమాచారం. దీంతో పీఎంజే జ్యువెలరీస్‌పైనా కేసు నమోదుకు ఏసీబీ యోచిస్తున్నట్లు సమాచారం.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED FACULTY
FOR DIGITAL VIDEO CLASSES
REQUIRE SUBJECT EXPERTISE
ATTRACTIVE SALARY (ACCOMMODATION + FOOD For Non Locals)
Mail Demo Video (5-8 Mins) on Below Topics
Before 1st January 2020
MATHS - CONSTRUCTIONS
BIOLOGY - REPRODUCTION
PHYSICS - MOTION, FORCE, WORK
CHEMISTRY - PERIODIC CLASSIFICATIONS
eMail Id : info@bpreprd.com
Whatsapp / WalkIn Appointments.
7997 84 6667, Madhapur, Hyderabad.
SELECTED VIDEOS WILL BE AWARDED ₹10,000 CASH PRIZE

భారతీయ రిజర్వ్ బ్యాంక్ సర్వీసెస్ బోర్డ్, ముంబయి

ప్రకటన సంఖ్య: 2/2019-20

1. భారతీయ రిజర్వ్ బ్యాంక్ నందు ఈ క్రింది పదవుల నియామకం కొరకై దరఖాస్తులు కోరబడుచున్నవి.

| క్ర.సం | పదవులు | ఖాళీల సంఖ్య |
|---|---|---|
| పానెల్ ఇయర్ – 2018 | | |
| 1 | లీగల్ ఆఫీసర్ – గ్రేడ్ బి | 1 |
| 2 | మేనేజర్ (టెక్నికల్ – సివిల్) | 2 |
| 3 | అసిస్టెంట్ మేనేజర్ (రాజభాష) | 8 |
| 4 | అసిస్టెంట్ మేనేజర్ (ప్రోటోకాల్ అండ్ సెక్యూరిటీ) | 5 |
| పానెల్ ఇయర్ – 2019 | | |
| 5 | లైబ్రరి ప్రొఫెషనల్ (అసిస్టెంట్ లైబ్రేరియన్) – గ్రేడ్ ఏ | 1 |

2. ఇతర వివరములకు అనగా అర్హతా ప్రమాణములు, రిజర్వేషన్లు, ఎంపిక విధానం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయు విధానము, ఇతర సూచనలు కొరకు ఆర్.బి.ఐ వెబ్‌సైట్ (www.rbi.org.in) నందు **డిసెంబర్ 27, 2019**వ తేదీన మరియు ఎంప్లాయ్‌మెంట్ న్యూస్/రోజ్ గార్ సమాచార్ ప్రతులలో సమగ్ర ప్రకటనను **డిసెంబర్ 28, 2019 / తరువాత** చూడగలరు. అభ్యర్థులు ఈ పదవులకు, బ్యాంక్ వెబ్‌సైట్ ద్వారా, ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేయగలరు.

3. ముఖ్యమైన తేదీలు:

| | |
|---|---|
| ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేయడానికి, ఫీజు / ఇంటిమేషన్ చార్జీలు చెల్లించడానికి, వెబ్‌సైట్ లింక్ అందుబాటులో ఉండే తేదీలు. | 30.12.2019 నుండి 20.01.2020 వరకు. |

**గమనిక:** ఈ ప్రకటనకు సంబంధించి ఏవైనా సవరణలు ఉన్నట్లయితే బ్యాంక్ వెబ్‌సైట్ **www.rbi.org.in** నందు మాత్రమే ప్రచురించబడును. హిందీ ప్రకటనను దైనిక్ జాగ్రన్, నయా దునియా మరియు నవభారత్ టైమ్స్‌లో చూడగలరు.

## ఓయూలో విదేశీ విద్యార్థి ఆత్మహత్య

### తార్నాకలోని వర్సిటీ హాస్టల్‌లో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

**తార్నాక:** ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతున్న ఇథియోపియా దేశానికి చెందిన ఓ పరిశోధన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. ఖాలిద్ ములేటాబల (33) అనే విద్యార్థి ఓయూ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తూ తార్నాకలోని ఓయూ విదేశీ విద్యార్థుల హాస్టల్ 109 గదిలో ఒక్కడే ఉంటున్నాడు. కొంతకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతున్న ఖాలిద్ 3 నెలల క్రితం స్వదేశానికి వెళ్లి నవంబర్ 26న తిరిగి ఓయూకు వచ్చాడు. ఈ నెల 21న రాత్రి ఖాలిద్ ముందుగా కొన్ని టాబ్లెటు మింగి.. ఆ తర్వాత తన గదిలోని వాష్‌రూమ్‌కు వెళ్లి ముఖానికి ఊపిరి ఆడకుండా ప్లాస్టిక్ కవర్ కట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాస్టల్‌లోని తోటి విద్యార్థి ఒకరు ఖాలిద్ గదికి వెళ్లి తలుపు కొట్టగా ఎంతకు తీయకపోవడంతో వాచ్‌మన్ సాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఖాలిద్ బాత్‌రూమ్‌లో విగతజీవిగా పడి ఉన్నాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఇథియోపియాలోని ఆయన గ్రామానికి తరలించారు. ఖాలిద్‌కు భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిసింది.

**ఒత్తిడితోనే ఆత్మహత్య..?**

ఖాలిద్ తీవ్ర మానసిక వేదనకు గురయ్యేవాడని తోటి విద్యార్థులు పేర్కొన్నారు. ఇటీవల ఇథియోపియా వెళ్లి వచ్చిన తర్వాత అతడి ప్రవర్తనలో మార్పు లేకపోవడం, తీవ్ర మానసిక ఒత్తిడితో ఉండటం చూసి తోటి విద్యార్థులు తిరిగి ఇథియోపియాకు పంపించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆత్మహత్య ఎలా చేసుకోవాలో యూట్యూబ్‌లో వీడియో క్లిప్పింగులను చూసి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఖాలిద్ గదిలో వందల సంఖ్యలో టాబ్లెట్లు లభించాయి. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


## 'బాలబడి'కి కొత్త భవనాలు బంద్!

### అంగన్‌వాడీలకు నూతన భవనాల జారీపై వెనక్కి తగ్గిన సర్కారు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను ప్రస్తుతానికి నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ఖర్చులు తగ్గించుకోవాలని ప్రభుత్వం భావిస్తుండగా.. దానికితోడు అంగన్‌వాడీ కేంద్రాల హేతుబద్ధీకరణ నేపథ్యంలో ఈ మేరకు ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. పిల్లల నమోదు తక్కువగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సమీప కేంద్రాల్లో విలీనం చేసేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఇప్పటికే చర్యలు వేగిరం చేసింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించి కేంద్రాల వారీగా నివేదికలను తెప్పిస్తోంది. నెలాఖరులోగా జిల్లాల వారీగా నివేదికలు సమర్పించాలని స్పష్టం చేసిన ప్రభుత్వం.. వచ్చే నెలలో హేతుబద్ధీకరణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసే అవకాశముంది. ఈ క్రమంలో కొత్తగా అంగన్‌వాడీ భవన నిర్మాణాలను కొంతకాలం వాయిదా వేయాలని భావించిన ఉన్నతాధికారులు ఈ మేరకు నూతన నిర్మాణాలకు బ్రేక్ వేశారు. దీంతో 2019–20 వార్షిక సంవత్సరంలో నిర్మించాలని ప్రతిపాదించిన పనులన్నీ వాయిదా పడినట్లే. గత వారం ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ నిర్మాణ పనులపై చర్చించిన ఉన్నతాధికారులు ఈ మేరకు ఆదేశించినట్లు తెలిసింది.

**ఆ పనులకూ బ్రేకులు..**

రాష్ట్రవ్యాప్తంగా 149 సమగ్ర శిశు అభివృద్ధి ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతుండగా.. మరో 15 శాతం కేంద్రాలు భవనాల నిర్వహణ సరిగ్గా లేక శిథిలస్థితికి వచ్చాయి. నిర్మించి ఎక్కువ రోజులు కావడంతో పెచ్చులూడుతుండగా.. కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నవాటికి మరమ్మతులు చేయడమో.. లేక కొత్తగా నిర్మాణాలు చేపట్టడమో జరగాలి. ఈ క్రమంలో జిల్లా యంత్రాంగం నిధులు లేక జిల్లా పరిషత్ నిధుల నుంచి ఏటా కొన్ని అంగన్‌వాడీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సమర్పిస్తుండటంతో ప్రభుత్వం ఆమోదిస్తూ వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 2,750 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో సగానికిపైగా పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో ఈ పనులను సైతం నిలిపివేయాలని, తిరిగి ఆమోదం తీసుకున్న తర్వాతే పనులు ప్రారంభించాలని అధికారులు ఆదేశించారు. అయితే ప్రాథమిక పాఠశాలల పరిధిలో ఉన్న వాటి నిర్మాణాలకు మాత్రం ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో దాదాపు 700 పనులకు ఉపశమనం లభించినట్లే. అయితే వీటికి సంబంధించి కూడా ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు.



## విపక్షాలది ఉద్దేశపూర్వక ప్రచారం

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి**



**సాక్షి, హైదరాబాద్:** 2021లో జరగనున్న జనగణనలో అంతర్భాగంగానే ప్రస్తుత ఎన్‌పీఆర్‌ను చేపడుతున్నట్టు, ఆ మాటకొస్తే యూపీఏ ప్రభుత్వం 2010లో ప్రారంభించిన ఎన్‌పీఆర్ ప్రక్రియను కొనసాగిస్తున్నట్టు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్‌పీఆర్ అనేది ఎన్‌ఆర్‌సీకి ముందస్తు చర్యల్లో భాగమని ప్రతిపక్షాలు, మీడియాలోని ఓ వర్గం ఉద్దేశపూర్వకంగా చేస్తున్న నిరాధారమైన అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు హైదరాబాద్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. రెండింటి మధ్య ఎటువంటి సంబంధం లేదని కరాఖండిగా తెలిపారు. అయితే ఇందులో భాగంగా మూడు నాలుగు అదనపు అంశాలు జోడించి ఒక వ్యక్తి తల్లిదండ్రులు పుట్టిన ప్రదేశానికి సంబంధించిన వివరాలు, ఆధార్ కార్డ్ నంబర్, చివరి నివాస స్థలం ఎన్‌పీఆర్‌లో పొందుపరచనున్న కనీస ప్రాథమికాంశాలని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని సన్నగిల్లేలా చేయడానికి అపోహలు సృష్టించి ప్రజల మనసులతో ఆటలాడుతున్నాయని ధ్వజమెత్తారు. దేశంలో సమర్థవంతంగా అమలవుతున్న సంక్షేమ ఎజెండాను నిర్వీర్యం చేసి, పేదరిక నిర్మూలనకు సంబంధించిన ఆయుష్మాన్ భారత్ వంటి వివిధ పథకాల అమలుకు విఘాతం కల్గించడం వీరి లక్ష్యంగా కనబడుతోందన్నారు. అందరి సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఏ ప్రభుత్వమూ ప్రామాణికమైన సమగ్రమైన డేటా లేకుండా తన విధానాలను రూపొందించలేదన్నారు. కాబట్టి అసత్యాలతో, అర్ధ సత్యాలతో గగ్గోలు పెడుతూ గోబెల్స్ మాదిరిగా విపక్షాలు, ఇతరులు చేస్తున్న ఈ ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## దేశద్రోహులకు మద్దతిస్తారా?: పొంగులేటి



**సాక్షి, హైదరాబాద్:** పాకిస్తాన్ నుంచి వచ్చిన వారికి, ఉగ్రవాదులతో సంబంధమున్న వారికి దేశ పౌరసత్వం ఇవ్వాలా? దేశ ద్రోహులకు విపక్షాలు మద్దతునిస్తాయా అని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ప్రశ్నించారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని శరణార్థుల కోసం తీసుకొస్తే దానిని కూడా విపక్షాలు వివాదాస్పదం చేస్తున్నాయన్నారు. పార్టీ నాయకులు డా. పద్మ, సుధాకరశర్మలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ విషయంలో టీఆర్‌ఎస్, ఎంఐఎం మోకాలికి, బోడి గుండుకు లంకె పెట్టేలా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. దేశంపై తమ గుత్తాధిపత్యం కొనసాగాలనే అక్కసుతో సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి, అవకాశవాద పొత్తులతో కాంగ్రెస్ పార్టీ కాస్తా కమర్షియల్ పార్టీగా మారిందని ఆరోపించారు.

## కేంద్ర, రాష్ట్రాల తిరోగమన నిర్ణయాలను తిప్పికొట్టాలి: చాడ



**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, తిరోగమన నిర్ణయాలను తిప్పికొట్టాలని సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకు అవసరమైన ఉద్యమాలకు కార్యకర్తలు, ప్రజలు సిద్ధం కావాలన్నారు. గురువారం సీపీఐ 95వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సత్యనారాయణరెడ్డి భవన్‌లోని నగర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చాడ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వరకు సీపీఐ ప్రజల పక్షాన నిలబడి ప్రజా పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఆర్థిక అసమానతలు, పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలతోపాటు అరాచకాల్లేని నవ సమాజ స్థాపనే లక్ష్యంగా పార్టీ అహర్నిశలు కృషి చేస్తోందని పేర్కొన్నారు. అయితే కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతృత్వ పోకడలను అనుసరిస్తూ ప్రజలను ఇబ్బందుల పాల్జేస్తున్నారని విమర్శించారు. మహిళలపై హత్యాచారాలు, నేరాలు పెరిగిన నేపథ్యంలో అందుకు కారణమైన మద్యం నియంత్రణకు సీపీఐ పోరాడుతోందని నగర కార్యదర్శి ఇ.టి.నరసింహ తెలిపారు. జెండా ఆవిష్కరణ అనంతరం సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి పార్టీ నేతలు అజీజ్‌పాషా, పల్లా వెంకటరెడ్డి, వీఎస్‌బోస్, ఛాయాదేవి, ఎం.నరసింహ, చంద్రమోహన్ తదితరులు ఎర్ర చొక్కాలు ధరించి మఖ్దూం భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

## క్రైస్తవులకు టీఆర్‌ఎస్ క్షమాపణ చెప్పాలి



**ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్**

**సాక్షి, హైదరాబాద్:** సీఎం కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చాక క్రైస్తవులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్ ఆరోపించారు. గురువారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ మాయమాటలు చెప్పి క్రైస్తవులను మోసం చేస్తున్నారని విమర్శించారు. అందమైన క్రైస్తవ భవనం నిర్మాణం, మిషనరీ భూముల పరిరక్షణకు చట్టం తెస్తామని అసెంబ్లీ వేదికగా టీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇమామ్‌లకు ఇస్తున్నట్లుగానే పాస్టర్లకూ గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పడం కన్నా ముందు టీఆర్‌ఎస్ వారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## దేశం దృష్టి మళ్లించడానికే ఎన్‌ఆర్సీ

**ఏఐసీసీ అధికార ప్రతినిధి శక్తిసింగ్ గోయల్**



**సాక్షి, హైదరాబాద్:** తన డిగ్రీ సర్టిఫికెట్ చూపించని ప్రధాని మోదీ దేశంలోని ప్రజలంతా తమ సర్టిఫికెట్లు చూపించాలని అడుగుతున్నారని ఏఐసీసీ అధికార ప్రతినిధి శక్తిసింగ్ గోయల్ ఎద్దేవా చేశారు. అసోం తరహాలో దేశమంతా పౌర రిజిస్టర్ అమలు చేసేందుకు కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆయన ఆరోపించారు. గురువారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమ కుమార్, ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రావణ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అనుసరిస్తోన్న తిరోగమన విధానాలతో దేశం ఆర్థికంగా కుంగిపోయిందని విమర్శించారు. మన్మోహన్ హయాంలో ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ఇప్పుడు అన్ని రంగాల్లో కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా దేశం పతనం అవుతున్న విషయం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఎన్‌ఆర్సీని తెరపైకి తెచ్చారని విమర్శించారు. లౌకికవాద భావాలతో దేశాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చే భావజాలంతో పనిచేసే కాంగ్రెస్ బీజేపీ కుయుక్తులను అడ్డుకుని తీరుతుందని గోయల్ వెల్లడించారు.

Government of Andhra Pradesh
Department of Agriculture
REQUEST FOR PROPOSAL (RFP)
Department of Agriculture, AP invites bids for selection of Service provider for Development & Maintenance of UNIFIED DIGITAL PLATFORM portal and Mobile App for Dr YSR Agri Labs. For other details please visit : www.apagrisnet.gov.in
Sd/- Sri H. Arun Kumar
Special Commissioner of Agriculture
DIPR RO.No. 296-PP/CL/Advt/1/1/2019-20, Dt: 26.12.2019

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
2వ అంతస్తు, ప్లాట్ నం.9, సర్వే నెం. 49, IT పార్క్, మంగళగిరి - 522503
ఫోన్ నం: 8978680708, ఇమెయిల్: aphmhidc@gmail.com
టెండరు నోటీసు నం.12/APMSIDC/Equipment/2019-20, తేది: 26.12.2019
దిగువ తెలిపిన వాటి కోసం APMSIDC ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాం ద్వారా టెండరు కోరుతుంది. అవి:
1). ఆం.ప్ర.లో 104 మొబైల్ మెడికల్ యూనిట్ సర్వీసుల కొరకు సర్వీస్ ప్రొవైడర్ ఎంపిక కోసం ప్రతిపాదనకు అభ్యర్థన (2వ పిలుపు)
2). ఆం.ప్ర.లో APVVP హాస్పిటల్స్‌కు మెడికల్ ఎక్విప్‌మెంట్ సేకరణ
సవివరమైన నోటిఫికేషన్ మరియు తదుపరి వివరాల కొరకు వెబ్‌సైట్ http://msidc.ap.nic.in & www.tender.apeprocurement.gov.in ను దర్శించగలరు.
ఎటువంటి కారణాలు తెలుపకుండా ఏ సమయంలోనైనా టెండర్లను రద్దు చేయటకు APMSIDC కు హక్కు కలదు.
సం/- మేనేజింగ్ డైరెక్టర్
DIPR Ro.No.294PP/CL/Advt/1/1/2019-20, Dt: 26/12/2019




గురువారం టీపీసీసీ కోర్ కమిటీ భేటీలో భట్టి, ఉత్తమ్, షబ్బీర్ అలీ, కుసుమకుమార్, గూడూరు, వంశీచంద్‌రెడ్డి తదితరులు

# రిజర్వేషన్లు తేలకముందే మున్సిపోల్స్‌కు షెడ్యూలా?

**ఈసీ షెడ్యూల్‌ను తప్పపట్టిన టీపీసీసీ కోర్ కమిటీ**

- రిజర్వేషన్ల ఖరారు తర్వాత నామినేషన్‌కు వారమైనా గడువివ్వాలి
- దీనిపై హైకోర్టుకెళ్తాం.. పొత్తుల అధికారం స్థానిక నాయకత్వాలకే..
- ఎన్ని అడ్డంకులొచ్చినా ఎన్‌ఆర్సీ నిరసన ర్యాలీ నిర్వహిస్తాం

**సాక్షి, హైదరాబాద్:** వార్డుల రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా ఖరారు చేయకుండానే పురపాలిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంపై టీపీసీసీ కోర్‌కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల నిర్వహణకు ముందు చేయాల్సిన ప్రక్రియను పూర్తి చేయకుండానే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడాన్ని తప్పుపట్టింది. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన టీపీసీసీ కోర్ కమిటీ భేటీ అయింది. ఇందులో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రులు షబ్బీర్ అలీ, చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జెట్టి కుసుమకుమార్, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు శ్రీనివాస్‌కృష్ణన్, సంపత్ కుమార్, వంశీచందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**కనీసం వారమైనా ఇవ్వాల్సింది..**

భేటీలో భాగంగా ఈనెల 28న పార్టీ వ్యవస్థాపక దినోత్సవ నిర్వహణ, ఎన్‌ఆర్సీకి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ, మున్సిపల్ ఎన్నికలపై పార్టీ నేతలు చర్చించారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌పై చర్చించిన నేతలు ఎన్నికల సంఘం తీరును ఆక్షేపించారు. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత అభ్యర్థులను ఎంపిక చేసుకుని, వారు నామినేషన్ దాఖలుకు వీలుగా అన్ని పత్రాలు సిద్ధం చేసుకునేందుకు కనీసం వారం సమయం కావాల్సిందేనని అభిప్రాయపడ్డారు. అలా కాకుండా కేవలం ఒక్కరోజు మాత్రమే గడువు ఇవ్వడం సరైంది కాదని, దీనిపై హైకోర్టుకు వెళ్లాలని టీపీసీసీ నేతలు నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను నిలిపేయాలని అడగటం లేదని, అయితే పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం తగిన సమయం ఇవ్వాలని మాత్రమే కోర్టును కోరాలని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పార్టీ పరంగా మున్సిపల్ ఎన్నికల సమాయత్తంపై కూడా నేతలు చర్చించారు. ఎన్నికలను ఎదుర్కొనేందుకు స్థానిక నాయకత్వాలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు అమలు చేయాలని నిర్ణయించారు. ఈ ఎన్నికలను ఒంటరిగానే ఎదుర్కోవాలని అభిప్రాయపడ్డ కోర్‌కమిటీ.. స్థానికంగా అవసరమైన స్థానాల్లో భావసారూప్య పార్టీలతో పొత్తు పెట్టుకునే అధికారం స్థానిక నాయకత్వానికే ఇవ్వాలని నిర్ణయించింది.

**డీజీపీని అడిగితే డీసీపీ స్పందిస్తారా?**

కోర్‌కమిటీ సమావేశంలో భాగంగా ఈనెల 28న పార్టీ వ్యవస్థాపక దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లు, అదే రోజున నిర్వహించనున్న ఎన్‌ఆర్సీ వ్యతిరేక ర్యాలీ గురించి కూడా నేతలు చర్చించారు. నిరసన ర్యాలీకి అనుమతి ఇవ్వాలని తాము డీజీపీని కోరితే స్థానిక డీసీపీ స్పందించి ర్యాలీకి అనుమతి లేదనడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా నిరసన ర్యాలీ నిర్వహించి తీరాల్సిందేనని కోర్‌కమిటీ నిర్ణయించింది. ఇక నిజామాబాద్‌లో యునైటెడ్ ముస్లిం ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 27న ఎన్‌ఆర్సీకి వ్యతిరేకంగా నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొనడంపై కూడా కోర్‌కమిటీ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి హాజరు కావాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ తనకు ఫోన్ చేశారని టీపీసీసీ కోశాధికారి గూడూరు దృష్టికి తెచ్చారు. దీంతో పీసీసీ చీఫ్‌కి చేయాల్సిన ఫోన్ మీకెందుకు చేశారని గూడూరును షబ్బీర్ అలీ ప్రశ్నించినట్టు సమాచారం. పీసీసీ అధ్యక్షుడు ఫోన్ అందుబాటులో లేకపోవడంతో తనకు ఫోన్ చేశారని గూడూరు బదులిచ్చారు. అయితే సీఎం కేసీఆర్‌ను స్వయంగా ఆహ్వానించి కాంగ్రెస్ వారిని ఫోన్ చేసి పిలవడం సరైంది కాదని పలువురు నేతలు అన్నారు. బీజేపీ, టీఆర్‌ఎస్‌లు పాల్గొనే ఏ వేదికను కాంగ్రెస్ పంచుకునేది లేదని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ స్పష్టం చేశారు. కాగా, కోర్‌కమిటీ సమావేశానికి సభ్యులు కానివారిని పిలుస్తున్నారంటూ మాజీ ఎంపీ వీహెచ్ సమావేశాన్ని బహిష్కరించడం గమనార్హం.

**ర్యాలీకి అనుమతివ్వండి..**

కోర్‌కమిటీ సమావేశం అనంతరం సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, పొన్నం ప్రభాకర్, కుసుమ కుమార్, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు డీజీపీ మహేందర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈనెల 28న తాము నిర్వహించనున్న నిరసన ర్యాలీకి అనుమతినివ్వాలని, డీసీపీ చేత అనుమతి లేదని చెప్పించడం భావ్యం కాదని ఆయన దృష్టికి తెచ్చారు. తాము శాంతియుతంగానే గాంధీభవన్ నుంచి ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్తామని, తమ పార్టీ జాతీయ స్థాయిలో తీసుకున్న నిర్ణయం కనుక అనుమతి ఇవ్వాలని కోరారు. కాగా, టీపీసీసీ నేతల విజ్ఞప్తిపై పోలీసు అధికారులతో మాట్లాడి నిర్ణయాన్ని వెల్లడిస్తామని డీజీపీ కాంగ్రెస్ నేతలకు చెప్పినట్టు సమాచారం.

## వారితో వేదికలను పంచుకోం

**ఎన్‌ఆర్సీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తోంది కాంగ్రెస్సే..**

- కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారు
- ప్రశ్నిస్తే టీఆర్‌ఎస్ నేతలు మొరుగుతున్నారు: టీపీసీసీ చీఫ్ ఉత్తమ్

**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ, టీఆర్‌ఎస్‌లు పాల్గొనే ఏ వేదికనైనా తాము పంచుకునేది లేదని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. పౌరసత్వ రిజిస్టర్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే ఆందోళనలు జరుగుతున్నాయని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా తామే ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని ఆయన వెల్లడించారు. గురువారం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ కోర్‌కమిటీ సమావేశం అనంతరం పార్టీ నేతలు భట్టి, షబ్బీర్, జీవన్‌రెడ్డి, పొన్నాల, కుసుమకుమార్, సంపత్, వంశీ, చిన్నారెడ్డి తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పౌరసత్వ సవరణ చట్టం, ఎన్‌ఆర్సీలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నా ఏమీ పట్టనట్టు మౌన ప్రేక్షకుడిలా ఆయన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి మొదటి నుంచీ కేసీఆర్, టీఆర్‌ఎస్ పార్టీలు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని, ఈ విషయంలో కూడా మౌనంగా ఉండడం ద్వారా కేసీఆర్ బీజేపీకి మద్దతిచ్చి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పెద్ద నోట్ల రద్దు చర్యను దేశంలోని అందరు సీఎంలకన్నా ముందే ఆయన సమర్థించారని, తెలంగాణ బిల్లు పాస్ చేయించిన మీరాకుమార్‌కు మద్దతివ్వకుండా ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం కలిగిన రామ్‌నాథ్ కోవింద్‌కు మద్దతిచ్చారని, జీఎస్టీ, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ ఇదే వైఖరి అవలంబించారని ఉత్తమ్ గుర్తు చేశారు. ట్రిపుల్ తలాక్, 370 ఆర్టికల్ రద్దు అంశాలను కూడా సమర్థించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆ విధంగా అవకాశవాదంతో ఎన్నడూ వ్యవహరించలేదని, పార్టీ ప్రయోజనాల కన్నా దేశమే ముఖ్యమనేదే కాంగ్రెస్ విధానమని చెప్పారు.

**ఎందుకు మొరుగుతున్నారు?**

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను ఆదరాబాదరాగా ఎందుకు విడుదల చేయాల్సి వచ్చిందని ఉత్తమ్ ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేయాలన్నది కాంగ్రెస్ విధానం కాదని, వార్డుల రిజర్వేషన్ తర్వాత నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆశావహులకు కొంత సమయం కావాలని, ఆ విధంగా షెడ్యూల్‌లో మార్పులు చేయాలని తాము కోరుతున్నామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికలను నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నదే తమ డిమాండ్ అని అన్నారు. ఈ విషయాన్ని తాను చెబితే కొందరు టీఆర్‌ఎస్ నేతలు మొరుగుతున్నారని ఉత్తమ్ మండిపడ్డారు. ఒక్కసారి కూడా ఎన్నికల్లో పోటీ చేసి గెలవలేని నేతలు కూడా తన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 28న కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 'సేవ్ ఇండియా-సేవ్ కాన్‌స్టిట్యూషన్' పేరుతో నిర్వహించదలచిన ర్యాలీకి ఇంకా పోలీసులు అనుమతినివ్వలేదని చెప్పిన ఉత్తమ్, ఎన్ని అడ్డంకులు ఎదురయినా దేశ ప్రజల పక్షాన ఈ ర్యాలీ నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు.

## 4న గౌడ సంఘం ఆత్మీయ సన్మానం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**సాక్షి, హైదరాబాద్:** దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నీరా పాలసీ ప్రవేశ పెట్టిందని, గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇచ్చే పరిహారాన్ని రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచిందని రాష్ట్ర గౌడ సంఘం ప్రతినిధులు అన్నారు. అంగవైకల్యం సంభవించినప్పుడు గీత కార్మికులకు ఇచ్చే సాయాన్ని రూ. 20 వేల నుంచి రూ. 5 లక్షల వరకు పెంచి భరోసా ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఈ మేరకు జనవరి 4న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్, జలవిహార్‌లో ప్రజా ప్రతినిధులకు ఆత్మీయ సన్మానం నిర్వహించనున్నామని రాష్ట్ర గౌడ సంఘం, గౌడ హాస్టల్ అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆత్మీయ సన్మాన సభ వాల్ పోస్టర్‌ను సంఘం నాయకులతో కలసి ఆబ్కారీశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూన వెంకటేశ్‌గౌడ్, రవీందర్‌గౌడ్, కృష్ణమూర్తిగౌడ్, చక్రవర్తిగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, గౌడ సంఘం నేతలు పాల్గొన్నారు.

## అఖిలపక్ష భేటీ నిర్వహించండి

**సీఎం కేసీఆర్‌కు సీపీఎం విజ్ఞప్తి**

**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుతం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలకు కారణమవుతున్న ఎన్‌పీఆర్, ఎన్‌ఆర్సీ, సీఏఏలపై వెంటనే అఖిలపక్ష భేటీ నిర్వహించాలని సీఎం కేసీఆర్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం విజ్ఞప్తి చేసింది. రాజకీయంగా బలపడటానికి మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ పన్నిన కుట్రల ప్రతిఘటనకు ముందుకు రావాలని కోరింది. లౌకికతత్వాన్ని కాపాడేందుకు, భారత రాజ్యాంగ పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు, చర్చాగోష్టులు నిర్వహించాలని నిర్ణయించినట్టు సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 30న గాంధీజీ వర్ధంతి రోజున బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా బీజేపీయేతర పార్టీలతో అఖిలపక్ష సభను జరపాలని సీఎం ఆలోచిస్తున్నట్లు వచ్చిన వార్తల పట్ల సీపీఎం సానుకూలత వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో పౌరసత్వ సవరణ చట్టంపై ముఖ్యమంత్రుల ఆధ్వర్యంలో దీక్షలు, భారీ నిరసనలు జరుగుతున్నా సీఎం కేసీఆర్ మౌనంగా ఉండటంపై తెలంగాణ సమాజం ఆందోళనతో ఉందని సమావేశం అభిప్రాయపడిందని వెల్లడించారు.



**షెడ్యూల్ సవరించాలి...**

మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లు ప్రకటించకుండానే పురపాలక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, సంక్రాంతి, జనవరి 8న కార్మిక సమ్మె-గ్రామీణ బంద్‌ను దృష్టిలో పెట్టుకోకుండా తేదీలను ప్రకటించడంపై సీపీఎం అభ్యంతరం వ్యక్తం చేసింది. వెంటనే రిజర్వేషన్లు ప్రకటించి పండుగకు, కార్మిక సమ్మె-గ్రామీణ బంద్‌కు ఆటంకం కలగని పద్ధతుల్లో షెడ్యూల్‌లో మార్పులు చేయాలని కోరుతూ ఎస్‌ఈసీని కలవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ ఎన్నికల్లో వామపక్ష, అభ్యుదయ శక్తులు ఐక్యంగా పోటీ చేయడం రాష్ట్రానికి ఎంతో అవసరమని, సీపీఐ, ఇతర వామపక్షాలతో కలసి పోటీ చేసేందుకు చర్చలు జరపాలని నిర్ణయించారు.

## 'పురపోరు'పై టీఆర్‌ఎస్ కీలక భేటీ

**పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన నేడు సమావేశం**

- మున్సిపాలిటీలవారీగా పార్టీ పరిస్థితిపై సమీక్షతో పాటు దిశానిర్దేశం
- భేటీకి హాజరుకానున్న 64 మంది పార్టీ ఇన్‌చార్జిలు, రాష్ట్ర కార్యవర్గం



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మున్సిపాలిటీ ఎన్నికల షెడ్యూలు విడుదల నేపథ్యంలో అధికార టీఆర్‌ఎస్ పార్టీ 'పురపోరు' వ్యూహాన్ని ఖరారు చేసేందుకు శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ భేటీకి టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారక రామారావు అధ్యక్షత వహిస్తారు. సమావేశానికి హాజరు కావాల్సిందిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, పార్టీ అనుబంధ కమిటీల రాష్ట్ర బాధ్యులకు పార్టీ కార్యాలయ వ్యవహారాల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి గురువారం సమాచారం అందించారు. 30 జిల్లాల పరిధిలోని 120 మున్సిపాలిటీలు, ఐదు జిల్లాల పరిధిలోని పది మున్సిపల్ కార్పొరేషన్లకు వచ్చే నెల 22న జరిగే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహంపై కేటీఆర్ దిశా నిర్దేశం చేస్తారు. పురపాలక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా అనుసరించాల్సిన కార్యాచరణను కేటీఆర్ ప్రకటిస్తారని పార్టీ నేతలు భావిస్తున్నారు.

**మున్సిపాలిటీల వారీగా ఇన్‌చార్జిలు**

మున్సిపల్ ఎన్నికలు ఈ ఏడాది ఆగస్టులో జరుగుతాయనే అంచనాతో టీఆర్‌ఎస్ పార్టీ సుమారు ఆరు నెలల క్రితం నుంచే పార్టీ యంత్రాంగాన్ని ఎన్నికలపై అప్రమత్తం చేస్తూ వచ్చింది. ఈ ఏడాది జూన్‌లో రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు 64 మంది పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో సగటున నలుగురు రాష్ట్ర నాయకులను ఇన్‌చార్జిలుగా నియమించి, మున్సిపాలిటీల వారీగా సమాచార సేకరణ, పార్టీ యంత్రాంగం, సన్నద్ధత, సమన్వయ బాధ్యతలను కేటీఆర్ అప్పగించారు. మున్సిపాలిటీల వారీగా పార్టీ పరిస్థితిపై ఇన్‌చార్జిల నుంచి అందిన నివేదికలపై మూడు పర్యాయాలు సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల షెడ్యూలు వెలువడిన నేపథ్యంలో శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశంలో మున్సిపాలిటీల వారీగా పార్టీ పరిస్థితిపై కేటీఆర్ మరోమారు సమీక్ష నిర్వహిస్తారు. ఇప్పటికే వార్డుల వారీగా టికెట్ ఆశించే ఔత్సాహిక నేతలు, కార్యకర్తల జాబితాను కూడా సిద్ధం చేయడంతో రిజర్వేషన్లకు అనుగుణంగా పార్టీ అభ్యర్థుల ఎంపికపై సూచనలు చేస్తారు. ఎన్నికల్లో పార్టీ యంత్రాంగం సన్నద్ధతకు సంబంధించి ఉమ్మడి జిల్లాల మంత్రులు, స్థానిక శాసనసభ్యులు, పార్టీ నేతలతో సమన్వయం చేయాల్సిన తీరుపై కేటీఆర్ దిశా నిర్దేశం చేస్తారు.


# జనరల్ సీట్లో గెలిచినా అర్హులే

- చైర్‌పర్సన్, మేయర్ పదవులకు పోటీ చేయొచ్చు
- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో స్పష్టతనిచ్చిన ఎస్‌ఈసీ

**సాక్షి, హైదరాబాద్:** ఎస్టీ, ఎస్సీ, బీసీలతోపాటు మహిళలకు రిజర్వ్ చేసిన మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులకు ఆయా వర్గాలకు రిజర్వ్ స్థానం నుంచే కాకుండా జనరల్ సీటు నుంచి గెలిచిన వారు కూడా పోటీకి అర్హులే. వచ్చేనెలలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ విషయంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) ఇదివరకే స్పష్టతనిస్తూ సర్క్యులర్‌ను విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీ, ఎస్సీ, బీసీలకు, మహిళలకు రిజర్వ్ చేసిన చైర్మన్, మేయర్ పదవులకు సంబంధిత రిజర్వేషన్ స్థానం నుంచి కాకుండా జనరల్ స్థానం నుంచి సదరు కేటగిరీకి చెందిన వ్యక్తి గెలిచినా ఆయా పదవులకు పోటీ చేసేందుకు అర్హులని స్పష్టతనిచ్చింది. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళలకు రిజర్వ్ చేసిన మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులకు ఆయా కేటగిరీల వారు జనరల్ సీటు నుంచి పోటీచేసి గెలిచినా ఆయా పదవులకు పోటీ పడవచ్చునని ఇందులో పేర్కొన్నారు.

**ఆయా పదవులకు ఇలా...**

- మున్సిపల్ చైర్‌పర్సన్, మేయర్ పదవిని ఎస్టీ మహిళకు కేటాయిస్తే...ఎవరైనా ఎస్టీ మహిళ ఆ వర్గానికి రిజర్వ్ చేసిన స్థానం నుంచి కాకుండా ఎస్టీ జనరల్ లేదా మహిళ లేదా జనరల్ సీటు నుంచి గెలిచినా మేయర్, చైర్‌పర్సన్ పదవులకు పోటీచేసేందుకు అర్హులు.
- మేయర్, చైర్‌పర్సన్ పదవులను ఎస్సీ మహిళకు రిజర్వ్ చేస్తే...ఎస్సీ మహిళకు రిజర్వ్ చేసిన స్థానం నుంచి కాకుండా ఎస్సీ (జనరల్), మహిళ లేదా జనరల్ స్థానం నుంచి ఎస్సీ మహిళ గెలిస్తే ఆమె ఆయా పదవులకు పోటీ పడవచ్చు.
- మేయర్, చైర్‌పర్సన్ పదవులను బీసీ (మహిళ)లకు కేటాయిస్తే.. బీసీ మహిళకు రిజర్వ్ చేసిన సీటునుంచి కాకుండా బీసీ జనరల్, మహిళ లేదా జనరల్ స్థానం నుంచి బీసీ మహిళ గెలిస్తే ఆయా పదవులకు పోటీచేసే అర్హత ఉంటుంది.
- చైర్‌పర్సన్, మేయర్ పదవులు ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ చేస్తే, ఎస్టీ మహిళ, ఎస్టీ జనరల్ లేదా మహిళ, జనరల్ స్థానాల నుంచి గెలిచిన ఎస్టీ అభ్యర్థి ఆయా స్థానాలకు పోటీ చేసేందుకు అర్హులు.
- మేయర్, చైర్‌పర్సన్ పదవులను ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ చేసిన పక్షంలో ఎస్సీ మహిళ, ఎస్సీ జనరల్, మహిళ లేదా అన్‌రిజర్వ్‌డ్ స్థానం నుంచి గెలిచిన ఎస్సీ అభ్యర్థి ఆయా పదవులకు పోటీచేసే అర్హత ఉంది.
- చైర్‌పర్సన్, మేయర్ పదవులను బీసీ జనరల్ కేటగిరీకి రిజర్వ్ చేసిన పక్షంలో.. బీసీ మహిళ, బీసీ జనరల్, మహిళ లేదా జనరల్ స్థానం నుంచి గెలిచిన బీసీ అభ్యర్థి, ఆయా పదవులకు పోటీ పడే వీలుంది.
- మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులను మహిళలకు రిజర్వ్ చేసిన చోట ఏ కేటగిరీ నుంచి మహిళా అభ్యర్థి గెలిచినా ఆయా పదవులకు పోటీ పడేందుకు అర్హత ఉంటుంది.



గ్రహణాన్ని వీక్షించేందుకు పైకి చూస్తున్న ప్రధాని మోదీ

# ఆకాశంలో అద్భుతం

**దక్షిణాది రాష్ట్రాల్లో కనువిందు చేసిన సూర్యగ్రహణం ● కొన్ని ప్రాంతాల్లో మబ్బుల చాటున దాగిన సూరీడు**

కొత్త సంవత్సరానికి స్వాగత సన్నాహాలు చేస్తున్న వేళ ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. భారత్‌లో గురువారంనాడు ఏర్పడిన పాక్షిక సూర్య గ్రహణం దక్షిణాది రాష్ట్రాల్లో కనువిందు చేసింది. కర్ణాటక, తమిళనాడులో వేలాదిగా బయటకు వచ్చిన ప్రజలు అంతరిక్ష అద్భుతం చూసి ఎంజాయ్ చేశారు. చెన్నై, తిరుచిరాపల్లి, మదురైలో సూర్యగ్రహణం కనువిందు చేసింది. దేశ రాజధాని ఢిల్లీ సహా చాలా ప్రాంతాల్లో సూర్యుడు మబ్బుల చాటుకి చేరుకోవడంతో సూర్యగ్రహణాన్ని వీక్షించాలన్న ప్రజల ఉత్సాహం ఆవిరైపోయింది. కేరళలో చెర్వతూర్‌లో మొదట సూర్యగ్రహణం కనిపించింది. ఆ తర్వాత కోజికోడ్, కన్నూర్‌లో గ్రహణ దృశ్యాలు కనువిందు చేశాయి. వాయనాడ్‌లో చాలా మంది ప్రజలు ఆరుబయటకి వచ్చి గ్రహణ దృశ్యాల్ని వీక్షించాలని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ వారికి నిరాశే మిగిలింది. ఆకాశంలో మబ్బులు కమ్మేయడంతో సూర్యగ్రహణం కనిపించలేదు. న్యూఢిల్లీతో పాటు తెలుగు రాష్ట్రాల్లో సరిగ్గా గ్రహణం పూర్తి స్థాయికి చేరుకున్న సమయంలో మబ్బులు పట్టేశాయి. ఉదయం దాదాపుగా 8 గంటలకు మొదలైన గ్రహణం 11 గంటల 15 నిమిషాలకు ముగిసింది. ప్రఖ్యాత శబరిమలై ఆలయం, పద్మనాభస్వామి ఆలయం, గురువాయూర్ ఆలయాలను గ్రహణం సందర్భంగా మూసివేశారు. గ్రహణానంతరం ఆలయాన్ని శుద్ధి చేశాక భక్తుల్ని అనుమతించారు. ఇక ప్రపంచదేశాల అంశానికి వస్తే ఒమన్‌లో అరేబియా సముద్ర తీర ప్రాంతంలో తొలుత సూర్యగ్రహణం కనిపించింది. అరబ్ దేశాలు, సింగపూర్, శ్రీలంక, మలేసియా, ఇండోనేసియా దేశాల్లో సూర్యగ్రహణం కనువిందు చేసింది. – న్యూఢిల్లీ

## రింగ్ ఆఫ్ ఫైర్ ఎందుకు అంతటా కనిపించలేదంటే...

ఖగోళ అద్భుతాన్ని వీక్షించి 2019 సంవత్సరానికి గుడ్ బై కొట్టాలన్న చాలా మంది ఆశలు ఆవిరయ్యాయి. రింగ్ ఆఫ్ ఫైర్ కనిపిస్తుందని అంచనా వేశారు కానీ చాలాచోట్ల కనిపించలేదు. దీనికి గల కారణాలను తమిళనాడు సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ జాయింట్ డైరెక్టర్ ఎస్. సౌందరరాజపెరుమాళ్ వివరించారు. 'ఈసారి గ్రహణం సమయంలో చంద్రుడు భూమికి 3.85 లక్షల కి.మీ. దూరంలో ప్రయాణిస్తున్నాడు. శీతాకాలం కావడంతో సూర్యుడికి అత్యంత సమీపంలోకి భూమి వచ్చింది. దీంతో సూర్యుడి పరిమాణం ప్రజలకి చాలా పెద్దదిగా కనిపించింది. భూమికి, సూర్యుడికి మధ్య చంద్రుడు వచ్చినప్పటికీ పూర్తిగా సూర్యుడి ఉపరితలానికి అడ్డుగా రాలేకపోవడంతో రింగ్ ఆఫ్ ఫైర్ కనిపించలేదు'అని వెల్లడించారు.

## ప్రధానికీ నిరాశే!

సంపూర్ణ సూర్యగ్రహణం వీక్షించాలనే ప్రధాని మోదీ కోరిక తీరలేదు. 'భారతీయుల్లాగే నేను కూడా ఏడాది చివర్లో వచ్చిన సూర్యగ్రహణాన్ని వీక్షించాలని ఉత్సాహం చూపించాను. దురదృష్టవశాత్తూ మబ్బులు అడ్డం రావడంతో చూడలేకపోయాను. అయితే కోజికోడ్, ఇతర ప్రాంతాల్లో సూర్యగ్రహణ దృశ్యాలను లైవ్‌లో చూశాను. ఈ సందర్భంగా కొంతమంది నిపుణులతో మాట్లాడి గ్రహణంపై అవగాహన పెంచుకున్నాను''అని మోదీ ట్వీట్ చేశారు. దాంతో పాటు ఎన్నో ఫొటోలను షేర్ చేశారు. మోదీ కళ్లకి నల్లకళ్లద్దాలు పెట్టుకొని సూర్యుడ్ని వీక్షిస్తున్న ఫొటోను ఒక ట్విట్టర్ వినియోగదారుడు షేర్ చేశాడు. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయం తెల్సి ప్రధాని చాలా కూల్‌గా 'ఎంజాయ్' అంటూ బదులిచ్చారు.



మలేసియాలోని టాన్జుంగ్‌లో సూర్యగ్రహణం



అహ్మదాబాద్‌లో ఫిల్టర్ అద్దాలతో గ్రహణాన్ని చూస్తున్న యువతి

## చలి గుప్పిట్లో ఉత్తరాది

**న్యూఢిల్లీ:** మధ్యధరా సముద్రం వైపు నుంచి వస్తున్న శీతల గాలులు ఉత్తరాదిని చలితో వణికిస్తున్నాయి. నాలుగైదు దశాబ్దాలకు ఒక్క సారి మాత్రమే సంభవించే ఈ పరిణామంతో ఉత్తరాది రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో పక్షం రోజులుగా 12 డిగ్రీల కంటే దిగువకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగనుందని వాతావరణ శాఖ తెలిపింది. వాతావరణ మార్పుల వల్ల కనిష్ట ఉష్ణోగ్రతలు 16, 17 రోజుల పాటు కొనసాగనున్నాయని వివరించింది. అడవులు తగ్గిపోవడం, భూ వినియోగం పెరగడం వల్లే ఈ అనూహ్య మార్పులు సంభవిస్తున్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.

## బాలల దినోత్సవాన్ని డిసెంబర్ 26న జరపండి

**న్యూఢిల్లీ:** దేశంలో బాలల దినోత్సవాన్ని నవంబర్ 14వ తేదీకి బదులు డిసెంబర్ 26న జరపాలని కోరుతూ బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు, ఎంపీ మనోజ్ తివారీ ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఇలా చేస్తే అది సిక్కుల పదో గురువైన గురు గోవింద్ సింగ్ ఇద్దరు కొడుకులకు ఘన నివాళి అవుతుందని లేఖలో పేర్కొన్నారు. దేశంలో ఎందరో బాలలు ఎన్నో త్యాగాలు చేశారని, కానీ వారిలో గురు గోవింద్ సింగ్ కుమారులైన జొరావర్ సింగ్, ఫతే సింగ్‌ల త్యాగం గొప్పదన్నారు. 1705వ సంవత్సరంలో డిసెంబర్ 26నే వాళ్లిద్దరు ధర్మాన్ని రక్షించడానికి తమ ప్రాణాలర్పించారన్నారు.

## రవీనా టాండన్‌పై కేసు




**చండీగఢ్:** క్రైస్తవుల మత విశ్వాసాలను దెబ్బతీశారంటూ బాలీవుడ్ నటి రవీనా టాండన్, దర్శకురాలు ఫరా ఖాన్, కమెడియన్ భారతీ సింగ్‌లపై పంజాబ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ టీవీ షోలో 'హలెలూయ' అనే మాటను వీరు నిర్లక్ష్యపూరితంగా ఉచ్ఛరించారంటూ క్రిస్టియన్ ఫ్రంట్ ప్రెసిడెంట్ సోను జఫర్ అమృతసర్ జిల్లా అజ్నాలా పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీరిపై కేసు నమోదు చేసినట్లు సీనియర్ ఎస్పీ విక్రమ్ తెలిపారు.

## మెరుగ్గా భారత్–చైనా సైనిక బంధం: పీఎల్‌ఏ

**బీజింగ్:** వ్యూహాత్మక చర్చలు, ఆచరణాత్మక సహకారం వల్లే భారత సైన్యంతో సంబంధాలు మెరుగుపడ్డాయని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్‌ఏ) తెలిపింది. ఇందుకు కృషి చేసిన ప్రధాని మోదీ, అధ్యక్షుడు జిన్‌పింగ్‌లకు కృతజ్ఞతలు తెలిపింది. రక్షణ శాఖ ప్రతినిధి కల్నల్ వూ క్వియాన్ మీడియాతో మాట్లాడుతూ.. తాజాగా భారత్‌లో ముగిసిన సంయుక్త ఉగ్ర వ్యతిరేక విన్యాసాలు ప్రాంతీయ స్థిరత్వం, ఉగ్రపోరుపై ఇరు దేశాలు కృతనిశ్చయంతో ఉన్నట్లు చాటిచెప్పాయన్నారు.

## యాక్సిస్‌కు దూరమైన 'అమృత' ఘడియలు!



**థానే:** యాక్సిస్ బ్యాంక్‌లో సీనియర్ అధికారిణి అయిన మాజీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ భార్య అమృతకు, శివసేన డిప్యూటీ నేత ప్రియాంక చతుర్వేదికి మధ్య ట్విట్టర్ వేదికగా గొడవ తలెత్తడంతో యాక్సిస్ బ్యాంక్‌కు తలనొప్పి తెస్తోంది. ఏడాదికి రూ.11వేల కోట్ల లావాదేవీలుండే మహారాష్ట్ర పోలీసు విభాగం తన వేతన ఖాతాలను వేరే బ్యాంక్‌కు మార్చనుందని ఇప్పటికే వార్తలు వస్తున్నాయి. దీనికి తోడు తాజాగా శివసేన చేతుల్లోని థానే మున్సిపల్ కార్పొరేషన్ సైతం తన ఉద్యోగుల వేతన ఖాతాలను యాక్సిస్ నుంచి మరో బ్యాంక్‌కు మార్చాలని నిర్ణయించుకుంది. 'నా పేరు రాహుల్ సావర్కర్ కాదు' అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేను అమృత విమర్శించడంతో మొదటగా వివాదం మొదలైంది.

# హింసకు నేతలే కారణం



**సీఏఏ వ్యతిరేక ఆందోళనలపై ఆర్మీ చీఫ్ వివాదాస్పద వ్యాఖ్య**

**న్యూఢిల్లీ/కోల్‌కతా:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై చెలరేగిన ఆందోళనలు హింసాత్మకంగా మారడానికి నేతలే కారణమంటూ ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై రాజకీయ పక్షాలు భగ్గుమన్నాయి. సీఏఏను ఉపసంహరించుకునే దాకా నిరసనలను ఆపేది లేదని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పష్టం చేశారు. గురువారం కోల్‌కతాలో ఆమె మరో ర్యాలీ చేపట్టారు. కాగా, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ప్రజల్లో సృష్టిస్తున్న అయోమయమే ఎన్నార్సీ, సీఏఏ, ఎన్పీఆర్ వ్యతిరేక ఆందోళనలకు కారణమని హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నార్సీతో సంబంధం లేకుండా 2010లో మాదిరి ఎన్పీఆర్ అమలు చేస్తే తమకు అభ్యంతరం లేదని తెలిపింది. కొత్తగా తీసుకువచ్చిన ఎన్పీఆర్ వెనుక బీజేపీకి వేరే ఉద్దేశాలున్నాయని పేర్కొంది.

### అది నాయకత్వ లక్షణం కాదు

'సీఏఏకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో ప్రజలు హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. నిరసనకారుల్లో ఎక్కువమంది విద్యార్థులు కూడా ఉన్నారు. ఇలా ప్రజలను హింసకు ప్రేరేపించడం నాయకత్వ లక్షణం కాదు'అని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'నాయకుడంటే సరైన దిశలో నడిపించేవాడు. మంచి సూచనలిస్తూ మన సంక్షేమం పట్ల శ్రద్ధ తీసుకునేవాడు. అతడు ముందు వెళ్తుంటే ప్రతి ఒక్కరూ అనుసరిస్తారు. అయితే, ఇది అనుకున్నంత సులువు కాదు. చాలా క్లిష్టమైన వ్యవహారం.'అని తెలిపారు. అయితే, రాజకీయ పరమైన వ్యవహారాల్లో జనరల్ రావత్ తలదూర్చడం కాంగ్రెస్ సహా పలు రాజకీయ పార్టీలు స్పందించాయి. 'ఆయన చెప్పింది నిజమే. అయితే, ప్రధాని పదవిపై ఆశతోనే ఇలా మాట్లాడుతున్నారని అనిపిస్తోంది' అని ఉద్యమకారుడు యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. 'ఇలాంటి వ్యాఖ్యలు చేసే అవకాశం పాకిస్తాన్, బంగ్లాదేశ్ సైనికాధికారులకు మాత్రమే ఉంటుంది. ఆయనకు ఇలాగే మాట్లాడే అవకాశం ఇస్తే సైనిక తిరుగుబాటుకు కూడా దారిచూపినట్లవుతుంది' అని కాంగ్రెస్ ప్రతినిధి బ్రిజేష్ కాలప్ప ట్విట్టర్‌లో పేర్కొన్నారు. జనరల్ రావత్ తన పరిధి తెలుసుకోవాలని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ స్పందిస్తూ.. 'జనరల్ రావత్‌తో ఏకీభవిస్తున్నా. మత విద్వేషాలు రెచ్చగొట్టి, రక్తపాతానికి పాల్పడిన వారు కూడా నాయకులు కాదుకదా?'అని ప్రశ్నించారు. బీజేపీ మిత్రపక్షం జేడీయూ కూడా జనరల్ రావత్ వ్యాఖ్యలను ఖండించింది. ఈ పరిణామంపై ఆర్మీ స్పందించింది. ఆర్మీచీఫ్ వ్యాఖ్యలు కేవలం సీఏఏ ఆందోళనలనుద్దేశించి చేసినవి కావని పేర్కొంది. ఆయన ఏ రాజకీయ పార్టీని కానీ, వ్యక్తిని కానీ ప్రస్తావించలేదు. భావి భారత పౌరులైన విద్యార్థులను గురించి మాత్రమే జనరల్ రావత్ మాట్లాడారు. కశ్మీర్ లోయకు చెందిన యువతను వారు నేతలుగా భావించిన వారే తప్పుదోవ పట్టించారు' అని ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 31వ తేదీతో జనరల్ బిపిన్ రావత్ పదవీ కాలం ముగియనుంది. ఆర్మీ చీఫ్‌గా మూడేళ్ల పదవీ కాలంలో అధికార పార్టీకి అనుకూలంగా పలు వ్యాఖ్యలు చేసి వివాదాస్పదమయ్యారు. త్వరలో రక్షణ బలగాల అధిపతి(సీడీఎస్)గా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.




సీఏఏకు వ్యతిరేకంగా గురువారం మైసూరులో జరిగిన భారీ ప్రదర్శన

### ఆందోళనలు ఆపేదిలేదు: మమతా బెనర్జీ

పౌరసత్వ సవరణ చట్టా(సీఏఏ)న్ని ఉపసంహరించుకోనంత కాలం ఆందోళనలను కొనసాగిస్తామని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు.సీఏఏకి వ్యతిరేకంగా గురువారం సెంట్రల్ కోల్‌కతాలో ఆమె భారీ ర్యాలీ చేపట్టారు. ఆందోళనలను కొనసాగించాలని విద్యార్థులను కోరారు. 'మీరు దేనికీ భయపడకండి. మీకు అండగా నేనుంటా. నిప్పుతో ఆటలు వద్దని బీజేపీని హెచ్చరిస్తున్నా'అని అన్నారు. సీఏఏ, ఎన్నార్సీలపై పోరాడుతున్న జామియా మిల్లియా, ఐఐటీ కాన్పూర్ తదితర వర్సిటీల విద్యార్థులకు ఆమె సంఘీభావం ప్రకటించారు. ప్రజలకు తిండి, బట్ట, నీడ ఇవ్వలేని బీజేపీ ప్రభుత్వం అక్రమ చొరబాటుదారులను కనిపెట్టే పని మాత్రం చేపట్టిందన్నారు. ఉద్యమాన్ని పక్కదారి పట్టించేందుకు బీజేపీ సాగించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు.

### ప్రతిపక్షాలు ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నాయి



సీఏఏపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అయోమయం సృష్టిస్తున్నాయని, ప్రజలను తప్పుదోవ పట్టించడం ద్వారా ఢిల్లీలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తున్నాయని హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ(డీడీఏ) నిర్వహించిన ఓ కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగించారు. 'పౌరసత్వ చట్టం సవరణ బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా ఒక్క ప్రతిపక్ష నేత కూడా మాట్లాడలేదు. ఆ తర్వాత ఈ చట్టంపై ప్రజల్లో గందరగోళం సృష్టిస్తూ ఢిల్లీ ప్రశాంతతను దెబ్బతీస్తున్నారు' అని పేర్కొన్నారు.

**బీజేపీది దుష్ప్రచారం: కాంగ్రెస్**

కాంగ్రెస్ నేత చిదంబరం మాట్లాడుతూ.. ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన జాతీయ జనాభా పట్టిక(ఎన్పీఆర్)తో, 2010నాటి ఎన్పీఆర్‌కు పోలికే లేదన్నారు. ఎన్నార్సీతో సంబంధం లేకుండా, 2010 నాటి ఎన్పీఆర్ చేపట్టాలని తమ పార్టీ కోరుతోందన్నారు. ఈ విషయంలో బీజేపీ దురుద్దేశంతో దుష్ప్రచారం సాగిస్తోందని ఆరోపించారు. సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా జనవరి 1 నుంచి వారంపాటు ఆందోళనలు చేపట్టాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి.

## గొగోయ్ ఇంట్లో ఎన్‌ఐఏ సోదాలు

- పలు డాక్యుమెంట్లు స్వాధీనం
- 14 రోజుల రిమాండ్ విధించిన ప్రత్యేక కోర్టు

**గువాహటి:** సమాచార హక్కు కార్యకర్త అఖిల్ గొగోయ్ ఇంట్లో గురువారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) సోదాలు చేపట్టింది. తనిఖీల సందర్భంగా ల్యాప్‌టాప్‌తో పాటు వివిధ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. డిసెంబర్ 12న ఎన్‌ఐఏ అతన్ని అదుపులోకి తీసుకుంది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా అస్సాంలో నిరసనల నేపథ్యంలో అనేక రైతు సంఘాలకు సలహాదారుగా ఉన్న గొగోయ్‌ను ప్రభుత్వం అరెస్టు చేసింది. గువాహటిలోని నిజరపరా ప్రాంతంలోని గొగోయ్ నివాసంలో ఎన్‌ఐఏ అధికారులు తనిఖీలు చేశారు. అతని పాన్ కార్డు, ఎస్బీఐ డెబిట్ కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ కాపీలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన తనిఖీలు మూడు గంటలపాటు జరిగాయి. తనిఖీలు ముగిసిన అనంతరం గొగోయ్ భార్య గీతాశ్రీ తములీ స్వాధీనం చేసుకున్న వస్తువుల జాబితాను విలేకరులకు చూపించారు. కజిరంగలోని కేఎంఎస్ఎస్ ఆర్చిడ్ ఎన్విరాన్‌మెంట్ పార్కుకు సంబంధించిన పత్రాలను కూడా ఎన్‌ఐఏ బృందం కోరిందనీ, అయితే దానికి సంబంధించిన సమాచారం ఏమీ తన దగ్గర లేదని ఆమె వారికి చెప్పింది. కాగా, గొగోయ్‌ను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టు గురువారం ఆదేశించింది.



అఖిల్‌ను కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు

## 'నారీ శక్తి పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

**సాక్షి, న్యూఢిల్లీ:** 2019 సంవత్సరానికి 'నారీ శక్తి పురస్కార్'కోసం కేంద్ర స్త్రీ, శిశు అభివృద్ధి శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మహిళా సాధికారతకు, ముఖ్యంగా బలహీన, అట్టడుగు వర్గాల మహిళల అభ్యున్నతి కోసం అసాధారణ కృషి చేసిన వ్యక్తులు, సమూహాలు, సంస్థలకు ఏటా ఇచ్చే జాతీయ అవార్డు ఇది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చేఏడాది మార్చి 8న పురస్కారాలు అందజేయనున్నారు. పురస్కారానికి సంబంధించి అర్హతలు, ఇతర వివరాలు www. narishaktipuraskar. wcd. gov. in వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే సమర్పించాలి. సమర్పణకు చివరి తేదీ అయిన వచ్చే ఏడాది జనవరి ఏడు లోపు దరఖాస్తులు, నామినేషన్లను సమర్పించాల్సి ఉంటుంది.

## వరవరరావు హార్డ్‌డిస్క్ రికవరీ కోసం..

**ఎఫ్‌బీఐ సాయం కోరనున్న పుణే పోలీసులు**

**పుణే:** ఎల్గార్ పరిషద్– మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో అరెస్టయిన విరసం నేత వరవరరావు ఇంట్లో స్వాధీనంచేసుకున్న హార్డ్‌డిస్క్‌లోని డేటా రికవరీ కోసం అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) సాయం తీసుకోవాలని పుణే పోలీసులు భావిస్తున్నారు. గతేడాది ఆగస్టులో వరవరరావు ఇంట్లో సోదాల్లో లభ్యమైన హార్డ్‌డిస్క్‌లో ఏముందో తెల్సుకునేందుకు నాలుగు ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలకు పంపినా ఫలితం లేదు. తొలుత పుణేలోని ల్యాబొరేటరీకి పంపగా, నిపుణులు హార్డ్ డిస్క్‌లోని డేటాను రికవరీ చేయలేకపోయారని ఓ అధికారి చెప్పారు. తర్వాత ముంబైలోని డైరెక్టరేట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపినా అక్కడి నిపుణులు డేటా సంపాదించలేకపోయారు. గుజరాత్, హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబొరేటరీల నిపుణులు రికవరీ చేయలేకపోయారని పేర్కొన్నారు. 'సాంకేతికతలో ఎఫ్‌బీఐ చాలా పురోగతి చెంది ఉంటుంది. అందుకే ఎఫ్‌బీఐకి హార్డ్ డిస్క్ పంపాలని నిర్ణయం తీసుకున్నాం. ఇందుకు అవసరమైన అనుమతులను కేంద్ర హోం శాఖ ఇచ్చింది'అని ఆ అధికారి చెప్పారు. ఈ కేసులో ఇప్పటికే 19 మంది నిందితులపై చార్జిషీటు దాఖలు చేశారు. వారిలో ప్రముఖ సామాజిక కార్యకర్తలు వరవరరావు, సుధీర్ ధవలే, రోనా విల్సన్, సరేంద్ర గాడ్లింగ్, మహేశ్ రౌత్, షోమా సేన్, అరుణ్ ఫెరీరా, వెర్నన్ గోంజాల్వేస్, సుధా భరద్వాజ్‌లు ఉన్నారు.



# రైల్వే చార్జీల హేతుబద్ధీకరణ

**రైల్వే బోర్డు చైర్మన్ వై.కె.యాదవ్**

**న్యూఢిల్లీ:** ప్రయాణికుల, సరుకు రవాణా చార్జీలను హేతుబద్ధీకరించేందుకు రైల్వేశాఖ ఏర్పాట్లు చేస్తున్నట్లు రైల్వే బోర్డు చైర్మన్ వై.కె.యాదవ్ గురువారం వెల్లడించారు. అయితే, ఛార్జీలు పెరుగుతాయా? అన్నదానిపై సమాధానమిచ్చేందుకు ఆయన నిరాకరించారు. ఇది చాలా సున్నితమైన విషయమని విస్తృత చర్చల తర్వాతే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తగ్గుతున్న ఆదాయాన్ని పెంచేందుకు తాము ఇప్పటికే పలు చర్యలు చేపట్టామన్నారు. సరుకు రవాణా చార్జీలు ఇప్పటికే ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రోడ్డు ప్రయాణికులను రైల్వే వైపు మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఆర్థిక మందగమనం కారణంగా రైల్వే ఆదాయంలో తగ్గుదల నమోదవడం తెల్సిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్రయాణికుల చార్జీల ఆదాయం గత త్రైమాసికంతో పోల్చితే రూ.155 కోట్లు తగ్గింది. సరుకు రవాణా ఆదాయం సైతం ఇదే తరహాలో రూ.3,901 కోట్లు తగ్గినట్లు సమాచారహక్కు చట్టం ద్వారా వెల్లడైన గణాంకాల్లో తేలింది.



**రైల్వే నిర్వహణకు ఐదు విభాగాలు**

రైల్వేలలో ఇకపై యూపీఎస్సీ తరహాలో ఐదు ప్రత్యేక విభాగాలకు నియామకాలు జరుగుతాయని రైల్వే బోర్డు చైర్మన్ యాదవ్ తెలిపారు. యూపీఎస్సీ మాదిరిగానే ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (ఐఆర్ఎంఎస్) కోసం ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహిస్తామని అందులో విజయం సాధించిన వారు ఐదు విభాగాల్లో ఒకదాన్ని ఎంచుకుంటారని ఆయన వివరించారు. ఈ ఐదు ప్రత్యేక విభాగాల్లో నాలుగు సివిల్, మెకానికల్, టెలికామ్, ఎలక్ట్రికల్ వంటి ఇంజినీరింగ్ సేవలు కాగా, మిగిలిన నాన్ టెక్నికల్ విభాగం కింద అకౌంట్స్, పర్సనెల్, ట్రాఫిక్ వంటివి ఉంటాయని చెప్పారు. చివరి విభాగంలో ఉద్యోగం కోసం హ్యూమానిటీస్ చదువుకున్న వారూ అర్హులేనని, అందరికీ ఒకేసారి పదోన్నతులు దక్కుతాయని తెలిపారు. రైల్వే బోర్డు చైర్మన్ ఇకపై రైల్వేల సీఈవోగా ఉంటారు. ఇండియన్ రైల్వే సర్వీస్ అధికారే ఈ పదవి చేపట్టనున్నారు.

**సీనియారిటీకి ఢోకా లేదు: పీయూష్ గోయెల్**

రైల్వేలోని వివిధ విభాగాలను ఒక్కటిగా చేయడం వల్ల అధికారుల సీనియారిటీకి ఇబ్బంది కలగబోదని రైల్వే మంత్రి పీయూష్ గోయెల్ స్పష్టం చేశారు. అధికారుల కేడర్ ఆధారంగా పోస్టులు ఏర్పాటు కావని ఆయన గురువారం ఓ ట్వీట్ చేశారు. ప్రతిభ, సీనియారిటీల ఆధారంగా రైల్వే బోర్డులో సభ్యులయ్యేందుకు అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని, ఆయన వివరించారు. మొత్తం 8400 మంది అధికారుల ప్రమోషన్లకు, సీనియరిటీల కోసం ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటవుతుందని తెలిపారు.

## 'కన్న బిడ్డను తల్లి చంపడం అసహజం'



**న్యూఢిల్లీ:** జన్మనిచ్చిన కొన్ని గంటల్లోనే బిడ్డకు ఊపిరి ఆడకుండా చేసి చంపేసిందన్న ఆరోపణల నుంచి సుప్రీంకోర్టు ఓ తల్లికి విముక్తి కల్పించింది. కడుపున పుట్టిన బిడ్డను ఏ తల్లి చంపజాలదని, ఇది పూర్తిగా అసహజమైందని వ్యాఖ్యానిస్తూ ఆ తల్లిని నిర్దోషిగా విడుదల చేసింది. నిందితురాలు 2007 ఆగస్టు 24న ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో బాలికకు జన్మనిచ్చింది. జన్మనిచ్చిన కొద్దిసేపటికే బిడ్డ చనిపోవడంతో తల్లిపై కేసు నమోదైంది. 2009ఆమెకు ట్రయల్ కోర్టు జీవితఖైదు వేసింది. ఆమె హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు సైతం అదే శిక్షను సమర్థించింది. దీంతో ఆమె సుప్రీం తలుపుతట్టింది. జస్టిస్ ఎం.ఎం.శాంతనూ గౌండర్, జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డిల బెంచ్ ఈ కేసును విచారించింది. సాక్ష్యాలన్నింటినీ పరిగణలోకి తీసుకుంటే ఆ తల్లే బిడ్డను చంపిందనేందుకు ఆధారాలు లేవంటూ తల్లికి నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పుచెప్పింది.

## మహారాష్ట్ర కేబినెట్ విస్తరణ 30న?

**ముంబై:** మహారాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఈ నెల 30న జరిగే అవకాశమున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఆ రోజు దాదాపు 36 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఆ వర్గాల అంచనా. ప్రస్తుతం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మంత్రివర్గంలో ఆరుగురు సభ్యులున్నారు. ముంబైలోని విధాన్‌భవన్‌లో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుందన్న తెలుస్తోంది. విస్తరణలో కాంగ్రెస్ తరఫున మంత్రులయ్యే వారి జాబితా సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాలాసాహెబ్ థోరట్ గురువారం వ్యాఖ్యానించారు. మంత్రివర్గ విస్తరణ ఈ వారంలోనే జరగాల్సి ఉండగా... వచ్చే వారానికి వాయిదాపడేందుకు కారణమేమిటన్న ప్రశ్నకు థోరట్ సమాధానమిస్తూ.. అసెంబ్లీ శీతాకాల సమావేశాల కోసం రాష్ట్రపాలన వ్యవస్థ మొత్తం గతవారం వరకూ నాగ్‌పూర్‌లో ఉందని అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీల కూటమి అధికారం దక్కించుకోవడం తెల్సిందే. అధికార పంపిణీలో భాగంగా శివసేనకు 16 మంత్రివర్గ స్థానాలు దక్కనుండగా, ఎన్సీపీకి 14, కాంగ్రెస్‌కు 12 స్థానాలు లభించనున్నాయి.

సాక్షి
శుక్రవారం, డిసెంబర్, 27

# రైల్వే సంస్కరణలకు గ్రీన్‌సిగ్నల్

రవాణా రంగంలో శతాబ్దిన్నరకు మించి అనుభవం గడించి, రోజూ 22,000 రైళ్లు నడుపుతూ ప్రపంచ రైల్వేల్లోనే నాలుగో స్థానం ఆక్రమించిన మన రైల్వే వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ దిశలో తొలి అడుగుగా దాని పాలనా వ్యవహారాలను పర్యవేక్షించే రైల్వే బోర్డును కుదించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి మన దేశంలో 53,596 కిలోమీటర్ల రైలు మార్గంవుంది. అదిప్పుడు మరో 13,772 కిలోమీటర్ల మేర మాత్రమే పెరిగిందంటే దాని వృద్ధి ఏమేరకువుందో అర్థమవుతుంది. అప్పటితో పోలిస్తే అది నిత్యం నిర్వహించాల్సిన రైళ్ల సంఖ్య ఎన్నో రెట్లు పెరిగింది. స్టేషన్లు ఎక్కువయ్యాయి. ప్రయాణికుల సంఖ్య కూడా ఊహకందనివిధంగా పెరిగింది. 29 రాష్ట్రాలూ, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలూ, 8,500 స్టేషన్లువున్నాయి. వేలాది రైళ్లు రోజూ 2 కోట్ల 30 లక్షలమంది ప్రయాణికులను చేరేస్తాయి. సరుకు రవాణా రోజుకు 30 లక్షల టన్నులమేర విస్తరించింది. ఈ కార్యనిర్వహణంతా 17 జోన్లు, 68 డివిజన్లు పరిధిలోవుండే 13 లక్షలకుపైగా సిబ్బంది చేతుల మీదుగా సాగుతుంది. ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా తర్వాత మన రైల్వే వ్యవస్థే అతి పెద్దది. కానీ ఈ వ్యవస్థ నిత్యం ఆర్థిక సమస్యలతోనే కొట్టుమిట్టాడుతోంది. 2017–18లో రైల్వే శాఖ ఆర్జించిన ప్రతి రూపాయిలో 98.44 పైసల వరకూ నిర్వహణకే పోయిందని ఇటీవల కాగ్ నివేదిక తెలిపింది. ఇది గత పదేళ్లతో పోలిస్తే అత్యంత అధమ స్థాయిలో ఉందని వ్యాఖ్యానించింది. ఇంత కన్నా దారుణమేమంటే ఎన్టీపీసీ, ఇండియన్ రైల్వేస్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్(ఇర్కాన్) సంస్థలు రైల్వేలకిచ్చిన అడ్వాన్సుల వల్ల ఈమాత్రమైనావుంది కానీ, లేనట్టయితే ఇది 102. 66 పైసలుగా నమోదయ్యేదని కాగ్ తెలిపింది. ఈ అడ్వాన్సుల కారణంగా రైల్వేల జమాఖర్చుల పద్దులో రూ. 1,665.61 కోట్లు మిగులు కనబడింది. ఆ రెండింటినీ మినహాయిస్తే 5,676.29 కోట్ల నష్టం నమోదయ్యేది. సరుకు రవాణా నుంచి వచ్చే లాభాల్లో 95 శాతాన్ని ప్రయాణికుల సర్వీసులో ఎదురయ్యే నష్టాన్ని భర్తీ చేయడానికి వినియోగించాల్సివస్తోంది.

వచ్చే అయిదేళ్లలో రూ. 8.5 లక్షల కోట్ల మేర ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు సమీకరించి రైల్వేశాఖకు జవసత్వాలు కల్పిస్తామని నాలుగేళ్లక్రితం ఎన్‌డీఏ ప్రభుత్వం చెప్పింది. ప్రయాణికుల సంఖ్య, సరుకు రవాణా పరిమాణం భారీగా పెంచడం, కొత్త రైల్వే ట్రాక్‌ల నిర్మాణం, అధునాతన రైళ్లను సమకూర్చుకోవడం రైల్వేల ప్రణాళికలో ప్రాధాన్యతాంశాలని వివరించింది. అన్నీ పూర్తయితే రైల్వేల ఆదాయం మరిన్ని రెట్లు పెరుగుతుందని అంచనా వేశారు. కానీ ఇదంతా ఆశించినంతమేర జరగలేదు. నిజానికి బడ్జెట్‌లలో ప్రకటించిన ప్రాజెక్టులన్నీ సక్రమంగా అమలు చేయడానికి అవసరమైన నిధులు ఆ శాఖ దగ్గర ఉండవు. కనుక ప్రాథమికమైన పనులు మొదలు కావడానికే ఏళ్లూ పూళ్లూ పడుతూంటుంది. మన రైల్వేలు 30 ఏళ్లకిందటి ప్రాజెక్టుల్ని కూడా ఇంకా పూర్తిచేయాల్సేవున్నదని ఆమధ్య ఒక నివేదిక ప్రకటించింది. రైల్వేల్లో వున్న అనేకానేక విభాగాలు మధ్య సరైన సమన్వయం వుండకపోవడం వల్ల అడుగడుగునా ఇబ్బందులు తలెత్తడమేకాక, తలపెట్టినవేవీ సక్రమంగా సాగటం లేదని ఆ నివేదిక తెలిపింది.

ఒకపక్క అయిదేళ్లలో అయిదు లక్షల కోట్ల ఆర్థికవ్యవస్థ సాధనను కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, అందులో కీలకపాత్ర పోషించాల్సిన రైల్వే వ్యవస్థ మాత్రం ఇంతటి దుస్థితిలో వుండటం ఆందోళన కలిగించే అంశమే. కనుకనే కేంద్రమంత్రివర్గం రైల్వే ప్రక్షాళనకు నడుం బిగించానంటున్నది. సమస్యలెదురైనప్పుడు సాధారణంగా ప్రభుత్వాలు సిబ్బంది సంఖ్యపై దృష్టి పెడతాయి. రిటైరవుతున్నవారు అవుతుండగా వారి స్థానంలో కొత్తవారి నియామకం విషయంలో శ్రద్ధ తీసుకోవడం లేదు. కానీ ఈసారి పైస్థాయినుంచి ప్రక్షాళన మొదలుపెట్టాలని నిర్ణయించడం మెచ్చదగిందే. రైల్వే బోర్డులో ఇప్పుడున్న ఎనిమిది మంది సభ్యుల సంఖ్యను అయిదుకు తగ్గించాలని, వేర్వేరు కేడర్‌లనూ, విభాగాలనూ విలీనం చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇంజనీరింగ్, ట్రాఫిక్, మెకానికల్, ఎలక్ట్రికల్ వగైరా ఎనిమిది విభాగాలను ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్(ఐఆర్‌ఎంఎస్) పేరిట ఒకే సర్వీస్‌కిందకు తీసుకొస్తారు. ఇకపై రైల్వేల్లో రైల్వే పరిరక్షణ దళం, వైద్య సర్వీసుల విభాగాలు మాత్రమే వుంటాయి. రైల్వే బోర్డు చైర్మన్, మరో నలుగురు సభ్యులు మాత్రమే బోర్డులో వుంటారు. చైర్మన్‌ను సీఈఓగా వ్యవహరిస్తారు. అలాగే సమర్థత, అనుభవం, నైపుణ్యం వున్నవారిని బయటినుంచి తెచ్చే యోచన కూడావుంది. 1994లో ప్రకాష్ టాండన్ కమిటీతో మొదలుపెట్టి 2015లో వివేక్ దేబ్రాయ్ కమిటీ వరకూ మూడు, నాలుగు కమిటీలు ఈ సంస్కరణలన్నీ సూచిస్తూనేవున్నాయి. అయితే కేంద్రం ఆ విషయంలో తటపటాయిస్తూ వచ్చింది. దేబ్రాయ్ కమిటీ 2015లో చేసిన సిఫార్సులు అప్పట్లో కలకలం సృష్టించాయి. రైల్వే మంత్రిత్వ శాఖను, రైల్వేలను వేరుచేయాలనడం, రైల్వే వ్యవస్థను రైళ్ల నిర్వహణకు మాత్రమే పరిమితం చేసి ఇతర బాధ్యతల నిర్వహణకు మౌలిక సదుపాయాల కంపెనీని ఏర్పాటు చేయాలని చెప్పడం అప్పట్లో తీవ్ర విమర్శలు రేకెత్తించాయి. ఇప్పుడు కేంద్ర కేబినెట్ అంత లోతుకు పోలేదు. అయితే ముమ్మందు వాటిపై కూడా దృష్టి సారించే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే 2018–2030 మధ్య రైల్వేల్లో 50 లక్షల కోట్ల మేర పీపీపీ ప్రాతిపదికన పెట్టుబడులు సేకరించాలని నిర్ణయించినట్టు నిరుటి రైల్వే పద్దులోనే కేంద్రం ప్రకటించింది. రైల్వేల్లో అమలు చేసే ఏ సంస్కరణలైనా దాని లోపాలను పరిహరించి, అది పూర్తి జవసత్వాలతో పనిచేసే విధంగా తీర్చిదిద్దాలి. కేవలం ప్రైవేటుకిస్తే మంత్రించినట్టు అంతా సవ్యంగా మారుతుందనే ధోరణి సరికాదు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి శు.పాడ్యమి ఉ.10.19 వరకు, తదుపరి విదియ నక్షత్రం పూర్వాషాఢ సా.5.47 వరకు, తదుపరి ఉత్తరాషాఢ వర్జ్యం రా.2.07 నుంచి 3.45 వరకు, దుర్ముహూర్తం ఉ.8.44 నుంచి 9.26 వరకు, తదుపరి ప.12.21 నుంచి 1.07 వరకు అమృతఘడియలు... ప.12.46 నుంచి 2.25 వరకు.

**సూర్యోదయం :** 6.32
**సూర్యాస్తమయం:** 5.29
**రాహుకాలం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

# వివక్ష విసిరిన భయోత్పాతం


దిలీప్ రెడ్డి

ఆపత్కాలంలో తన తోక కొసను తానే శరీరం నుంచి విడగొట్టుకోగలిగే ప్రత్యేక లక్షణం బల్లికి ఉంది. అలా విడివడిన తోక భాగం గిలగిలా కొట్టుకుంటుంటే అప్పటి వరకు తనను వెంటాడిన శత్రువు క్షణాల పాటు విస్మయానికి గురౌతుంది. అదే అదునుగా... సదరు బల్లి శత్రువుకి చిక్కే గండం తప్పించుకొని మెల్లగా సురక్షిత ప్రాంతానికి జారుకుంటుంది. మొండి శరీరానికి మళ్లీ తోక మొలిచి బల్లి మామూలు స్థితికి వస్తుంది, అది వేరే విషయం! పాలకులూ ప్రధానమైన ప్రజాసమస్యలు, తాము నేరుగా బాధ్యత వహించాల్సిన ముఖ్యాంశాల నుంచి జనం దృష్టి మళ్లించేందుకు ఇతరేతర విషయాల్ని తెరపైకి తెస్తుంటారు. అది గ్రహించని సాధారణ ప్రజలు, విద్యావంతులు, సమకాలీన ప్రసారమాధ్యమాలతో సహా... అలా తెరపైకి తీసుకువచ్చిన అప్రస్తుత అంశాల చుట్టే తిరుగుతూ, జనాల్ని తిప్పుతూ ఉంటారు. దాంతో అసలు సమస్యలు చర్చకు రాకుండా మరుగున పడిపోతుంటాయి. ఇది మన ప్రజాస్వామ్యంలో ఇటీవల రివాజుగా మారింది. జాతీయ పౌర నమోదు పట్టి (ఎన్నార్సీ), పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) విషయంలో జరుగుతున్న రగడ కూడా అటువంటిదేనేమో! అన్న భావన మొదట కలిగినా, అంతకన్నా ఎక్కువ ప్రమాద సంకేతాలే ఇప్పుడు కనిపిస్తున్నాయి. మొదట దీన్నొక దృష్టి మళ్లింపు చర్యగా పలువురు భావించడానికి బలమైన కారణాలే ఉన్నాయి. దేశ ఆర్థిక పరిస్థితి దిగజారడం, వార్షిక ఆర్థికాభివృద్ధి రేటు పడిపోయి 5–4 శాతం మధ్య కొట్టుమిట్టాడటం, నిరుద్యోగ సమస్య జఠిలమవడం, వ్యవసాయం కునారిల్లడం... వంటి వైఫల్యాల నుంచి జనం దృష్టి మళ్లించడానికి కేంద్రం చేపట్టిన చర్యనేమో అనుకున్నారు. కానీ, ఎన్నార్సీ అమలుకు పూర్వ రంగంగా ఇప్పుడు జాతీయ జనాభా నమోదు పట్టి (ఎన్పీఆర్) తయారీకి నడుం కట్టడంతో, ఎన్నార్సీ అమలుకే కేంద్రం కట్టుబడినట్టు రూఢీ అయింది. ఈ విషయంలో ఎన్డీయే ప్రభుత్వ పెద్దల మాటలకు, చేతలకు పొంతనలేనితనం సందేహాలకు తావిస్తోంది. మత ప్రాతిపదికన వివక్షాపూరిత విధానాలతో ఈ ప్రక్రియ చేపడుతున్నారనే విమర్శతో దేశవ్యాప్త నిరసనలు చెలరేగుతున్నాయి. భారతీయ ముస్లింలలో ఒక విధమైన భయాందోళనలకు ఇది కారణమౌతోంది. ఈ విషయంలో దేశ ప్రజల, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయ ఝరి రెండు పాయలుగా చీలింది. ఎనార్సీ, సీఏఏ, ఎన్పీఆర్ ఒకటికొకటి సంబంధం లేనివిగా చెబుతున్న కేంద్ర ప్రభుత్వపు మాటలూ నిజం కాదు.

### చర్చించలేదంటే.....!?

రాజకీయాల్లో కొన్నిసార్లు వ్యూహాత్మక వెనుకడుగు సహజమే! పాలకులు తమ ఆలోచనల్ని శైశవ దశలోనే జనబాహుళ్యంలోకి వదిలి, స్పందనను బట్టి ముందుకు సాగటమో, వెనక్కి తగ్గటమో చేస్తుంటారు. ఎనార్సీ విషయంలోనూ బీజేపీ నాయకత్వం ఇదే పంథా అనుసరిస్తోందేమో అనుకున్నారు. అసోమ్‌లో చేసినట్టు, దేశమంతటా అమలు చేస్తామని ముందు పార్లమెంట్ వేదిక నుంచి, బయటా చెప్పిన వారే దేశ వ్యాప్త నిరసనలు చూసి, 'మేమసలు చర్చించనేలేద'ంటున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనని ధృవీకరిస్తూ హోమ్ మంత్రి, బీజేపీ అధినేత అమిత్‌షా మాట్లాడారు. కానీ, స్పష్టత కొరవడింది. ఆలోచించలేదన్నారు కదా! పోనీ, 'అమలు తలంపు లేదు' అంటున్నారా? అంటే, అనటం లేదు. అందుకే, నిరసనలు పెల్లుబికి సర్వత్రా నిప్పు రగులుతూ ఉంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు తాము ఎన్నార్సీ అమలు పరిచేది లేదని కరాఖండిగా ప్రకటించాయి. తాజాగా జాతీయ జనాభా నమోదు పట్టి (ఎన్పీఆర్) రూపొందించే ప్రక్రియను కేంద్రం ప్రారంభించింది. దీనికోసం ప్రత్యేకంగా బడ్జెట్ పెట్టడమే కాకుండా వచ్చే సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబరు మధ్య ఈ ప్రక్రియ పూర్తిచేయాలని మంత్రివర్గం ఆమోదించింది. ఈ చర్యలతో సర్కారు వైఖరి స్పష్టమైంది. పౌరసత్వ

## సమకాలీనం




సవరణ బిల్లుకు వ్యతిరేకత రాగానే, ఎన్నార్సీకి, సీఏఏకి సంబంధం లేదని ఇన్నాళ్లు చెబుతూ వస్తున్న ప్రభుత్వం ఇప్పుడు ఎన్నార్సీకి, ఎన్పీఆర్‌కు సంబంధం లేదని చెబుతోంది. ఈ వాదనే విచిత్రం. ఇవన్నీ ఒక తాను (పౌరసత్వ చట్టం–1955) ముక్కలే! కేంద్ర ప్రభుత్వ పెద్దలు, మంత్రులు లోగడ చేసిన అధికారిక ప్రకటనకు తాజా వాదన పూర్తి విరుద్ధం! హోమ్ మంత్రిత్వ శాఖవారు లోగడ (2014 కు పూర్వం, తర్వాత కూడా) లోకసభలో పలు సందర్భాల్లో... ఎన్నార్సీ అమలుకు ఎన్పీఆర్ తొలిమెట్టని సెలవిచ్చారు. రెండు వేర్వేరు ప్రక్రియలే అయినా, ఒకదానితో ఒకటి ముడివడి ఉన్న వ్యవహారాలే! సాపేక్షంగా చెప్పాల్సి వస్తే.... పిండి పిసకటం, రొట్టె కాల్చడం రెండూ ఒకటి కాదు. వేర్వేరనే మాట నిజమే! కానీ, పిండి పిసికేది దేనికి? రొట్టె కాల్చడానికి కాదా? మరి సంబంధం లేదని ఎలా అనగలం?

### కాంగ్రెస్ సందిగ్ధతకు కారణమేంటో!

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ భాగస్వామ్యంతో ఉన్న మహారాష్ట్ర ప్రభుత్వాధినేతలు... తాము ఎనార్సీ అమలుపరచమని ప్రకటించారు. అలా ప్రకటించిన మమతా బెనర్జీ (పశ్చిమబెంగాల్), వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఆంధ్రప్రదేశ్), నితీష్‌కుమార్ (బీహార్), నవీన్ పట్నాయక్ (ఒడిశా) తదితర ముఖ్యమంత్రులు వేర్వేరు పార్టీలకు స్వయంగా అధినేతలు. కాంగ్రెస్ విషయానికి వస్తే పరిస్థితి భిన్నం. ఢిల్లీ అధినాయకత్వం విధాన ప్రకటన చేయాలి. ఎన్నార్సీని ఇంతగా ప్రతిఘటిస్తున్న కాంగ్రెస్ అధినాయకత్వం, తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దీన్ని అమలుపరచబోమని ప్రకటించడం లేదు. ఇది, అదునుగా బీజేపీ నాయకత్వం కాంగ్రెస్‌పైనే బాణాలు ఎక్కుపెడుతోంది. పౌరసత్వ ప్రస్తుత సవరణ చట్టం మూలాలు 2003 సవరణలోనే ఉన్నాయి. పౌరసత్వ చట్టం–1955ను నాటి వాజ్‌పేయి ప్రభుత్వం సవరించింది. దశాబ్ద కాలం (2004–14) అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎందుకీ సవరణల్ని తొలగించలేదని అడుగుతున్నారు. నాటి యూపీఏ ప్రభుత్వం (2010–11) ఎన్పీఆర్ జరిపినా ఎన్నార్సీకి సాహసించలేదు. 2014 తర్వాత పార్లమెంటులోనే పలు సందర్భాల్లో తాము దేశవ్యాప్త ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లతో వెళతామని ఎన్డీయే పాలకులు విస్పష్టంగా చెప్పినా కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకించలేదు? అనే ప్రశ్న సంధిస్తున్నారు. అందుకేనేమో, కాంగ్రెస్ ప్రస్తుత సంకట పరిస్థితి! కానీ, ఇప్పుడు వివాదమంతా వాజ్‌పేయి నేతృత్వంలో (2003) జరిగిన పౌరసత్వ సవరణ చట్టంపైనే అన్నది గుర్తెరగాలి. దాని ప్రకారం, భారత పౌరుల్ని లెక్కించి ఎన్పీఆర్ రూపొందిస్తారు, లెక్కించిన పౌరుల పౌరసత్వాన్ని ప్రభుత్వం గుర్తించాలి. అలా గుర్తింపు పొందిన పౌరులంతా మరో అధికారిక పత్రం 'జాతీయ భారత పౌర నమోదు పట్టి' (ఎన్ఆర్ఐసీ)లో భాగమవుతారు. దాన్నే మనమిపుడు ఎన్నార్సీ అంటున్నాం. ఈ ప్రక్రియ మధ్యలో, లెక్కించిన పౌరుల గుర్తింపునకు తాజా పౌరసత్వ సవరణ చట్టం–2019 ప్రాతిపదిక అవుతుంది. అదే తాజా వివాదానికి ఆజ్యం పోస్తోంది. ఎందుకంటే, తాజా సవరణల్లో పొందుపరిచిన ప్రాతిపదికలే వివాదాస్పదంగా, వివక్షాపూరితంగా ఉన్నాయి. ఇక, ఒకటికొకటి సంబంధం లేదనే వాదనకు అర్థమే లేదు.

### సవరణ–ప్రాతిపదికలతోనే తంటాలు

కాంగ్రెస్ ప్రభుత్వ హయాం 2010–11లో జరిగిన ఎన్పీఆర్‌కి, ఇప్పుడు జరుపబోయేదానికి ఎంతో వ్యత్యాసముంది. సవరణ చిన్నదిగా కనిపిస్తున్నా, ఎన్నార్సీ ప్రక్రియకు సీఏఏ చట్ట తాజా సవరణాంశాల్ని అనుసంధానించినపుడు సమస్య జఠిలమౌతోంది. ప్రాతిపదికలలా ఉన్నాయి. లెక్కించిన పౌరుల్ని గుర్తించి, పౌరసత్వం ఇచ్చే అంశంపైనే (అంటే... మిగిలిన వారికి నిరాకరించే, అనే అర్థం కూడా తీసుకోవాలి) ఈ ప్రభుత్వం ఎక్కువ దృష్టి పెట్టినట్టు స్పష్టమౌతోంది. ఎలా అంటే, తాజా ఎన్పీఆర్‌లో, మీవే కాకుండా మీ తలిదండ్రుల పుట్టిన స్థలం, తేదీల ధ్రువీకరణనూ అడుగుతారు. ఉదా: మీరు 26 జనవరి, 1950–1 జులై, 1987 ల మధ్య పుట్టిన భారతీయులైతే, మీ పుట్టిన స్థలం–తేదీ ఉంటే సరిపోతుంది. కానీ, 2 జులై 1987–2 డిసెంబరు 2004 మధ్య పుట్టిన వారైతే, మీ తలిదండ్రుల్లో ఒకరైనా భారతదేశంలో పుట్టిన పౌరులై ఉండాలి. అడిగితే, వారి పుట్టిన స్థలం, తేదీని ధ్రువీకరించాల్సి ఉంటుంది. 2004 డిసెంబర్ 3, లేదా తర్వాత పుట్టిన వారైతే మరింత సంక్లిష్టమైన ప్రక్రియ ఉంది. మీరు భారత్‌లోనే పుట్టినా, మీకు ఓటరు–ఆధార్ కార్డు ఉన్నా తలిదండ్రుల పుట్టిన తేదీ–స్థలం ధ్రువీకరణ లేకుంటే మీకు పౌరులుగా గుర్తింపు దక్కదు. మూడు పొరుగు దేశాలు బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లను ఎంపిక చేసుకోవడం, ఆయా దేశాల్లో అల్ప సంఖ్యాకులైన అయిదు మతాల వారిని తీసుకొని, ముస్లింలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో ప్రస్తుత వివక్ష నెలకొందనే వాదన ఉంది. ఇది రాజ్యాంగం కల్పించిన సమానత్వ స్ఫూర్తికి, నిబంధనలకు వ్యతిరేకమని వారంటున్నారు. అసోమ్‌లో అమలైన ఎన్నార్సీ వల్ల స్థానికులు, హిందువులు, గిరిజనులతో సహా దాదాపు పదిలక్షల మంది పౌరసత్వం దక్కక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అక్కడి సంక్షోభాన్ని పరిష్కరించకుండానే దేశవ్యాప్త ఎన్నార్సీ అమలు లెక్కలేనన్ని చిక్కుల్ని స్వాగతించడమే అని విపక్షాల విమర్శ. ఇంకా చాలా.. సమాధానా ల్లేని సందేహాలు, జవాబులు దొరకని ప్రశ్నలు భారత దేశ లౌకిక మూల సూత్రపు పునాదుల్ని వణికిస్తున్నాయి.

ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




### గౌరవం



"తొమ్మిదిమంది మహిళలను లైంగికంగా వేధించిన కవి వైరముత్తును దేశ రక్షణ మంత్రి గౌరవ డాక్టరేట్‌తో సత్కరిస్తున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తెలిసినా వారికి ఎటువంటి ఇబ్బందీ ఉండదని ఇలా చాటి చెప్పడమే కాకుండా, నన్ను పని చేసుకోనీయకుండా నిషేధించారు. నాకు తెలుసు ఆయన భాషా పటిమకే ఈ అవార్డు ఇస్తున్నారని, దాంతోపాటు సీరియల్ వేధింపుదారుడిగా కూడా మరో డాక్టరేట్ ఇస్తే బావుండేది. నీ విద్యార్థులకు నువ్వు రోల్ మోడల్‌గా పనికిరావు"

– చిన్మయి శ్రీపాద, గాయని

### సలహాలు



"అంటే, ఇప్పుడు మన సైనికాధికారి రాజకీయ సలహాలు ఇస్తాడన్నమాట. మన బలగాలు రాజకీయేతరంగా ఎలా ఉన్నాయా అని ఆశ్చర్యం కలుగుతుంటుంది. ఇక మీదట అంత ఆశ్చర్యపోనవసరం లేదు"

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

### వింటారా



"ఇది ఎవరైనా వింటారో లేదో తెలియదు. కానీ, స్వతంత్ర ఆలోచనను ప్రేరేపించేలా బోధించని ఏ సమాజమైనా కాలక్రమంలో బానిసలనే తయారు చేస్తుంది. పౌరులను కాదు"

– ఒమైర్ అహ్మద్, రచయిత

### యుద్ధం



"వేలాదిమందిని జైళ్లలో పెట్టడం వల్ల ఉత్తరప్రదేశ్‌లో ఏర్పడిన నిస్సహాయస్థితి ఊహించలేనిది. ఇటువంటివి యుద్ధ సమయంలో జరుగుతాయి. రాత్రికి రాత్రి మీ కుటుంబంలోని యువకులు అదృశ్యమైపోతారు. మీరంతా వాళ్లు తిరిగి రారేమోననే భయంతో గడపాల్సిందే"

– నోమీ బార్టన్, జర్నలిస్ట్

### ఇబ్బందులు



"అయోధ్య, 370 అధికరణం, సీఏఏ తరువాత సూర్య గ్రహణం అవసరం లేదు. దేశ ప్రజలను మోదీ, షాలు మరోసారి ఇబ్బందుల పాలు చేస్తున్నారు. కనీసం వాళ్లు సూర్య గ్రహణం రాత్రిపూట వచ్చేలా చేస్తే ప్రజలకు ఇన్ని ఇబ్బందులు ఉండేవి కావు. ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి–లౌకిక వాదులు"

– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

### సభ్యత



"వాజ్‌పేయి గురించి శశిథరూర్ ఎంత సభ్యతగా మాట్లాడుతున్నాడో? నెల్లీ మారణహోమానికి ముందు ఆయన చేసిన వెన్నులో వణుకు పుట్టించే ఉపన్యాసం విన్నారా? పోనీ బాబ్రీ విధ్వంసానికి ముందు ఖండఖండాలుగా సాగిన ఆయన ప్రసంగం విన్నారా? ఎందుకంటే కవిత్వం చెప్పడం, ఆడవాళ్లను చేరదీయడం, మందు, ఆహారాలను ఇష్టపడటం వాజ్‌పేయిని సభ్యతగలవాడిగా ఉంచలేవు. ఆయన ఫాసిజానికి వేసిన దారులను మనం ఇప్పుడు చూస్తున్నాం"

– సుబీర్ సిన్హా, విద్యావేత్త

### గుర్తింపు



"భారతీయ జనతా పార్టీ అధికారంలో లేని ప్రాంతంగా ఉండే విలువను ఢిల్లీ గుర్తించాలి. సంఘ్ పరివార్ గూండాలు పోలీసులను అదుపు చేస్తున్నప్పటికీ ఇది ఉత్తర ప్రదేశ్ కంటే ఉత్తమమే"

– రూపా గులాబ్, రచయిత

## ఇన్‌బాక్స్

### కార్చిచ్చు కాకూడదు

మట్టి ఏ దేశానిదైనా
ఒకటే అయినప్పుడు
మనుషుల్లో ఇన్ని
అంతరాలెందుకు?

మాటల్లో మానవత్వాన్ని
చాటే మనం మతాలుగా
విడిపోవడమెందుకు?

అభద్రతా భావమేనేమో..!
విభిన్న మతాలను సృష్టించి
ఆధిపత్యం కోసం పాకులాడే
విష సంస్కృతిని ప్రేరేపించింది

ఏదైనా మనదాకా
వస్తేనే కదా తెలిసొచ్చేది
పక్కోడి ఇల్లు కాలినా,
కూలినా మనకేంటి

నోట్లో బూడిద కొట్టి
ప్రసాదమంటే
పరవశించిపోయే
మన లాంటి వాళ్ళ కోసం
కొత్త చట్టాలు పుడుతూనే ఉంటాయి

దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టి
లౌకికతత్వాన్ని తుత్తునియలు చేసే
సవరణలు జరుగుతూనే ఉంటాయి

పెద్దనోట్ల రద్దు
నల్లధనం జాడ తీయలేదు
ఒకే దేశం – ఒకే పన్ను నినాదం
అద్భుతాలూ సృష్టించలేదు





సామాన్యుడిని
కష్టాల పాలు జేశాయి
దేశాన్ని మాంద్యం బారిన
పడకుండా ఆపలేకపోయాయి
సవరణ జాతిని ఏకం చేసే
సంస్కరణ కావాలి కానీ
విద్వేషాలను రగిల్చే
కార్చిచ్చు కాకూడదు

గుండు కరుణాకర్, వరంగల్
మొబైల్ : 98668 99046

# జాతీయవాదం పట్టని జార్ఖండ్ ఓటరు..!

విశ్లేషణ


లక్ష్మణ వెంకట్ కూచి

జార్ఖండ్‌లో పొందిన అవమానకరమైన ఓటమి కేంద్రంలో పాలక బీజేపీకి గట్టి సందేశాన్నే పంపింది. ఆర్థిక మాంద్యం ఓటర్లపై తన ప్రభావం వేయడం మొదలెట్టిందని, ఓటర్లు కూడు గుడ్డకే ప్రాధాన్యం ఇస్తున్నారని తేలిపోయింది. ఒక చిన్న గిరిజన రాష్ట్రం జార్ఖండ్‌లో సార్వత్రిక ఎన్నికల్లో అఖిల జార్ఖండ్ విద్యార్థుల యూనియన్ (ఏజేఎస్‌యూ)తో పొత్తుపెట్టుకుని పోటీ చేసిన బీజేపీ ఆ రాష్ట్రంలోని 14 ఎంపీ స్థానాలకు గాను 12 స్థానాలు గెల్చుకుని విజయ దుందుభిని మోగించింది. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ కూటమి 51 శాతం ఓట్లను సాధించింది.

జార్ఖండ్ శాసనసభకు జరిగిన తాజా ఎన్నికల్లో, జార్ఖండ్ ముక్తి మోర్చాతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ చేతిలో బీజేపీ ఘోరపరాజయాన్ని చవిచూసింది. అతి శక్తివంతమైన బీజేపీ ఎన్నికల యంత్రాంగాన్ని ఓడించవచ్చని ఈ ఫలితాలు నిరూపించడమే కాదు.. బీజేపీ బలమే ఇప్పుడు దాని అతిపెద్ద బలహీనతగా మారిపోయిందని స్పష్టమైంది. ప్రత్యేకించి రాష్ట్రాల పరంగా చూస్తే ప్రాంతీయ పార్టీలు ఎన్నికల ముందు లేక ఆ తర్వాత బీజేపీతో సాగిస్తున్న పొత్తును రద్దు చేసుకున్నాయి. జార్ఖండ్ ఎన్నికల్లో ఏజేఎస్‌యూ సాధించిన 9 శాతం ఓట్ల షేర్ ఆ రాష్ట్రంలో అధికార మార్పిడికి ప్రధాన కారణమైంది. తమ ఆశల్ని, ఆకాంక్షల్ని తీర్చడంలో విఫలమైన ప్రభుత్వాన్ని ఓటర్లు నిర్దాక్షిణ్యంగా గద్దె నుంచి తప్పిస్తారని, నిత్యావసర అవసరాల విషయానికి వచ్చేసరికి ఓటర్లు ఎలాంటి అపసవ్య విధానాలను సహించబోరని జార్ఖండ్ ఎన్నికలు సందేశం ఇచ్చాయి.

దేశంలో అత్యంత ప్రజాదరణ, విశ్వసనీయత కలిగిన నాయకుడిగా ప్రధాని మోదీ ఇప్పటికీ అగ్రస్థానంలో ఉన్నారు. కానీ స్థానిక ప్రభుత్వాలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయినప్పుడు, ప్రభుత్వాలపై వ్యతిరేకత ప్రబలిపోయినప్పుడు పార్టీని పైకెత్తడం ప్రధానికి కూడా సాధ్యం కాదని తేలిపోయింది. ఇంతవరకు జార్ఖండ్ సీఎంగా వ్యవహరించిన రఘుబర్ దాస్‌తోపాటు చాలామంది కేబి




నెట్ మంత్రులు కూడా ఓడిపోయారంటే ప్రభుత్వంపై వ్యతిరేకత అంతగా పెరిగిందని అర్థం.

స్థానిక అంశాలు, కూటమిలో సమస్యలు బీజేపీ ఓటమికి ప్రధాన కారణం కావచ్చు కానీ, జార్ఖండ్ ఓటర్ తన చుట్టూ జరుగుతున్న పరిణామాలను మర్చిపోయారని చెప్పలేం. ఒకవేళ మర్చిపోయారు అనుకున్నా.. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో హిందుత్వ ఎజెండాలో పురోగతి, ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370 రద్దు, రామ్ మందిరం, పౌరసత్వ సవరణ చట్టం వంటి తాము సాధించిన ఘనతల గురించి ఓటర్లకు పదేపదే గుర్తు చేస్తూ వచ్చారు. కానీ ప్రజలను విభజించే ప్రయత్నాలకు లొంగని ఓటర్లు తమ తక్షణ సమస్య రోజువారీ జీవిత సమస్యే అని గట్టిగా ప్రకటించారు. ఆర్థిక వ్యవస్థను చక్కదిద్ది దాన్ని తిరిగి పట్టాల మీద నిలబెట్టండి అనేది ఓటరు ఇస్తున్న పెద్ద సందేశం. కాకతాళీయంగా ఎన్నికల ముందు పొత్తు పెట్టుకున్న జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్ పార్టీలు స్థానిక, దైనందిన సమస్యలపట్ల దృష్టి కేంద్రీకరించాయి.


లోక్‌సభ ఎన్నికలకు ముందు 2018 నవంబర్‌లో కాంగ్రెస్ మూడు కీలక రాష్ట్రాలను (మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్) గెల్చుకుంది. కానీ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇక్కడే ఘోరంగా దెబ్బతినింది. అయితే ప్రతిపక్షం ఐక్యంగా పనిచేస్తే బీజేపీని ఓడించవచ్చనే వాస్తవాన్ని జార్ఖండ్ మళ్లీ స్పష్టం చేసింది. అయితే దేశవ్యాప్తంగా ప్రభావం చూపే విస్తృత స్థాయి తనకుందనీ, బీజేపీకి తాను ప్రత్యామ్నాయం కాగలననే విశ్వాసాన్ని దేశానికి ప్రతిపక్షం కలిగించగలదా? ఇక బీజేపీ విషయానికి వస్తే జార్ఖండ్ ఫలితాలు పెనుదెబ్బే అవుతున్నాయి. అది వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిందే. మరికొద్ది నెలల్లో ఢిల్లీలో ఆప్ పార్టీతో, 2021లో పశ్చిమ బెంగాల్‌లో మమతతో బీజేపీ మరో అతిపెద్ద పరీక్షను ఎదుర్కోనుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

# అనుభూతుల తపన




ఎడతెగని ఆలోచన.. దేని గురించో తీరని తపన.. వెరసి కుందాపన. కవి దేని గురించి ఆర్తిగా చేతులు చాస్తాడో, దేని గురించి కళ్లల్లో ఒత్తులు వేసుకుని వెతుకుతాడో.. అది సార్వజనీనం అయినప్పుడు పాఠకుడు కవితను సొంతం అనుభూతి చెందుతాడు. అటువంటి అనుభూతిని నిండారా పంచుతుంది రవి వీరెల్లి 'కుందాపన'. ప్రతి కవీ ప్రకృతి ప్రేమికుడే. ఎంతో మంది ఎన్నో వేల కవితలు రాసినా చేవగల కవి కోసం ఇంకెన్నో వేలు మిగిలే ఉంటాయి. లక్షలాది ఉపమానాలు వాడేసినా కవిత్వాన్ని నిష్టగా స్వీకరించే కవి.. ఆ అరిగిపోయిన పదాల నీడను కూడా తన కవితలపై పడనివ్వడు. అందుకే 'గాలీ గడ్డిపరక ఉప్పబస్తాట ఆడుకున్నప్పుడో' అని చక్కని ఊహ చేస్తాడు. 'దుఃఖాన్ని దువ్వి/తడిముద్దు చుక్కపెట్టి/గగనాన్ని తెచ్చి గుమ్మానికి కాపలా కట్టి'అంటూ వెళ్లిపోయిన ఆమెను తలచుకుంటాడు.




తెలంగాణలోని కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఆముదాలపల్లి లాంటి మారుమూల గ్రామం నుంచి అగ్రరాజ్యం అమెరికాలోని వర్జీనియాకు వెళ్లిపోయిన రవి, తనను వేధించిన ఎడబాటును, కోల్పోయినతనాన్ని కాస్త ఆలస్యంగానే అయినా కవిత్వంలో వెతుక్కునే ప్రయత్నం చేయడం మంచి పరిణామం. 'నిండా పూసి / గలగలా మాట్లాడే చెట్టు కూడా/ అప్పుడప్పుడు మూగవోతుంది' అలాంటి సందర్భంలోనే కవిత్వం అతడికి తొవ్వ చూపి దూప తీర్చింది. అప్పటి నుంచి 'ఆకులకు మనసురంగులద్ది/భూమ్మీదికి ఉత్తరాల్లా' వదిలినట్టు అక్షరాలకు కాసింత మమతను అద్ది ఇలా వ్యక్తమవుతున్నాడు. 'ఎప్పట్లాగే/చీకటి పుల్లకు లోకాన్ని గుచ్చి/రేపటి నిప్పుకణికల మీద కాల్చడానికి/వ్యూహ రచన' చేస్తూంటాడు. చిక్కని అనుభూతులను తలపోసుకోవాలంటే ఈ కవిత్వాన్ని కౌగిలించుకోవాల్సిందే. – దేశరాజు


(వెల: రూ. 100/–, ప్రతులకు: స్టాల్ నెం. 276, హైదరాబాద్ బుక్ ఫెయిర్)

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం ॥ 27-12-2019


● ముగ్గు-ముచ్చట





**టి. కల్యాణి**
ప్రొద్దుటూరు,
వైఎస్ఆర్ జిల్లా

24 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకు, సరి చుక్క



21 చుక్కలు
మధ్య వరుస
1 వచ్చేవరకు



**ఎస్.చైతన్య**
నందిగుంట,
నెల్లూరు జిల్లా



అశ్వతి సతీశన్

# చెదరని సంతకం

**ఒక్క సంతకం.. జీవిత గమనాన్ని మారుస్తుంది.**
**ఒక్క సంతకం.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంది.**
**ఒక్క సంతకం.. నీకు రక్షణగా నేనున్నాననే ధైర్యాన్నిస్తుంది.**
**ఆ సంతకమే చెదిరిపోతే.. జీవితం చెల్లని చీటీ అవుతుంది.**
**చెల్లని సంతకంతో జీవితం ప్రశ్నార్థకమవుతుంది.**
**అశ్వతి రూపొందించిన ఈ పెన్ను**
**వణికే చేతికి చెదరని సంతకాన్ని భరోసాగా ఇస్తోంది.**

''ఇదేంటి! నా కాఫీ కప్పు ఏమైంది? కాఫీ ఇంత పెద్ద మగ్గులో ఇచ్చావేంటమ్మా'' కూతురిచ్చిన కాఫీ మగ్గు అందుకుంటూ అన్నారు రామకృష్ణారావు. మగ్గులో సగానికే ఉంది కాఫీ. ఇంత పెద్ద మగ్గులో నుంచి కాఫీ ఎలా తాగాలి. ''కాకిలాగ అడుగున రాళ్లేసి తాగాలా? కొబ్బరి బోండాం తాగినట్లు స్ట్రా వేసుకుని తాగాలా? తల్లీ'' కాఫీ మగ్గు మీదున్న మనవరాలి ఫొటోను చూసి మురిపెంగా నవ్వుకుంటూ కూతుర్ని అడిగారాయన.

''నాన్నా! నిన్న నీళ్లు తాగేటప్పుడు మీ చెయ్యి వణికి, నీళ్లు మీమీద ఒలికిపోయాయి. గుర్తులేదా. నీళ్లు కాబట్టి సరిపోయింది. వేడి కాఫీ ఒలికితే ..?' చిరుకోపంగా అంటూ లోపలికి వెళ్లిపోయిందామె.

''నాకు వయసైపోవడమేంటి? పిల్లలతో పాటు పరుగుపెట్టగలను'' బింకంగా అంటూ కాఫీ మగ్గులోకి తొంగి చూశారాయన.

● ● ●

''మీ సిగ్నేచర్ ట్యాలీ కావట్లేదు. మళ్లీ చేయండి''బ్యాంకు క్లర్క్ డిపాజిట్ ఫామ్‌ని, చెక్ లీఫ్‌ని మార్చి మార్చి చూస్తూ, కంప్యూటర్‌లో ఉన్న స్పెసిమెన్ సిగ్నేచర్‌తో సరిపోల్చుకుంటూ అన్నది.

''కొన్నేళ్లుగా నెలనెలా వచ్చి డిపాజిట్ ఫామ్, చెక్కుల మీద సంతకం చేస్తూనే ఉన్నాను కదమ్మా. ఇప్పుడు కొత్తగా సరిపోలకపోవడం ఏంటి'' ఆందోళనగా అడిగారు సుజాతమ్మ.

''రాసేటప్పుడు మీ చెయ్యి వణుకుతున్నట్లుంది. పెద్దవయసు కదా. ఇప్పుడే వస్తాను'' అంటూ ఆ చెక్ లీఫ్ పట్టుకుని మేనేజర్ క్యాబిన్‌లోకి వెళ్లిందామె. సుజాతమ్మ చెవుల్లో మళ్లీ మళ్లీ వినిపిస్తున్నది 'పెద్ద వయసు కదా' అనే మాట ఒక్కటే.

క్లర్క్ వచ్చి సీట్లో కూర్చుని మళ్లీ కంప్యూటర్ స్క్రీన్‌ని కళ్లు విప్పార్చి చూస్తోంది.

''ప్రతినెలా నా పెన్షన్ నుంచి ఓ అనాథ శరణాలయానికి విరాళం పంపిస్తుంటానమ్మా. డబ్బు ఆగిపోతే వాళ్లు ఇబ్బంది పడతారు తల్లీ'' బతిమలాడుతున్నట్లు అడిగింది సుజాతమ్మ.

''ఇప్పటికి పాస్ చేస్తున్నాం. మరో రోజు వచ్చి కొత్తగా సంతకాలు చేయండి. సిస్టమ్‌లో ఫీడ్ చేస్తాం'' అని చెప్పిందా క్లర్కు.

● ● ●

''తాతయ్యా! నువ్వేసిన బొమ్మ చూడు, ఎలా వంకర పోయిందో'' బుంగమూతి పెట్టాడు సుహాస్.

బొమ్మ సరిగ్గా రాలేదన్న సంగతి శ్రీనివాసరావుకి తెలుస్తూనే ఉంది. గొప్ప చిత్రకారుడిగా అందుకున్న అవార్డులు ఆయన కళ్లముందు మెదిలాయి. డ్రాయింగ్ టీచర్‌గా స్కూల్లో పిల్లలకు బొమ్మలు వేయడం నేర్పించిన ముప్పై ఏళ్ల అనుభవం వంకర్లు పోతోంది. ఇంకా ఎన్నో అద్భుతమైన చిత్రాలు ఆయన కలలో ఉన్నాయి. తాను కలగన్న చిత్రాలను కాన్వాస్ మీద చూసుకోవడం అనేది కూడా ఇక కలేనా.. ఒక్కసారిగా ఆందోళన ఆవరించిందాయన్ని.

● ● ●

ఈ సమస్య రామకృష్ణారావు, లలితమ్మ, శ్రీనివాసరావులది మాత్రమే కాదు. లక్షమందిలో ఇద్దరు– ముగ్గురు ఈ 'ప్రోగ్రెసివ్ న్యూరో డీజనరేటివ్ డిజార్డర్'తో బాధపడుతున్నారు. డెబ్బై – ఎనభై ఏళ్లు నిండిన వాళ్లలో అయితే ప్రతి ఐదుగురిలో ఒకరు ఇలా ఇబ్బంది పడుతుంటారు. ఈ సమస్యను వాడుకలో పార్కిన్‌సన్స్ డిసీజ్ అంటాం. బ్రిటిష్ ఫిజీషియన్ 'జేమ్స్ పార్కిన్‌సన్' రెండు వందల ఏళ్ల కిందట ఈ వ్యాధి లక్షణాల మీద అధ్యయనం చేసి ప్రపంచానికి తెలియచేశాడు. అందుకే దీనిని పార్కిన్‌సన్స్ డిసీజ్ అంటున్నాం. ఇప్పుడు అశ్వతి సతీశన్ అనే 23 ఏళ్ల అమ్మాయి పార్కిన్‌సన్స్‌తో బాధపడే వాళ్ల కోసం ప్రత్యేకమైన పెన్నును డిజైన్ చేసింది. ఇలాంటి వినూత్నమైన ఉపకరణానికి రూపకల్పన చేసినందుకు ఆమె ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మకమైన 'జేమ్స్ డైసన్ అవార్డు 2019' అందుకున్నారు.

● ● ●

అశ్వతి సతీశన్ అహ్మదాబాద్‌లోని ఎన్ఐడీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్)లో గ్రాడ్యుయేషన్ స్టూడెంట్. ఆమె తన కోర్సు ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన అధ్యయనాన్ని మరింత లోతుగా కొనసాగించారు. వందల మంది పార్కిన్‌సన్స్ పేషెంట్‌లను స్వయంగా కలిశారు. ''నేను కలిసిన వాళ్లు అందరూ పెద్దవాళ్లు, ఉన్నత చదువులు చదివి మంచి హోదాలో ఉద్యోగాలు చేసి రిటైర్ అయిన వాళ్లున్నారు. అవార్డులందుకున్న గొప్ప చిత్రకారులున్నారు. అలాంటి వాళ్లను కనీసం సంతకం కూడా చేయలేని స్థితిలో చూశాను. వీళ్లకోసం కొత్త ఉపకరణాన్ని తయారు చేయాలనే నిర్ణయానికి వచ్చాను. గైరోస్కోపిక్ ప్రిన్సిపల్స్‌తో పెన్నుని డిజైన్ చేశాను. ఒక తిరిగే వస్తువు కదలికను దాని ఇరుసు నియంత్రిస్తూ ఉంటుంది. అదే విధానాన్ని ఈ పెన్ను తయారీలో అనుసరించాను. నేను తయారు చేసిన ఫ్లియో పెన్ బ్యాటరీతోనూ, కరెంట్ రీచార్జ్ ద్వారా కూడా పని చేస్తుంది. నా ప్రయోగం సక్సెస్ అయింది. నా ప్రయోగాన్ని నిపుణులు ఆమోదించి అవార్డు ఇచ్చారు. ఇది వినియోగదారుల చేతుల్లోకి రావడానికి టైమ్ పడుతుంది. యూకేకి చెందిన జేమ్స్ ఫౌండేషన్ వాళ్లు అవార్డుతోపాటు వచ్చిన రెండువేల పౌండ్లతో నా పరిశోధనను విస్తృతం చేస్తాను'' అని చెప్పారు అశ్వతి.

**– వాకా మంజులారెడ్డి**

## జీవితం సాఫీగా సాగుతుంది

**పా**ర్కిన్‌సన్స్ వ్యాధి వచ్చిన వాళ్లలో చెయ్యి వణకడంతోపాటు స్లో నెస్, స్టిఫ్‌నెస్ ఉంటాయి. ఆ ప్రభావం హ్యాండ్ రైటింగ్ మీద పడుతుంది. అక్షరాల సైజు కూడా తగ్గిపోతుంది. దీనిని మైక్రో గ్రాఫియా అంటారు. మూడు నుంచి ఐదేళ్ల వరకు కొంత అసౌకర్యం ఉన్నప్పటికీ దైనందిన జీవనంలో గణనీయమైన మార్పులేవీ కనిపించవు. మొదట్లో మందుల ప్రభావం ఎనిమిది గంటల సేపు ఉంటుంది. క్రమంగా ఆరు గంటలకు తగ్గిపోతుంటుంది. నరాల బలహీనత కుడి–ఎడమల్లో కొంచెం తేడా ఉంటుంది. కుడివైపు తీవ్రత ఎక్కువగా ఉన్న వాళ్లలో అన్నం కలుపుకునేటప్పుడు, తినేటప్పుడు చెయ్యి వణకడం స్పష్టంగా తెలుస్తుంటుంది. సంతకాలు మ్యాచ్ కాకపోవడం వంటి తీవ్రమైన పరిస్థితులు ఎదురవుతాయి. అలాంటి దశలో సంతకాలు మానేసి వేలిముద్ర వేయాల్సి వస్తుంది. ఇప్పుడు అందుబాటులోకి వస్తున్న పెన్ను చాలా ఉపయుక్తంగా ఉంటుంది. వాళ్ల లైఫ్ ఈజీ అవుతుంది.



**– డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి**
**న్యూరాలజిస్ట్**

## ఇంట్లోనే పెప్పర్ స్ప్రే తయారీ

**ది**శ సంఘటన తర్వాత మహిళా భద్రత విషయంలో దేశమంతా అప్రమత్తమైంది. ప్రతిరోజు ఏదో ఒక చోట జాగ్రత్త చర్యలు.. అవగాహనా కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు వింటున్నాం.. చూస్తున్నాం! విమెన్ సేఫ్టీ మీద ఎప్పుడో రెండేళ్ల కిందట వచ్చిన వీడియోలు ఇప్పుడు వైరల్ అవుతూండడమూ చూస్తున్నాం! సిమ్లా (హిమాచల్ ప్రదేశ్) తొలి మహిళా ఐపీఎస్ ఆఫీసర్‌గా పేరు తెచ్చుకున్న సౌమ్యా సాంబశివన్ మహిళల ఆత్మరక్షణాయుధం 'పెప్పర్ స్ప్రే' తయారీపై రెండేళ్ల కిందట విడుదల చేసిన వీడియో కూడా అలా ఇప్పుడు వైరల్ అయింది. 2017లో హిమాచల్‌ప్రదేశ్‌లోని సిర్మూర్ జిల్లాలోని మహిళలకు ఆత్మరక్షణ శిక్షణలో భాగంగా తనే స్వయంగా పెప్పర్ స్ప్రే తయారు చేసే విధానాన్ని చూపించారు. ''పాశ్చాత్య దేశాల్లోని ఆడవాళ్ల ఆత్మరక్షణ ఆయుధం పెప్పర్ స్ప్రేనే. ఇప్పుడు ఇక్కడా దొరుకుతోంది. కాని రెండు వందల రూపాయలు. అమ్మో అంత ధరా అని కొనడానికి వెనకాడతారు మన అక్కాచెల్లెళ్లు. అందుకే పెప్పర్‌స్ప్రేను సింపుల్‌గా ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. ఘాటైన రెండు స్పూన్ల కారానికి అంతే ఘాటైన రెండు స్పూన్ల మిరియాల పొడి జత చేసి ఈ పొడిని రిఫైండ్ ఆయిల్‌లో కలిపి.. దానికి నెయిల్ పాలిష్ రిమూవర్‌ను కలిపి.. వడ కట్టి.. స్ప్రే బాటిల్‌లో పోసుకోవడమే. దీన్నో ఆయుధంగా మీ దగ్గర ఉంచుకుంటే ధైర్యంగా.. కాన్ఫిడెంట్‌గా ఉంటారు. అల్లరి మూక మీ దరి చేరాలంటేనే భయపడుతుంది'' అంటూ వివరిస్తారు సౌమ్య సాంబశివన్ ఆ వీడియోలో. మాటల్లోనే కాదు చేతల్లో కూడా డైనమిక్ పోలీస్ ఆఫీసరే సౌమ్య. ఎవరికీ భయపడని తత్వం, వేగంగా నిర్ణయాలు తీసుకునే నైజం ఆమెను ప్రజలకు ఆత్మీయురాలుగా.. నేరస్తులకు సింహస్వప్నంగా మార్చాయి. ఆమె డ్రగ్స్ మాఫియా ఆటకట్టించి జైల్లో పెట్టించారు. సిర్మూర్ జిల్లాలో ఆరు మర్డర్ కేసులను పరిష్కరించి ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్‌కు సిఫారసు పొందారు.



'పెప్పర్ స్ప్రే' తయారీ గురించి వివరిస్తున్న సౌమ్య

మహిళ 2019

**అవార్డు గుర్తింపును తెస్తుంది.**
**అవార్డుకే గుర్తింపు తెచ్చారు ఈ మహిళలు.**
**దాదాపు ప్రతి రంగంలోనూ..**
**ఈ ఏడాది నారీ శక్తి ప్రతిఫలించింది.**
**పోరాట పటిమ ప్రస్ఫుటించింది.**
**వీళ్ల స్ఫూర్తి కదిలిస్తుంది. ముందు తరాలనూ నడిపిస్తుంది.**

# ప్రతిభా మూర్తులు పోరాట యోధులు

### 1. దీపికారెడ్డి, నృత్యకారిణి

ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి దీపికారెడ్డికి ప్రతిష్ఠాత్మకమైన సంగీత నాటక అకాడమీ అవార్డు లభించింది. రాష్ట్రపతి భవన్‌లో ఫిబ్రవరి 6న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి ఆమె ఈ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన దీపికారెడ్డి గత 47 సంవత్సరాలుగా కూచిపూడి నాట్య రంగంలో సేవలను అందిస్తున్నారు. 'దీపాంజలి' పేరుతో నృత్య పాఠశాలను కూడా ప్రారంభించారు.





### 2. ప్రియాంక దూబే, పాత్రికేయురాలు

**బీ**బీసీ ఢిల్లీ బ్యూరో ద్విభాషా వ్యాఖ్యాత, ప్రముఖ పాత్రికేయురాలు ప్రియాంక దూబే ప్రతిష్ఠాత్మక చమేలీదేవి జైన్ అవార్డు–2018కు ఎంపికయ్యారు. పరిశోధనాత్మక జర్నలిజంలో ఉత్తమప్రతిభ కనబరిచినందుకుగాను ప్రియాంకకు ఈ అవార్డు దక్కింది.

### 3. రాధా దేవి, మున్నుస్వామి శాంతి

**టీ**టీడీ మహిళా క్షురకుల సంఘం అధ్యక్షురాలు కగ్గనపల్లి రాధాదేవి, ఇస్రో మహిళా శాస్త్రవేత్త మున్నుస్వామి శాంతిలకు 'నారీశక్తి పురస్కారం' లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 8న ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వీరికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. మహిళా సాధికారతకు, లింగ సమానత్వానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా వీరికి ఈ అవార్డు దక్కింది.





### 4. జోఖా అల్‌హార్థి, రచయిత్రి

ఒమన్ రచయిత్రి జోఖా అల్‌హార్థి (40) మాన్ బుకర్ ప్రైజ్–2019 గెలుపొందారు. ఆమె రాసిన 'సెలస్టియల్ బాడీ' నవలకు ఈ ప్రైజ్ దక్కింది. ఈ అవార్డును గెలుచుకున్న తొలి అరబ్ మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. బ్రిటన్ నుంచి 1951లో స్వాతంత్ర్యం పొందాక ఒమన్‌లో చోటుచేసుకున్న మార్పులను, బానిసత్వ పరిస్థితులను ఈ నవలలో అల్‌హార్థి వర్ణించారు.



### 5. గ్రెటా థన్‌బర్గ్, ఉద్యమకారిణి

**స్వీ**డన్‌కు చెందిన టీనేజ్ పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌కు అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రతిష్ఠాత్మక మానవ హక్కుల పురస్కారం 'అంబాసిడర్ ఆఫ్ కన్సైన్స్' లభించింది. అలాగే ఆమె 'రైట్ టు లైవ్‌లీహుడ్' అవార్డుకు ఎంపికైంది. నోబెల్ శాంతి బహుమతికి కూడా నామినేట్ అయింది.

### 6. పి.టి. ఉష, అథ్లెట్

భారత మాజీ అథ్లెట్, దిగ్గజ ఒలింపియన్ పి.టి. ఉష అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య (ఐఏఏఎఫ్) ప్రతిష్ఠాత్మక 'వెటరన్ పిన్' అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ అథ్లెటిక్స్‌లో సుదీర్ఘ కాలం పాటు చేసే సేవలకు గుర్తింపుగా ఐఏఏఎఫ్ వెటరన్ పిన్ అవార్డును అందజేస్తారు. పి.టి. ఉష పూర్తి పేరు పిలావుళ్లకండి తెక్కేపఱంబిల్ ఉష.

### 7. అస్కా సలోమీ, ప్రిన్సిపాల్

**ప్ర**భుత్వ వైద్యంలో నర్సింగ్ వృత్తిలో విశేష సేవలందించినందుకు అస్కా సలోమీకి 'జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్ అవార్డు–2019' లభించింది. అస్కా సలోమీ 2009లో గాంధీ నర్సింగ్ కళాశాల నుంచి ప్రధానాచార్యులుగా పదవీ విరమణ పొందారు.

### 8. పాయల్ జంగిడ్, సామాజిక కార్యకర్త

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేసిన పాయల్ జంగిడ్‌కి బిల్ అండ్ మెలిందా గేట్స్ ఫౌండేషన్ ఇచ్చే 'ఛేంజ్‌మేకర్–2019' అవార్డు లభించింది. రాజస్థాన్‌లోని హిన్‌స్లా గ్రామానికి చెందిన 17 ఏళ్ల పాయల్.. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు, ఆడపిల్లలు చదువుకునేందుకు కృషి చేస్తోంది.









### 9. ఓల్గా, పర్యావరణవేత్త


సాహితీ రంగంలో విశేషంగా చేసిన ప్రముఖ పర్యావరణ వేత్త, స్త్రీవాది, మేధావి, నవలా రచయిత్రి ఓల్గా టోర్కార్క్‌జుక్‌కు (పోలెండ్) నోబెల్ బహుమతి లభించింది. ఆమె రాసిన 'ద బుక్స్ ఆఫ్ జాకోబ్' అనే నవలకు గానూ 2018 సంవత్సరానికి ఈ బహుమతి లభించింది. (గత ఏడాది అవార్డును ఈ ఏడాది ప్రకటించారు)

## తిరుప్పావై 12వ పాశురం

**కనైత్తు -ఇళం కత్తెరుమై కన్రుక్కిరంగి**
**నినైత్తు ములై వరియే నిన్రు పాల్**
**ననైత్త -ఇల్లం శేరాక్కుమ్ నచ్చెల్వన్ తంగాయ్**
**పనిత్తలై వీళనిన్ వాశల్ కడై పత్తి**
**శినత్తినాల్ తెన్ ఇలంగై క్కోమానై చ్చెత్త**
**మనత్తుక్కినియానై ప్పాడవుం నీ వాయ్ తిఱవాయ్**
**ఇనిత్తాన్ ఎరుందిరాయ్ ఈదెన్న పేర్ ఉరక్కమ్**
**అనైత్తు ఇల్లత్తారుమ్ ఏల్ ఓర్ ఎమ్బావాయ్**

**గో**కులంలో గోపాలకులు, గోవుల గురించిన పాశురమిది. సంపన్నుడైన గోపాలకుడి చెల్లెలా! పొంగిపొర్లే పాడిపంటలున్న ఇల్లు కలదానా. ఆకలితో గుంజలకు కట్టి ఉన్న దూడలను తలుచుకోగానే నీ ఇంట గేదెలు కరుణతో, బంధనాలను తెంపుకుని తమ వద్దకు రాజాలవన్న జాలితో, వాత్సల్యభావంతో పొదుగులు చేపగా పశుశాలలు వాటి పాలతో తడిసిన మట్టితో రొచ్చు రొచ్చు అవుతాయి. తెల్లవారుఝాము మంచుతో మా తలలు తడుస్తూన్నా, కాళ్ళు చిత్తడిలో జారుతున్నా పట్టించుకోకుండా నిన్ను మేల్కొల్పాలని నీ ముంగిటకు వచ్చి, ఆధారం కోసం తలుపు కొయ్యను పట్టుకుని నిలబడి ఉన్నాము. రామచంద్రభగవానుడు కోపోద్రిక్తుడై లంకాసురుని వధించిన కథను ఎలుగెత్తి గానం చేస్తున్నా, నీవు కదలక మెదలక మౌనంగా ఊరుకుంటున్నావు. ఇరుగు పొరుగులందరూ మేల్కొంటున్నా నీవు మాత్రం నిద్రిస్తున్నావు. ఇప్పటికైనా దయచేసి లేచి రావమ్మా!

'జగన్మాత మహాలక్ష్మి తన బిడ్డలైన చేతనుల బాధలను, ఇక్కట్లను చూడలేక జాలిపడుతుంది. దయాస్రవంతిలో తలమునకలై, జ్ఞానామృతాన్ని క్షీరధారలుగా ఆ తల్లి తన బిడ్డలకు అందిస్తుంది. అందుకున్న జ్ఞానసంపత్తుతో చేతనులు తడిసి ముద్దవుతారు. అట్టి విశేషమైన జ్ఞానసంపత్తు కలవాడి చెల్లెలా! ఓ సుందరాంగీ, దేహాత్మ భ్రమలను పటాపంచలు చేసే శ్రీచరణాలను శరణు వేడు. సంచిత ప్రారబ్ధకర్మలన్నీ సమూలంగా నశించిపోగలవు. సంసార కాళరాత్రిలో చిక్కుకుపోయి నది నీవొక్కదానివే. లేచి వెలుగులోకి రా!'



బొమ్మ: శేఖర్ వెంకటరాఘవన్

**– శ్రీదేవి మురళీధర్**

epaper.sakshi.com

# నవిష్క..వేడుక


● నవిష్కతో చిరంజీవి


● కల్యాణ్ దేవ్, నవిష్క, శ్రీజ, రామ్‌చరణ్, ఉపాసన


● నవిష్క


**చి**రంజీవి కుటుంబంలో డిసెంబర్ 25న రెండు పండగలు జరిగాయి. ఒకటి క్రిస్మస్ సెలబ్రేషన్ కాగా మరొటి చిరంజీవి మనవరాలు నవిష్క పుట్టినరోజు వేడుక. చిరంజీవి చిన్న కుమార్తె శ్రీజ, కల్యాణ్ దేవ్‌ల కూతురు నవిష్క. ఈ చిన్నారికి మొదటి పుట్టినరోజు ఇది. ఈ బర్త్‌డేని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసింది చిరంజీవి ఫ్యామిలీ. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు ఉపాసన. ''హ్యాపీ బర్త్‌డే డార్లింగ్ నవిష్క. మీ అత్తా మామ (ఉపాసన, రామ్‌చరణ్)కు నువ్వంటే చాలా ప్రేమ'' అని ఈ ఫొటోలను షేర్ చేశారు.

# డుమ్ డుమ్ డుమ్


● నయనతార, రజనీకాంత్

**'డు**మ్ డుమ్ డుమ్ గట్టి మేళం మోగేట్టు...' అంటూ సాగే పెళ్లి పాటను 'దర్బార్' చిత్ర బృందం గురువారం విడుదల చేసింది. రజనీకాంత్, నయనతార జంటగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దర్బార్'. లైకా ప్రొడక్షన్స్ నిర్మించింది. ఈ సినిమాలోని రెండో పాట (డుమ్ డుమ్..)ను గురువారం రిలీజ్ చేశారు. కృష్ణకాంత్ రచించిన ఈ పాటను నకాష్ అజీజ్ పాడారు. అనిరుధ్ సంగీత దర్శకుడు. గేయరచయిత కృష్ణకాంత్ మాట్లాడుతూ – ''రజనీకాంత్‌గారికి పాట రాసే అవకాశం ఇంత త్వరగా వస్తుందనుకోలేదు. ఇదంతా ఓ కలలా ఉంది. సినిమాలో ఓ యువ జంటకు పెళ్లయ్యే సందర్భంలో వచ్చే పెళ్లి పాట ఇది. భార్యాభర్తల అన్యోన్యతకు సంబంధించి చిన్న ఫిలాసఫీ ఉన్న పాట. ఈ అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అని పేర్కొన్నారు. జనవరి 9న విడుదల కానున్న ఈ సినిమాకు కెమెరా: సంతోష్ శివన్.

# అమ్మ ఇంకా బతికే ఉంది!


● తనికెళ్ల భరణి

**'మి**థునం' సినిమాతో దర్శకుడిగా మారారు రచయిత, నటుడు తనికెళ్ల భరణి. వృద్ధదంపతుల అన్యోన్యతను, పిల్లలకు దూరంగా ఉంటున్న బాధను అద్భుతంగా తెరకెక్కించారు భరణి. 'మిథునం'లో యస్పీ బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మీ జంటగా నటించారు. ఇప్పుడు దర్శకుడిగా రెండో సినిమా పట్టాలెక్కించే పనిలో ఉన్నారట తనికెళ్ల భరణి. 'అమ్మ ఇంకా బతికే ఉంది' అనే టైటిల్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారని సమాచారం. ఇందులో షావుకారు జానకి ముఖ్య పాత్రలో కనిపించనున్నారట. త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది.

# సినిమా బాగుందని రాజమౌళిగారు అభినందించారు

''**మ**త్తు వదలరా' కథకు పాటలు, ఫైట్స్ అవసరం లేదనిపించింది. పాటలనేవి కథను ముందుకు నడిపిస్తేనే ఉండాలని నా ఫీలింగ్.. ఈ సినిమాలో ఆ అవకాశం లేదు. అందుకే పాటలు పెట్టలేదు. ఈ కథకు ప్రేమ సన్నివేశాలు కూడా


● రితేష్ రానా


అవసరం లేదనిపించింది.. అందుకే లవ్ స్టోరీని కూడా టచ్ చేయలేదు'' అని రితేష్ రానా అన్నారు. ప్రముఖ సంగీతదర్శకుడు కీరవాణి తనయుడు శ్రీసింహా హీరోగా, ఇంకో కుమారుడు కాలభైరవ సంగీతదర్శకుడిగా పరిచయమైన చిత్రం 'మత్తు వదలరా'.'వెన్నెల' కిశోర్, సత్య, అగస్త్య, బ్రహ్మాజీ ముఖ్య పాత్రల్లో మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మించిన ఈ సినిమా బుధవారం విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు రితేష్ రానా మాట్లాడుతూ– ''నాది హైదరాబాద్. కాలేజీ డేస్ నుంచే డైరెక్షన్‌పై ఆసక్తి ఉంది. మా టీమ్‌తో కలిసి పదేళ్ల నుంచి నేను షార్ట్ ఫిల్మ్స్ చేస్తున్నాను. ఓ కామన్ ఫ్రెండ్ ద్వారా చెర్రీగారిని కలిసే అవకాశం వచ్చింది. కథ ఆయనకు నచ్చడంతో మా జర్నీ మొదలైంది. శ్రీసింహా తన బ్యాగ్రౌండ్‌ని దృష్టిలో పెట్టుకోకుండా కష్టపడి సినిమా చేశాడు. కాలభైరవ మంచి నేపథ్య సంగీతం ఇచ్చాడు. కీరవాణిగారి కుటుంబ సభ్యులెవరూ ఈ సినిమా విషయంలో జోక్యం చేసుకోలేదు. మా సినిమాని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. రివ్యూస్ కూడా పాజిటివ్‌గానే వచ్చాయి. మరికొన్ని థియేటర్స్ పెరగాల్సి ఉంది. దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకొని రాసుకున్న కథను బాగా తీయాలనే ఆలోచనతోనే కష్టపడ్డా. అయినా సినిమా బాగుంటే ప్రేక్షకులే చూస్తారు. నేను చిరంజీవిగారికి పెద్ద ఫ్యాన్. అందుకే ఆయన పాత సినిమాలను గుర్తు చేస్తూ స్క్రీన్‌ప్లే రాసుకున్నాను.. మంచి స్పందన వస్తోంది. డైరెక్టర్ రాజమౌళిగారు మా సినిమాని మూడుసార్లు చూశారు. మంచి సినిమా చేశారని అభినందించారు. ప్రస్తుతం నా దగ్గర రెండు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి'' అన్నారు.

# పలాస కథ


● నక్షత్ర, రక్షిత్

**మం**చి కథ, కథనాలున్న సినిమాలను ప్రోత్సహించి, విడుదల చేయడానికి పెద్ద ప్రొడక్షన్ కంపెనీలు ముందుకొస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ వరుసలో 'పలాస 1978' చిత్రాన్ని విడుదల చేసేందుకు గీతా ఆర్ట్స్, యూవీ క్రియేషన్స్ సంస్థలు ముందుకొచ్చాయి. పలాసలో జరిగిన వాస్తవ సంఘటనలు, కొన్ని నిజ జీవిత పాత్రల ఆధారంగా కల్పిత కథతో రూపొందిన చిత్రం 'పలాస 1978'. రక్షిత్, నక్షత్ర జంటగా కరుణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా జనవరి చివరి వారంలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. మంచి కథ, కథనాలున్న ఈ సినిమా నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాసు, వంశీలకు బాగా నచ్చడంతో గీతా ఆర్ట్స్, యూవీ ప్రొడక్షన్స్ పతాకాలపై విడుదల చేయనున్నారు. ''మంచి సినిమాలను అందరికీ చేరువయ్యేలా చూడాలని అల్లు అరవింద్‌గారు భావించడంతో 'పలాస 1978' ఈ చిత్రాన్ని జీఏటు యూవీ సంస్థ ద్వారా రిలీజ్ చేస్తున్నాం'' అని బన్నీ వాసు తెలిపారు. రఘు కుంచె, తిరువీర్, జనార్ధన్, లక్ష్మణ్, శృతి, జగదీష్ ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: విన్సెంట్ అరుల్, సంగీతం: రఘు కుంచె.

# ఉమామహేశుడి ఉగ్రరూపం


● సత్యదేవ్

**'బా**హుబలి' వంటి భారీ చిత్రాన్ని నిర్మించిన శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని తమ తదుపరి చిత్రాన్ని ప్రకటించారు. 'కేరాఫ్ కంచరపాలెం' దర్శకుడు వెంకటేశ్ మహా, నిర్మాత ప్రవీణా పరుచూరితో కలసి 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సత్యదేవ్ ముఖ్య పాత్రలో నటించిన ఈ సినిమా మలయాళ 'మహేశింటె ప్రతీకారమ్' చిత్రానికి రీమేక్. అరకు వ్యాలీలో జరిపిన 36 రోజుల షెడ్యూల్‌తో ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేశారు. ''ఉమా మహేశ్ చాలా సౌమ్యుడు. ఓ సందర్భంలో అతను ఉగ్రరూపం దాల్చాల్సి వస్తుంది. ఆ తర్వాత జరిగిన పరిణామాలేంటనేది కథ. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. 2020 ఏప్రిల్ 17న చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు నిర్మాతలు.

# మాధురీ దీక్షిత్ కూడా చేశారుగా!


● అంకిత మహారాన

''**చు**ట్టూ ముప్పై, నలభై మంది ఉన్నప్పుడు రొమాంటిక్ సన్నివేశాలలో నటించడం అంత సులభం కాదు. కానీ, నటిగా ఎదగాలనుకున్నప్పుడు చేయక తప్పదు. అందుకు రెడీగా ఉండాలి. ఒకప్పుడు మాధురీ దీక్షిత్.. ప్రస్తుతం కంగనా రనౌత్ లాంటి వాళ్లు కూడా రొమాంటిక్ సన్నివేశాలు చేశారు'' అని అంకిత మహారాన అన్నారు. నిశాన్, అంకిత మహారాన జంటగా నటించిన చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. నటుడు సత్య ప్రకాష్ దర్శకత్వం వహించారు. సుఖీభవ మూవీస్ పతాకంపై ఏ. గురురాజ్ నిర్మించిన ఈ సినిమా జనవరి 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా అంకిత మహారాన మాట్లాడుతూ– ''నేను పుట్టింది బెల్గామ్‌లో. ఢిల్లీ, బెల్గామ్, బెంగళూరులలో చదువుకున్నాను. ఒరియా కుటుంబానికి చెందిన అమ్మాయిని. మా నాన్న ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కావడంతో దేశంలో అనేక చోట్లకు వెళ్లా. తెలుగులో నా తొలి చిత్రం '4 లెటర్స్'.. 'ఊల్లాల ఊల్లాల' రెండోది. రొమాంటిక్ హారర్ మూవీ ఇది. నా పాత్ర కొంచెం అనుమానాస్పదంగా, అబ్బాయిలను భయపెట్టేదిగా ఉంటుంది. తెలుగు ఇండస్ట్రీ జాతీయ పరిశ్రమలా ఉంది. ఇక్కడ హీరోయిన్‌కి మంచి గౌరవం ఇస్తారు. సత్య ప్రకాష్‌గారు సెట్స్‌లో అనేక విషయాలు చెప్పేవారు. గురురాజ్‌గారు కూడా నా పట్ల చాలా కేరింగ్‌గా ఉండేవారు. రామ్‌గోపాల్ వర్మ సార్ రెండు చిత్రాల్లో అవకాశం ఇచ్చారు. 'నాకు శ్రీదేవిగారి నటన ఎంత ఇష్టమో, అంకిత నటన కూడా అంతే ఇష్టం' అని ఆయన చెప్పడం మరచిపోలేను'' అన్నారు.

# వెండితెర నటుడిగానూ ఆదరించండి

– 'సుడిగాలి' సుధీర్


● రాజశేఖర్ రెడ్డి, 'సుడిగాలి' సుధీర్, శేఖర్ రాజు

**'జ**బర్దస్త్, ఢీ, పోవే పోరా' వంటి టీవీ షోస్ ద్వారా పాపులర్ అయిన 'సుడిగాలి' సుధీర్ హీరోగా నటించిన తొలి చిత్రం 'సాఫ్ట్‌వేర్ సుధీర్'. ఈ చిత్రంలో ధన్యా బాలకృష్ణ హీరోయిన్‌గా నటించారు. రాజశేఖర్‌రెడ్డి పులిచర్ల దర్శకత్వంలో కె. శేఖర్‌రాజు నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. నిర్మాత రాజ్ కందుకూరి, యాంకర్ సుమ అతిథులుగా ఈ సినిమా ప్రీ–రిలీజ్ వేడుక జరిగింది. ''సుధీర్ బాడీ లాంగ్వేజ్, టైమింగ్ బాగుంటుంది. ఈ ట్రైలర్ నాకు నచ్చింది. సినిమా హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను'' అన్నారు రాజ్ కందుకూరి. ''ఈ చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు సుమ. ''కామెడీతో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న సినిమా ఇది. ఇప్పటి వరకు నన్ను బుల్లితెరపై ఎలా సపోర్ట్ చేశారో, అలాగే వెండితెరపై కూడా సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు సుధీర్. ''ఈ సినిమాలో కథ కన్నా కొన్ని జీవితాలు కనిపిస్తాయి. కామెడీ టైమింగ్‌తో పాటు నటనకు ఆస్కారం ఉన్న పాత్ర కావడంతో సుధీర్‌ని హీరోగా ఎంపిక చేశాం. కథ నచ్చి ప్రజాగాయకుడు గద్దర్ ఇందులో ఓ పాట పాడి నటించారు'' అన్నారు రాజశేఖర్. ''మా బ్యానర్ ద్వారా సుధీర్‌ని హీరోగా పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది'' అన్నారు శేఖర్. లిరిసిస్ట్ సురేష్ గంగుల, మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్, సినిమాటోగ్రాఫర్ రాంప్రసాద్, ఫైట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్ పాల్గొన్నారు.

# డబుల్ ఎంట్రీ


● ప్రణీత

**ఈ** మధ్యే తొలి బాలీవుడ్ సినిమా చేయడానికి అంగీకరించారు ప్రణీతా సుభాష్. అజయ్ దేవగణ్, సంజయ్ దత్, రానా ముఖ్య పాత్రల్లో నటిస్తున్న 'భూజ్: ది ప్రైడ్ ఆఫ్ ఇండియా' ద్వారా హిందీ తెరకు పరిచయం కానున్నారామె. ఈ సినిమా పూర్తికాకముందే మరో హిందీ సినిమా అంగీకరించారు ప్రణీత. మలయాళ దర్శకుడు ప్రియదర్శన్ ఏడేళ్ల గ్యాప్ తర్వాత చేస్తున్న హిందీ చిత్రం 'హంగామా 2'లో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు ఈ బ్యూటీ. ఈ చిత్రం గురించి ప్రణీత మాట్లాడుతూ – ''నేను ఇప్పటివరకూ పూర్తి స్థాయి కామెడీ చిత్రం చేయలేదు. ఎక్కువ శాతం పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో లేదా హీరోని బాగా ప్రేమించే అమ్మాయిలానే కనిపించాను. వాటికి భిన్నంగా ఉంటే 'హంగామా 2' నాకో కొత్త అనుభవంలా ఉండబోతోంది'' అన్నారు. విశేషం ఏంటంటే ఈ రెండు చిత్రాలు ఒకే రోజున (వచ్చే ఏడాది ఆగస్ట్ 14 రిలీజ్ కాబోతున్నాయి. ఆ విధంగా హిందీ స్క్రీన్‌పై ఒకేసారి డబుల్ ఎంట్రీ ఇవ్వబోతున్నారు ప్రణీత.

# లంకెబిందెల కోసం...


● శ్రీరామ్ నిమ్మల

**శ్రీ**రామ్ నిమ్మల, కారుణ్య కత్రేన్ జంటగా తిరుపతి యస్.ఆర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉత్తర'. శ్రీపతి గంగదాస్, తిరుపతి యస్.ఆర్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీరామ్ నిమ్మల మాట్లాడుతూ – ''నాకు ఎలాంటి సినీ నేపథ్యం లేదు. నటనపై ఆసక్తితో హీరో కావాలని ప్రయత్నిస్తున్న నాకు 'ఉత్తర' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. ఇందులో నా క్యారెక్టర్ చాలా సహజంగా ఉంటుంది. తన కూతురు ఒకరిని ప్రేమిస్తుందని తెలుసుకున్న ఓ తండ్రి కోపం తెచ్చుకోకుండా, తన కూతురి ప్రేమలోని తప్పు ఒప్పులను ఎలా చెప్పాడు? ఖాళీగా ఉన్న తన ప్రేమికుడిని ఓ అమ్మాయి ఎలా మార్చింది? అనే అంశాలు ఈ సినిమాలో ఆసక్తిగా ఉంటాయి. సులభంగా ధనవంతులు కావడానికి యువత లంకెబిందెల కోసం చేసే ప్రయత్నాలు థ్రిల్లింగ్‌గా ఉంటాయి. నాతో పోల్చుకున్నప్పుడు హీరోయిన్ కారుణ్యకు నటనాపరంగా అనుభవం ఉంది. ఆమెతో డ్యాన్స్ విషయంలో టెన్షన్ ఫీలయ్యాను కానీ యాక్టింగ్‌ని చాలా ఎంజాయ్ చేశాను. సినిమాని దర్శకుడు చాలా సహజంగా ఈ సినిమాను తెరకెక్కించాడు'' అన్నారు.












# డబుల్ గ్లామర్

**రెండు భిన్నమైన రంగుల లెహంగా ఒకటి.. ఒకే రంగులో రెండు పొరల లెహంగా మరొకటి. ఒకేరకం ఫ్యాబ్రిక్ లెహంగా ఒకటి.. రాసిల్క్- నెటెడ్ రెండు రకాల మెటీరియల్‌తో డిజైన్ చేసిన లెహంగా మరొకటి. ఇలా దేనికది భిన్నంగా, మది దోచేలా ఆకట్టుకుంటున్నాయి ఈ టు లేయర్డ్ లెహంగాలు. ట్విన్ లేయర్డ్ లెహంగాలుగానూ పేరున్న ఇవి వేడుకల్లో హైలైట్‌గా నిలుస్తున్నాయి. క్యాజువల్‌గానూ కలర్‌ఫుల్ అనిపిస్తున్నాయి. డబుల్ గ్లామర్ అని ప్రశంసలు అందుకుంటున్నాయి.**

- ఇండియన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఈ యేడాది వెడ్డింగ్ సీజన్‌లో భాగంగా డబుల్ లేయర్డ్ లెహంగాలను డిజైన్ పలువురి ప్రముఖుల ప్రశంసలు పొందారు. 'వివాహ వేడుకల్లో గ్రాండ్‌గా వెలిగిపోవడానికి గ్రాండ్ ఎంబ్రాయిడరీతో పాటు ట్విన్ లేయర్డ్ కూడా ప్రధాన కారణం' అంటారు మనీష్ మల్హోత్రా.

ఫ్యాషన్

కుచ్చుల లెహంగా గురించి మనకు తెలిసిందే. లెహంగా ఎన్ని కుచ్చులతో ఉంటే అంచు భాగం అంత ఫ్లెయర్‌తో ఆకట్టుకుంటుంది.

- ఉత్తర భారతదేశంలో దాండియా వేడుకల్లో భాగంగా పుట్టుకొచ్చిందే ఈ రెండు పొరల లెహంగా. దీనికి డిజైనర్ టచ్ ఇచ్చి సౌతిండియా సైతం సరికొత్తగా ముస్తాబు చేసింది. వేడుకల్లో ప్రత్యేకంగా నిలిపింది.
- ఒక లెహంగా పార్ట్‌ని తక్కువ కొలత తీసుకొని, దాని అంచు వద్ద మరొక పొరగా కుచ్చుల భాగాన్ని జత చేస్తే ఈ అందమైన లెహంగా డిజైన్ వచ్చేస్తుంది.
- పై భాగం ప్లెయిన్ పట్టు మెటీరియల్ తీసుకుంటే, కుచ్చుల భాగం నెటెడ్‌తో జత చేస్తే ఇలా కొత్తగా కనువిందుచేస్తుంది.
- ఈ లెహంగాకి వెస్ట్రన్ స్టైల్ క్రాప్‌టాప్ ధరిస్తే ఇండో-వెస్ట్రన్ లుక్‌లో ఆకట్టుకుంటారు.
- లాంగ్ జాకెట్ ధరిస్తే ఒకలా, ఎంబ్రాయిడరీ ఛోలీ ధరిస్తే మరోలా భిన్నమైన లుక్‌లో కనిపిస్తారు.
- కాటన్, సిల్క్, నెటెడ్.. ఇలా ఏ ఫ్యాబ్రిక్‌తోనైనా ఈ డబుల్ లేయర్డ్ లెహంగాలను డిజైన్ చేసుకోవచ్చు.

నిర్వహణ: **నిర్మలారెడ్డి**



ఆభరణం

# పట్టుకు సింగారం

ఏ చిన్న వేడుకకైనా మగువలు పట్టుచీర ధరించడం వైపే మొగ్గుచూపుతారు. దాని మీదకు సంప్రదాయ బంగారు ఆభరణాలను ఎంపిక చేసుకుంటారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. పట్టుచీర మీదకు ధరించడానికి రకరకాల ఫ్యాషన్ జువెల్రీ అందుబాటులోకి వచ్చింది. ఇండోవెస్ట్రన్, వెస్ట్రన్ డ్రెస్సులకు నప్పే ఈ ఆభరణాలు చీరకట్టు మీదకు ఇప్పుడు ఒద్దికగా ఒదిగిపోతున్నాయి.


- సంప్రదాయ చీరకట్టు అయినా ఈ రోజులకు తగినట్టుగా ట్రెండీగా కనపడాలనేది యువతుల ఆలోచన. వీటిలో ఫ్యాషన్ జువెల్రీలో భాగమైన సిల్వర్, కుందన్, పూసలు, రత్నాలతో చేసిన వెస్ట్రన్ డిజైన్‌వేర్ బాగా నప్పుతుంది. వీటిలో పొడవాటి హారాలు, మెడను చుట్టేసే చోకర్స్ ఉంటున్నాయి.
- ఫ్యాషన్ జువెల్రీలో చెప్పుకోదగినది థ్రెడ్ జువెల్రీ. ఇది రకరకాల డిజైన్లలో రంగులలో పట్టుచీరల మీద కొత్తగా మెరుస్తోంది. ఈ ఆభరణాల్లో చీర అంచులు, ప్రింట్ల రంగులను తీసుకొని డిజైన్లు సృష్టిస్తున్నారు. ప్లెయిన్ పట్టుచీర అయితే, దాని మీదకు కాంట్రాస్ట్ లేదా మ్యాచింగ్ కలర్ థ్రెడ్ జువెల్రీ ధరిస్తే అద్భుతంగా ఉంటుంది.
- థ్రెడ్ జువెల్రీతో పాటు చెప్పుకోదగినది టెర్రకోట ఆభరణాలు. ఈ డిజైన్స్ సంప్రదాయపు సొబగులు అద్దడంలో సరైన పాత్ర పోషిస్తున్నాయి.
- సంప్రదాయ పట్టుకు ఈ తరహా ఆభరణాలే ధరించాలనే నియమాలేవీ లేవు. ఫ్యాషన్ జువెల్రీతో లుక్‌లో కొత్త మార్పులు తీసుకోవచ్చు.






హోమియో కౌన్సెలింగ్స్

# మెడనొప్పికి చికిత్స ఉందా?



ఫ్యామిలీ డాక్టర్

**నా వయసు 56 ఏళ్లు. గత కొంతకాలంగా నేను తీవ్రమైన మెడనొప్పితో బాధపడుతున్నాను. ఆ నొప్పి చేతుల వరకూ పాకుతోంది. చేతులు బలహీనంగా అనిపిస్తున్నాయి. కొద్దిగా వణుకుతున్నాయి కూడా. డాక్టర్‌ను సంప్రదిస్తే మెడభాగంలోని ఎముకలు అరుగుదలకు గురయ్యాయని చెప్పారు. హోమియో చికిత్స ద్వారా నా సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందా?**

**– ఎమ్. సుధాకర్‌రావు, ఆదిలాబాద్**

మెడ భాగంలోని వెన్నెముక డిస్కులు, ఫేసెట్ జాయింట్స్‌లోని మృదులాస్థి క్షీణతకు గురికావడాన్ని సర్వైకల్ స్పాండిలోసిస్ అంటారు. గతంలో పెద్దవారిలో కనిపించినా, జీవనశైలిలో మార్పులు రావడం వల్ల ఇప్పుడిది చిన్న వయసు వారిలోనూ ఎక్కువగా కనిపిస్తుంది.

**కారణాలు:** ● వయసు పెరగడం, వ్యాయామం లేకపోవడం ● క్షీణతకు గురైన ఎముకలు అదనంగా పెరగడం ● డిస్కులు జారిపోవడం లేదా చీలికలకు గురికావడం ● వృత్తిరీత్యా అధికబరువులు మోయడం ● ఎక్కువ సమయం పాటు మెడను అసాధారణ భంగిమలో ఉంచడం ● ఎక్కువసేపు కంప్యూటర్‌పై పని చేయడం, ఎక్కు సమయం మెడను వంచి ఫోన్‌లలో మాట్లాడటం ● ఎత్తైన దిండ్లు వాడటం ● మెడకు దెబ్బతగలడం ● మెడకు శస్త్ర చికిత్స జరిగి ఉండటం ● తీవ్రమైన మానసిక ఒత్తిడి, అధిక బరువు, పొగతాగే అలవాటు, జన్యుపరమైన కారణాలతో ఈ సమస్య వచ్చే అవకాశం ఉంది.

**లక్షణాలు :** ● సాధారణం నుంచి తీవ్రస్థాయి మెడనొప్పి ● నొప్పి మెడ నుంచి భుజాలకు, చేతులకు, వేళ్లకు పాకడం ● మెడ బిగుసుకుపోవడం ● తలనొప్పి, తల వెనక భాగంలో మొదలై నుదురు వరకు వ్యాపించడం ● నరాలపై ఒత్తిడి పడి, చేతులలో సూదులు గుచ్చినట్లుగా అనిపించడం, చేతులు మొద్దుబారడం, సత్తువ కోల్పోవడం ● చిన్న బరువునూ ఎత్తలేకపోవడం ● నడకలో నిలకడ కోల్పోవడం వంటి లక్షణాలు గమనించవచ్చు.

**హోమియో చికిత్స:** జెనెటిక్ కాన్స్‌టిట్యూషన్ చికిత్స విధానం ద్వారా రోగి మానసిక, శరీరక లక్షణాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందించడం వల్ల మెడనొప్పిని పూర్తిగా నయం చేయవచ్చు. వెన్నెముకను దృఢంగా చేయడం ద్వారా సర్వైకల్ స్పాండిలోసిస్ సమస్యను సంపూర్ణంగా నయం చేయవచ్చు.



**డా॥ శ్రీకాంత్ మొర్లావర్,**
**సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్, హైదరాబాద్**

# సైనసైటిస్ తగ్గుతుందా?



**నా వయసు 28 ఏళ్లు. ఇటీవల నాకు రోజూ ఉదయంపూట తలనొప్పి వస్తోంది. రోజూ ముక్కుదిబ్బడ వేసి చాలా అసౌకర్యంగా ఉంటోంది. ముక్కు నుంచి నీరు కూడా అదేపనిగా కారుతూ చాలా ఇబ్బంది కలిగిస్తోంది. డాక్టర్‌ను సంప్రదిస్తే సైనసైటిస్ అన్నారు. ఇంగ్లిషు మందులు వాడినా తగ్గలేదు. నా సమస్యకు హోమియోలో పరిష్కారం ఉందా?**

**– ఆర్. కరీముల్లా, గుంటూరు**

వాతావరణ మార్పులు జరిగినప్పుడల్లా సైనసైటిస్ సమస్య మొదలవుతుంది. మళ్లీ మళ్లీ వస్తూ దీర్ఘకాలం పాటు వేధించే ఈ సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడేవారు మన సమాజంలో చాలామందే ఉంటారు. ఈ సమస్యను మూడు విభాగాలుగా చూడవచ్చు. ఒకటి ఎక్యూట్. ఇది వస్తే వారం రోజులుంటుంది. రెండోది సబ్‌ఎక్యూట్. ఇది నాలుగు నుంచి ఎనిమిది వారాలుంటుంది. మూడోది క్రానిక్. అంటే దీర్ఘకాలంపాటు బాధించేది అని అర్థం.

**కారణాలు :** బ్యాక్టీరియా, వైరల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశవ్యాధులు, ముక్కులో ఎముక పెరగడం, అలర్జీ, పొగ, వాతావరణంలో ఉండే విపరీతమైన కాలుష్యం, అకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, ఈత (స్విమ్మింగ్ చేయడం), జలుబు, గొంతునొప్పి, పిప్పిపన్ను, టాన్సిల్స్ వాపు, రోగనిరోధక శక్తి తగ్గడం వంటివి సైనసైటిస్‌కు కారణమవుతాయి.

**వ్యాధి లక్షణాలు:** సైనసైటిస్‌తో బాధపడేవారిలో తలనొప్పి, తలంతా బరువుగా ఉండటం, ముఖంలో వాపు, ముఖంలోని సైనస్‌లు ఉండే భాగాల్లో నొప్పి, ముక్కు దిబ్బడ వేస్తూ ఉండటం, ముక్కులో దురద పెడుతూ ఉండటం, ముక్కు నుంచి నీరు కారడం, గొంతులోకి ద్రవాలు స్రవిస్తూ ఉండటం, దగ్గు, జలుబు, చెవిలో చీము వంటి లక్షణాలు కనిపిస్తాయి. తరచూ జలుబు చేస్తూ ఉండటం, దాంతో చాలా ఎక్కువ రోజులు బాధపడటం అనేది సైనస్ వ్యాధి ప్రాథమిక లక్షణం. ఆ తర్వాత దశలో జలుబు చేసినప్పుడు ముక్కులు బిగదీసుకుపోతాయి. తీవ్రమైన తలనొప్పి, దగ్గు, శ్వాస దుర్గంధంతో కూడి ఉండటం కూడా జరుగుతుంది.

**చికిత్స:** హోమియో చికిత్సలో శస్త్రచికిత్స అవసరం లేకుండానే సైనసైటిస్‌ను సమూలంగా తగ్గించవచ్చు. ఈ మందులతో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. ఇతర చికిత్స వల్ల తాత్కాలింగా ఉపశమనం కలుగుతుందే తప్ప శాశ్వత పరిష్కారం లభించదు. కానీ హోమియో చికిత్స వల్ల సైనసైటిస్ పూర్తిగా తగ్గిపోతుంది. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో వారు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడటం వల్ల మళ్లీ మళ్లీ రాకుండా సమర్థంగా చికిత్స చేయవచ్చు.



**డా॥ కె. రవికిరణ్,**
**మాస్టర్స్ హోమియోపతి, హైదరాబాద్**

పరిపరిశోధన

# కొవ్వులతోనూ మధుమేహం!



మధుమేహం ఎలా వస్తుంది? ఆ.. ఏముంది.. వేళాపాళ లేని ఆహార అలవాట్లు, వ్యాయామ లేమి, రక్తంలో చక్కెర మోతాదు పెరగడం. ఇవే కదా మనకు తెలిసిన కారణాలు. కానీ... చక్కెరతో నిమిత్తం లేకుండా కూడా క్లోమగ్రంథిలోని బీటా కణాలు ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తాయని, తద్వారా నిరోధకత ఏర్పడి రక్తంలో గ్లూకోజు మోతాదు తగ్గకుండా టైప్ -2 మధుమేహం వస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించడంతో ప్రశ్న మళ్లీ మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో కాలిఫోర్నియా యూనివర్శిటీ శాస్త్రవేత్తలు జరిపిన ఒక పరిశోధన టైప్ -2 మధుమేహం వచ్చేందుకూ కొన్ని రకాల కొవ్వు కణాలూ కారణమేనన్న అంచనాను బలపరిచింది. ఊబకాయంతో ఉన్న, మధుమహం అంచుల్లో ఉన్న కొన్ని ఎలుకలపై వీరు ప్రయోగం చేశారు. కొవ్వులు ఒక స్థాయి కంటే ఎక్కువైనప్పుడు సైక్లోఫిలిన్ డీ (సైఫ్‌డీ) బీటా కణాల్లోని మైటోకాండ్రియాలోకి ప్రొటాన్లను విడుదల చేస్తుందని... ఆ వెంటనే కణాలు ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతాయని ఈ ప్రయోగాల ద్వారా తెలిసింది. సైఫ్‌డీ ప్రొటీన్ లేని ఎలుకలను ఉపయోగించినప్పుడు ఇన్సులిన్ స్థిరంగా ఉన్నట్లు స్పష్టం కావడంతో మధుమేహానికి.. కొవ్వులకు మధ్య ఉన్న లింక్ స్పష్టమైంది. మనుషుల నుంచి సేకరించిన బీటా కణాలపై జరిపిన పరిశోధనలూ ఇదే రకమైన ఫలితాలిచ్చాయి. మరిన్ని పరిశోధనల చేయడం ద్వారా ఈ ఫలితాలను నిర్ధారించుకోవాల్సి ఉందని, తద్వారా మధుమేహానికి కొత్త కొత్త చికిత్స పద్ధతులు, మందులు అందుబాటులోకి వస్తాయని అంచనా.

వహీదా రెహమాన్

# వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ @ ఎయిటీ



వహీదా రెహమాన్

వృత్తికి విశ్రాంత సమయం ఉంటుందేమో.. కాని అభిరుచికి ఉండదు. ఉత్సాహం ఉంటే చాలు ఏ వయసులో అయినా ప్రవృత్తిని ప్రాక్టీస్‌లో పెట్టొచ్చు. సుప్రసిద్ధ సినీ నటి వహీదా రెహమాన్ అదే చేస్తున్నారు. ఎనభై ఒకటో యేట.. కెమెరా పట్టుకొని తనకు ఇష్టమైన వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీలో బిజీ అయిపోయారు. ఇండియాలోనే కాదు టాంజానియా, నమీబియా, కెన్యా అడవుల్లోకి వెళ్లి కంటికి నచ్చిన దృశ్యాలను ఫ్రేమ్ చేస్తున్నారు. ఈ మధ్య తను తీసిన ఫొటోలతో ఒక ఎగ్జిబిషన్ కూడా నిర్వహించారు. దేశంలోని కొంతమంది ప్రముఖులూ ఈ ప్రదర్శనకు హాజరై వహీదా స్ఫూర్తిని ప్రశంసించారు. ''చిన్నప్పటి నుంచీ నాకు ఫొటోగ్రఫీ అంటే ఇష్టం. వెంట చిన్న కెమెరాను ఉండేదెప్పుడూ. సినిమారంగంలోకి వచ్చాక కూడా సెట్స్ మీదకి కెమెరా తీసుకెళ్లేదాన్ని. మొన్నామధ్య హిమాంశు సేథ్ (ఆర్ట్ క్యురేటర్)ను కలిశాను ఒక ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌లో. నా హాబీ గురించి తెలిసి ''మీ హాబీని ఎందుకు పర్‌ష్యూ చేయట్లేదు. మంచి ఫొటోలతో రండి.. ఎగ్జిబిషన్ ఏర్పాటు చేద్దాం'' అంటూ సలహా ఇచ్చాడు... కాదు ఎంకరేజ్ చేశాడు (నవ్వుతూ). కెమెరా తీసుకొని అడవుల వెంట తిరిగాను.. కాని వాటితో ఎగ్జిబిషన్ పెట్టేంత గొప్ప ఫొటోలు కావని మిన్నకుండిపోయా. మా కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎగ్జిబిషన్ పెట్టాల్సిందే అంటూ చొరవ తీసుకొని ఇదిగో.. వాటిని ఇలా మీ ముందుకు తెచ్చారు. నిజానికి వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీకి చాలా ఓపిక ఉండాలి. అదృష్టం కూడా కలిసి రావాలంటాను. అభిరుచికి వయసుతో సంబంధం లేదు అని గట్టిగా నమ్ముతాను. చెప్పానుగా కావల్సిందల్లా ఓపిక.. అంతే! ఆ సహనం, ఓపికతోనే ఫొటోగ్రఫీ నేర్చుకోకుండానే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌ను అయిపోయాను'' అంటారు వహీదా రెహమాన్ నవ్వుతూ!



వహీదా రెహమాన్

సాక్షి
భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
శుక్రవారం
27-12-2019

# కొలువులిచ్చే.. కోర్సులివిగో..!

» ఇంజనీరింగ్ అభ్యర్థులకు నైపుణ్యాలు కీలకం
» ఇంటర్వ్యూలో తాజా టెక్నాలజీ, ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు ప్రాధాన్యం
» జాబ్ ఓరియెంటెడ్ కోర్సులతో మేలంటున్న నిపుణులు

**బీటెక్ పూర్తి కాగానే... కొలువులు అంత సులువేం కాదు అనే భావన!! ప్రస్తుతం బీటెక్ అభ్యర్థులకు జాబ్ మార్కెట్‌లో ఏమంత ఆశాజనక పరిస్థితి లేదనే అభిప్రాయం చాలా మందిలో నెలకొంది. ఇలాంటి సమయంలో జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు ఇంజనీరింగ్ విద్యార్థుల పాలిట వరమని చెప్పొచ్చు. వీటిని పూర్తి చేసుకున్న వారికి ప్రత్యేక నైపుణ్యాలు లభించడంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలో.. బీటెక్‌లో బ్రాంచ్‌ల వారీగా ముఖ్యమైన జాబ్ ఓరియెంటెడ్ కోర్సుల గురించి తెలుసుకుందాం...!**




## ఇంజనీరింగ్ స్పెషల్

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం, జాబ్ మార్కెట్‌లో నెలకొన్న పోటీ కారణంగా ప్రస్తుతం ఇంజనీరింగ్ పూర్తయిన వెంటనే చాలాతక్కువ మందికి మాత్రమే కొలువులు దక్కుతున్నాయి. మిగతా వారు ఉద్యోగ ప్రయత్నాల్లో.. సఫలం కావాలంటే.. నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాల్సిందే! ఇలాంటి పరిస్థితుల్లో ఇంజనీరింగ్ విద్యార్థులకు చుక్కానిలా నిలుస్తున్నాయి.. జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు. తక్కువ ఖర్చు, స్వల్ప వ్యవధిలో పూర్తి చేసే వెసులుబాటు ఉండటం వీటి ప్రత్యేకత. ఒక్క మాటలో చెప్పాలంటే.. జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు అభ్యర్థుల నుంచి కంపెనీలు, పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యాలతోపాటు వాస్తవ పరిజ్ఞానాన్ని అందిస్తున్నాయి. విద్యార్థుల అకడెమిక్ నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతూ ప్రాక్టికల్ నైపుణ్యాలకు పెద్దపీట వేస్తున్నాయి.

### కంప్యూటర్ సైన్స్

- కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెషలైజేషన్లతో బీటెక్ పూర్తి చేసిన వారికి పలు జాబ్ ఓరియెంటెడ్ సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- **వెబ్ డిజైనింగ్:** సీఎస్ఈ విద్యార్థులకు అందుబాటులో ఉన్న జాబ్ ఓరియెంటెడ్ కోర్సుల్లో వెబ్ డిజైనింగ్ ముందు వరుసలో ఉంటుంది. వెబ్ డిజైన్ లేదా వెబ్ డెవలప్‌మెంట్ కోర్సులు వెబ్‌సైట్ రూపకల్పన, నిర్వహణా నైపుణ్యాలను అందిస్తాయి. దీంతోపాటు ఇంటర్‌ఫేస్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, వెబ్ గ్రాఫిక్ డిజైన్, యూజర్ ఎక్స్‌పీరియెన్స్ డిజైన్, సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్ తదితర నైపుణ్యాలను పెంపొందిస్తాయి. మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో ఉండే ఈ కోర్సులను పూర్తి చేసిన వారికి కొలువులు దక్కుతున్నాయి. వీరికి లభించే కొలువులు.. » గ్రాఫిక్ డిజైనర్ » గ్రాఫిక్ ఆర్టిస్ట్ » క్రియేటివ్ డైరెక్టర్ » డిజైన్ ఆర్కిటెక్ట్.
- **లాంగ్వేజెస్:** సీ, సీ+, సీ++, జావా, నెట్, హెచ్‌టీఎంఎల్, ఎస్క్యూఎల్ తదితర లాంగ్వేజ్‌లు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లకు కొలువులు అందించడంలో కీలకంగా మారాయి. వీటిని పూర్తి చేసిన వారికి డేటాటైప్స్ అండ్ ఆపరేటర్స్, ఆరేస్, హెచ్‌టీఎంఎల్5 సెమాంటిక్ టాగ్ తదితర నైపుణ్యాలు అలవడుతాయి. ఈ కోర్సులను పూర్తి చేస్తే రియల్ టైమ్ ప్రోగ్రామర్‌గా స్థిరడేందుకు అవకాశం ఉంటుంది.
- **డిజిటల్ మార్కెటింగ్:** జాబ్ ఓరియెంటెడ్ కోర్సుల్లో డిజిటల్ మార్కెటింగ్ ప్రముఖంగా నిలుస్తుంది. ఆధునిక మార్కెటింగ్ సాధనాల్లో డిజిటల్ చానళ్లు, సోషల్ మీడియా కీలకంగా మారాయి. అన్ని బిజినెస్ కార్యకలాపాల్లో డిజిటల్ ప్రచార సాధనాలు ప్రవేశించాయి. దాంతో డిజిటల్ మార్కెటింగ్ కోర్సులకు డిమాండ్‌తోపాటు ప్రాధాన్యం పెరిగింది. వీరికి లభించే ఉద్యోగాలు.. » డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ » ఎస్ఈవో మేనేజర్ » కంటెంట్ మేనేజర్ » మొబైల్ మార్కెటింగ్ ఎక్స్‌పర్ట్ » వెబ్ అనలిటిక్స్ ఎక్జిక్యూటివ్.
- **ఇతర ఉపయుక్త కోర్సులు:** » కంప్యూటర్ సిస్టమ్ అనలిస్ట్ » యూఎక్స్ డిజైన్ » రెడ్ హ్యాట్ సర్టిఫైడ్ ఇంజనీర్ » శాప్ కోర్సులు » సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ » ఓరాకిల్, ఎస్క్యూఎల్, డేటాబేస్ అడ్మిన్ » నెట్‌వర్కింగ్ ప్రొఫెషనల్స్.



### ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్

- ఈసీఈ బ్రాంచ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాల పరంగా పలు షార్ట్ టెర్మ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆయా కోర్సులు పూర్తి చేసిన వారికి కోర్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. అభ్యర్థులు స్వీయ ఆసక్తి, ఇష్టాలను అనుసరించి వీటిని ఎంచుకోవడవం లాభిస్తుంది.
- **ఎంబెడెడ్ సిస్టమ్స్:** ఈ కోర్సు కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ల కలయికగా ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచమంతా ఐఓటీ చుట్టూ తిరుగుతోంది. సిస్టమ్‌లు లేదా ప్రొడక్టులను రియల్ టైమ్‌లో పర్యవేక్షించేందుకు ఎంబెడెడ్ సిస్టమ్స్ దోహదపడుతున్నాయి. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి చక్కటి అవకాశాలు లభిస్తున్నాయి.
- **రోబోటిక్స్:** ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు కెరీర్ పరంగా రోబోటిక్స్ కోర్సు బాగా ఉపయోగపడుతుంది. దీన్ని పూర్తి చేసిన వారికి అంతరిక్ష పరిశోధనా సంస్థలు, విభాగాలు, మైక్రోచిప్ తయారీ సంస్థలు, మెడికల్, ఆటోమోటివ్ రంగాల్లో అవకాశాలు ఉంటాయి.
- **సీఏడీడీ:** కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ అండ్ డ్రాఫ్టింగ్(సీఏడీడీ) కోర్సు చేసిన వారికి ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ రంగాలకు సంబంధించిన డ్రాఫ్టింగ్ నైపుణ్యాలు అలవడుతాయి. కోర్సులో భాగంగా కంప్యూటర్‌సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఆకృతుల రూపకల్పన చేయడం, డేటా నిర్వహణ, వ్యూహాల విశ్లేషణ తదితర నైపుణ్యాలను నేర్చుకుంటారు.
- **ఇతర ఉపయుక్త కోర్సులు:** » వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్(వీఎల్ఎస్ఐ) » పీసీబీ అండ్ సర్క్యూట్ డిజైనింగ్ » ఇండస్ట్రియల్ ఆటోమేషన్.

### ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

- **సర్క్యూట్ అనాలసిస్:** ఈ కోర్సులో ఎలక్ట్రికల్ సర్క్యూట్స్‌కు సంబంధించిన ప్రాక్టికల్ అంశాలు, సాధనాల గురించి నేర్చుకుంటారు. సర్క్యూట్స్‌లోని నేచురల్ అండ్ ఫోర్స్‌డ్ రెస్పాన్స్, కాంప్లెక్స్ సర్క్యూట్స్‌కు సంబంధించిన టెక్నిక్స్‌పై పట్టుసాధిస్తారు.
- **ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్:** ఈ కోర్సులో ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, రెగ్యులేటర్లు, కెపాసిటర్లు, లోడు, డిస్ట్రిబ్యూటెడ్ జనరేషన్, స్టోరేజ్ తదితరాల గురించి నేర్చుకుంటారు. దీంతోపాటు లోడ్ ఫ్లో, షార్ట్ సర్క్యూట్ తదితర పద్ధతులపైనా అవగాహన లభిస్తుంది.
- **ఇతర కోర్సులు:** » పవర్ సిస్టమ్ అనాలసిస్ » లీనియర్ సిస్టమ్ అనాలసిస్ » అడ్వాన్స్‌డ్ ట్రెనింగ్ సిస్టమ్ ఇంజనీరింగ్ » ఎయిర్‌క్రాఫ్ట్ మేయింటనెన్స్ » ఎలక్ట్రికల్ సిస్టమ్.

### మెకానికల్ ఇంజనీరింగ్

- **పైపింగ్ డిజైన్ అండ్ ఇంజనీరింగ్:** ఇది మెకానికల్ విద్యార్థులను ఇండస్ట్రీకి అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఉపయోగపడుతుంది. పైపింగ్ డిజైన్ అండ్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి కెమికల్ ఇండస్ట్రీ, మర్చంట్ నేవీ, పెట్రోలియం రిఫైనరీలు, మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలు తదితరాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.
- **టూల్ డిజైన్:** దీన్ని పూర్తి చేసిన వారికి కట్టింగ్ టూల్స్, ప్రెస్ టూల్స్, డై క్యాస్టింగ్, జిగ్స్ అండ్ ఫిక్చర్స్, ప్లాస్టిక్ మౌల్డ్ డిజైన్‌లు, మెజర్‌మెంట్స్, అడ్వాన్స్‌డ్ ప్లాస్టిక్ ప్రాసెస్ టెక్నాలజీలకు సంబంధించిన నైపుణ్యాలు అలవడుతాయి.
- ఇతర కోర్సులు: బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ అభ్యర్థులకు ఉపయోగపడే ఇతర కోర్సులు... మెకట్రానిక్స్, రోబోటిక్స్.

### సివిల్ ఇంజనీరింగ్

- **కన్‌స్ట్రక్షన్ అండ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్:** కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, సివిల్ ఇంజనీరింగ్ రెండూ వేర్వేరు సబ్జెక్టులు. ఈ కోర్సు రెండింటి కలబోతగా ఉంటుంది. ఇందులో అభ్యర్థులు మేనేజ్‌మెంట్ అంశాలతోపాటు నిర్మాణానికి సంబంధించిన తాజా సాంకేతికతల గురించి కూడా తెలుసుకుంటారు. కోర్సు పూర్తి చేసిన వారికి కన్‌స్ట్రక్షన్ రంగంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి.
- **స్ట్రక్చరల్ డిజైన్:** ఆకృతులకు సంబంధించి సాంకేతిక ప్రమాణాలు చాలా ముఖ్యం. ఈ కోర్సులో అభ్యర్థులు భవన, స్టీలు, కాంక్రీట్, ఫౌండేషన్ ఆకృతుల గురించి నేర్చుకుంటారు. దీన్ని పూర్తి చేసిన వారికి అత్యున్నత ప్రమాణాలతో కాంక్రీట్ నిర్మాణాల డిజైన్, కన్‌స్ట్రక్షన్ చేసే సామర్థ్యాలు అలవడుతాయి.
- **ఇతర కోర్సులు:** » ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, » బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ » ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ » ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ » ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.

### వాస్తవాలను గుర్తించండి

ప్రస్తుతం ప్రపంచంలోని ఇంజనీరింగ్ సంబంధిత కంపెనీల్లో నియామకాలు మందగించాయి. మరోవైపు అనేక ఇంజనీరింగ్ కాలేజీలు నైపుణ్యాల ఊసే ఎత్తకుండా విద్యార్థులను బయటకు పంపుతున్నాయి. దాంతో జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు తప్పనిసరిగా మారాయి. బీటెక్ అభ్యర్థులు ముందు నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి. కోర్సు పూర్తయిన వెంటనే ఎంఎన్‌సీ కంపెనీల్లో రూ.30 లేదా రూ. 40 వేల వేతనం లభిస్తుందనే ఆశలను పక్కనపెట్టి... చిన్న, మధ్య తరహా కంపెనీలల్లో రూ.15 వేల జీతానికైనా చేరాలి. నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఓపిగ్గా పనిచేస్తే ఇంజనీరింగ్ రంగంలో ఉజ్వల కెరీర్ సొంతమవుతుంది.

**రాజ ప్రశాంత్**, పెర్‌టెక్నికా.

---

# కరెంట్ అఫైర్స్

ప్రతిష్ఠాత్మక సివిల్ సర్వీసెస్ పరీక్ష మొదలు.. గ్రూప్స్, బ్యాంక్స్, రైల్వే, ఆర్మీ.. ఇలా అన్ని రకాల పోటీ పరీక్షల్లో కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. జాతీయం, అంతర్జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, అవార్డులు, స్పోర్ట్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎకానమీ, బిజినెస్‌కు సంబంధించి గత ఆరునెలల పరిణామాలు పరీక్షల్లో కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో... కొత్త సంవత్సరం 2020లో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం జులై - డిసెంబర్ 2019 కరెంట్ అఫైర్స్‌ను అందిస్తున్నాం...



## పోటీ పరీక్షల ప్రత్యేకం

## వార్తల్లోని వ్యక్తులు

## జులై టు డిసెంబర్, 2019

» **అన్షులా కాంత్:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ అన్షులా కాంత్.. ప్రపంచ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా 2019, జులై12న నియమితులయ్యారు. ఆమె ఈ పదవి చేపట్టిన తొలి మహిళ.


» **రాజీవ్ కుమార్:** జార్ఖండ్ క్యాడర్‌కు చెందిన 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ కుమార్ ఆర్థిక కార్యదర్శిగా జులై 30న నియమితులయ్యారు.

» **వి.కె.జోహ్రి:** మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 1984 బ్యాచ్ ఐపీఎస్ అధికారి వి.కె.జోహ్రి.. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా జులైలో నియమితులయ్యారు.



» **మార్క్ ఎస్పర్:** అమెరికా రక్షణ కార్యదర్శిగా మార్క్ ఎస్పర్ జులైలో నియమితులయ్యారు. రాజీనామా చేసిన జేమ్స్ మాటిస్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు.

» **ఉర్సులా వాన్ డెర్ లెయన్:** జర్మనీకి చెందిన ఉర్సులా వాన్ డెర్ లెయన్ యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలిగా జులైలో ఎన్నికయ్యారు. ఆమె యూరోపియన్ కమిషన్‌కు తొలి మహిళా అధ్యక్షురాలు. ఉర్సులా 2005 నుంచి 2019 వరకూ జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు.



» **క్రిస్టిన్ లగార్డే:** ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టిన్ లగార్డే 2019 జులైలో యూరోపియన్ సెంట్రల్‌బ్యాంక్(ఈసీబీ) అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. ఆమె నవంబర్1న బాధ్యతలు చేపట్టారు. లగార్డే 2011 నుంచి 2019 వరకూ అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

» **రాజీవ్ గౌబా:** నూతన క్యాబినెట్ సెక్రటరీగా రాజీవ్ గౌబాను 2019 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆయన జార్ఖండ్ క్యాడర్‌కు చెందిన 1982 బ్యాచ్ ఐఏఎస్ అధికారి.

» **ఆర్.కె.ఎస్.బదౌరియా:** ఎయిర్ చీఫ్ మార్షల్ రాకేష్ కుమార్ సింగ్ బదౌరియా భారత వాయుసేన 26వ అధిపతిగా 2019 సెప్టెంబర్ 30న బాధ్యతలు స్వీకరించారు.

» **క్రిస్టలీనా జార్జియేవా:** బల్గేరియా ఆర్థికవేత్త క్రిస్టలీనా జార్జియేవా 2019, అక్టోబర్1న అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సంస్థ నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె 2017 నుంచి 2019 వరకూ ప్రపంచ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు.

» **జస్టిస్ జేకే మహేశ్వరి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరి అక్టోబర్ 7న ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మధ్యప్రదేశ్‌కు చెందిన వారు.

» **ప్రంజల్ పాటిల్:** మహారాష్ట్రకు చెందిన ప్రంజల్ పాటిల్ దేశంలోనే మొట్టమొదటి అంధ మహిళా ఐఏఎస్ అధికారి. ఆమె 2019 అక్టోబర్ 14న తిరువనంతపురం సబ్ కలెక్టర్‌గా, రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

» **అనూప్ కుమార్ సింగ్:** 1985 బ్యాచ్ గుజరాత్ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అనూప్ కుమార్ సింగ్... నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్ఎస్‌జీ) డైరెక్టర్‌గా 2019 అక్టోబర్‌లో బాధ్యతలు స్వీకరించారు.

» **సౌరవ్ గంగూలీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) అధ్యక్షుడిగా సౌరవ్ గంగూలీ అక్టోబర్ 23న బాధ్యతలు చేపట్టారు.

» **సుర్జీత్ భల్లా:** అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా 2019 అక్టోబర్‌లో సుర్జీత్ భల్లా నియమితులయ్యారు. ఈయన ప్రముఖ ఆర్థికవేత్త.

» **పంకజ్ కుమార్:** 1987 బ్యాచ్ ఐఏఎస్ అధికారి పంకజ్ కుమార్.. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా అక్టోబర్‌లో నియమితులయ్యారు.

» **జస్టిస్ బోబ్డే:** సుప్రీంకోర్టు 47వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ శరద్ అరవింద్ బోబ్డే 2019 నవంబర్ 18న ప్రమాణ స్వీకారం చేశారు. మహారాష్ట్రకు చెందిన ఆయన 2021 ఏప్రిల్ 23 వరకూ పదవిలో కొనసాగుతారు. జస్టిస్ బోబ్డే... జస్టిస్ రంజన్ గొగోయ్ స్థానంలో బాధ్యతలు చేపట్టారు.

» **ప్రవింద్ జగన్నాథ్:** మారిషస్ ప్రధానిగా ప్రవింద్ జగన్నాథ్ 2019 నవంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

» **గొటబయ రాజపక్స:** శ్రీలంక అధ్యక్షుడిగా గొటబయ రాజపక్స 2019 నవంబర్ 18న బాధ్యతలు చేపట్టారు. ఆయన పార్టీ శ్రీలంక పొదుజన పెరమున(ఎస్ఎల్‌పీపీ). నవంబర్ 21న ఆయన సోదరుడు మహిందా రాజపక్స శ్రీలంక ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.



» **సుందర్ పిచాయ్:** గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్.. గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్‌కు కూడా సీఈవోగా 2019 డిసెంబర్‌లో నియమితులయ్యారు.

» **హర్షవర్ధన్ శ్రింగ్లా:** 1984 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారి హర్షవర్ధన్ శ్రింగ్లాను నూతన విదేశాంగ శాఖ కార్యదర్శిగా 2019 డిసెంబర్‌లో నియమించారు. విజయ్ కేశవ్ గోఖలే స్థానంలో శ్రింగ్లా నియమితులయ్యారు.

» **మనోజ్ ముకుంద్ నరవానే:** జనరల్ బిపిన్ రావత్ స్థానంలో భారత కొత్త సైన్యాధిపతిగా మనోజ్ ముకుంద్ నరవానే 2019 డిసెంబర్‌లో నియమితులయ్యారు.

» **రఫేల్ గ్రాసి:** అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) నూతన డైరెక్టర్ జనరల్‌గా అర్జెంటీనాకు చెందిన రఫేల్ గ్రాసి 2019 డిసెంబర్ 3న బాధ్యతలు స్వీకరించారు.



» **అల్బెర్టో ఫెర్నాండెజ్:** అర్జెంటీనా నూతన అధ్యక్షుడిగా అల్బెర్టో ఫెర్నాండెజ్ 2019 డిసెంబర్ 10న బాధ్యతలు చేపట్టారు. మాజీ అధ్యక్షురాలైన క్రిస్టీనా ఫెర్నాండెజ్ డి కిర్చ్‌నర్ ఉపాధ్యక్షురాలిగా ప్రమాణం చేశారు.

» **సానా మారిన్:** ఫిన్లాండ్ ప్రధాన మంత్రిగా సానా మారిన్ డిసెంబర్ 10న బాధ్యతలు చేపట్టారు. ఆమె వయసు 34 ఏళ్లు. ప్రస్తుతం ప్రపంచంలో అతి పిన్న వయస్కురాలైన ప్రధాని మారిన్.

» **గ్రెటా థున్‌బర్గ్:** స్వీడన్‌కు చెందిన పర్యావరణ కార్యకర్త గ్రెటా థున్‌బర్గ్‌ను ప్రఖ్యాత టైమ్ మ్యాగజీన్ 2019కు గాను పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రకటించింది. అతి పిన్న వయసు(16)లో ఈ ఘనత సాధించిన వ్యక్తి గ్రెటా థున్‌బర్గ్.

» **బోరిస్ జాన్సన్:** 2019 డిసెంబర్ 12న యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఎన్నికలు జరిగాయి. కన్సర్వేటివ్ పార్టీ ఘన విజయం సాధించింది. దాంతో ఆ పార్టీ నాయకుడు బోరిస్ జాన్సన్ మరోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టాడు.



» **ఫోర్బ్స్ జాబితా:** ఫోర్బ్స్ మ్యాగజైన్ 2019 డిసెంబర్‌లో 100 మందితో కూడిన ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాను ప్రకటించింది. వరుసగా తొమ్మిదోసారి జర్మనీ ఛాన్సలర్ ఎంజెలా మెర్కెల్ అగ్రస్థానంలో నిలిచారు. ఈ జాబితాలో భారత్ నుంచి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 34వ స్థానంలో, హెచ్‌సీఎల్ సీఈవో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోషిణి నాడార్ మల్హోత్రా 54వ స్థానంలో, బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా 65వ స్థానంలో నిలిచారు.

» **షీలా దీక్షిత్:** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ జులై 20, 2019న మరణించారు. ఈమె కేరళ గవర్నర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు.

» **ఎస్.జైపాల్ రెడ్డి:** మాజీ కేంద్ర మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి జులై 28న మరణించారు. ఆయన ఐ.కె.గుజ్రాల్, మన్మోహన్ సింగ్‌ల కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు.

» **యుకియ అమనో:** అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) డైరెక్టర్ జనరల్ యుకియ అమనో జులై 18న మరణించారు. జపాన్‌కు చెందిన అమనో 2009 నుంచి మరణించే వరకూ ఐఏఈఏ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు.

» **సుష్మా స్వరాజ్:** కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ ఆగస్టు 6న మరణించారు. 1998లో ఢిల్లీ ముఖ్యమంత్రిగా పనిచేశారు. కేంద్రంలో సమాచార ప్రసార శాఖ, విదేశీ వ్యవహారాల శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

» **అరుణ్ జైట్లీ:** కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ ఆగస్టు 24న మరణించారు. ఆయన 2014 నుంచి 2019 వరకూ ఆర్థిక మంత్రిగా పనిచేశారు.

» **జగన్నాథ్ మిశ్రా:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా ఆగస్టు 19న మరణించారు.

» **కంచన్ చౌదరీ భట్టాచార్య:** దేశంలో తొలి మహిళా డీజీపీగా గుర్తింపు పొందిన కంచన్ చౌదరి భట్టాచార్య ఆగస్టు 26న మరణించారు. ఆమె 1973 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. భట్టాచార్య ఉత్తరాఖండ్ రాష్ట్ర డీజీపీగా పనిచేశారు.

» **రామ్ జెత్మలానీ:** ప్రముఖ న్యాయవాది, కేంద్ర మాజీ న్యాయశాఖ మంత్రి రామ్ జెత్మలానీ 2019 సెప్టెంబర్ 8న మరణించారు.



» **రాబర్ట్ ముగాబే:** జింబాబ్వే మాజీ అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే 2019 సెప్టెంబర్ 6న మరణించారు. ఆయన జింబాబ్వే ప్రధానిగా 1980 నుంచి 1987 వరకూ, అధ్యక్షుడిగా 1987 నుంచి 2017 వరకూ పనిచేశారు.

» **టి.ఎన్.శేషన్:** మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) టి.ఎన్. శేషన్ నవంబర్ 10న మరణించారు. ఆయన 1955 బ్యాచ్‌కు చెందిన తమిళనాడు క్యాడర్ ఐఏఎస్ అధికారి.



**ఎన్.విజయేందర్‌రెడ్డి,**
సీనియర్ ఫ్యాకల్టీ

### నూతన గవర్నర్‌లు

» **ఆంధ్రప్రదేశ్:** బిశ్వభూషణ్ హరిచందన్
» **ఛత్తీస్‌గఢ్:** అనసూయ ఊకె
» **పశ్చిమ బెంగాల్:** జగదీప్ ధంకర్
» **ఉత్తర ప్రదేశ్:** ఆనందిబెన్ పటేల్
» **మధ్యప్రదేశ్:** లాల్‌జీ టండన్
» **త్రిపుర:** రమేష్ బైస్
» **నాగాలాండ్:** ఆర్.ఎన్.రవి
» **బీహార్:** ఫగు చౌహాన్
» **గుజరాత్:** ఆచార్య దేవవ్రత్
» **రాజస్థాన్:** కల్‌రాజ్ మిశ్రా
» **హిమాచల్ ప్రదేశ్:** బండారు దత్తాత్రేయ
» **మహారాష్ట్ర:** భగత్ సింగ్ కోశ్యారి
» **కేరళ:** ఆరిఫ్ మహ్మద్ ఖాన్
» **తెలంగాణ:** తమిళిసై సౌందరరాజన్
» **గోవా:** సత్యపాల్ మాలిక్
» **మిజోరం:** పి.ఎస్.శ్రీధరన్ పిళ్లై
» **జమ్మూకాశ్మీర్:** లెఫ్టినెంట్ గవర్నర్-గిరిష్ చంద్ర ముర్ము
» **లడఖ్:** లెఫ్టినెంట్ గవర్నర్-రాధాకృష్ణ మాథుర్
» **లక్ష ద్వీప్:** అడ్మినిస్ట్రేటర్- దినేశ్వర్ శర్మ

### నూతన ముఖ్యమంత్రులు

» **కర్ణాటక:** బి.ఎస్.యెడియూరప్ప
» **హర్యానా:** మనోహర్‌లాల్ ఖట్టర్
» **మహారాష్ట్ర:** ఉద్ధవ్ థాకరే

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
గణితశాస్త్రం

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం
27-12-2019



ఒకప్పుడు ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనడమే ఘనతగా భావించే భారత క్రీడాకారులు ఇప్పుడు ఏకంగా పతకాలు కొల్లగొడుతున్నారు. క్రీడల్లో అగ్రరాజ్యాల ఆటగాళ్లకు దీటుగా తమ ప్రదర్శన ఇస్తున్నారు. ఆశల పల్లకీని మోస్తూ అసలు సమరంలోనూ ఔరా అనిపిస్తున్నారు. విశ్వ వేదికపై భారత మువ్వన్నెల జెండాను రెపరెపలాడిస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది భారత క్రీడారంగం కొత్త శిఖరాలకు చేరింది. బ్యాడ్మింటన్‌లో తెలుగు తేజం పీవీ సింధు విశ్వవిజేతగా అవతరించి గతంలో ఏ భారత షట్లర్‌కూ సాధ్యంకాని ఘనతను సొంతం చేసుకుంది. బాక్సింగ్‌లో అమిత్ పంఘాల్, మనీశ్ కౌశిక్ రజత, కాంస్య పతకాలు గెలిచి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఒకేసారి భారత్‌కు రెండు పతకాలు అందించారు. షట్లర్లు, బాక్సర్లకు తోడుగా షూటర్లు, రెజ్లర్లు, ఆర్చర్లు కూడా అత్యున్నత వేదికపై అద్భుత ప్రతిభతో ఆకట్టుకున్నారు. ఈ సంవత్సరం అదరగొట్టిన భారత క్రీడాకారులు వచ్చే ఏడాది విశ్వ క్రీడా సంరంభం టోక్యో ఒలింపిక్స్‌లోనూ తమ అద్వితీయ విజయ విన్యాసాలను పునరావృతం చేయాలని ఆకాంక్షిద్దాం... ఆశీర్వదిద్దాం..!

## మెరుపుల్లేని టెన్నిస్ రాకెట్...

ఈ సంవత్సరం భారత టెన్నిస్‌కు గొప్ప ఫలితాలేవీ రాలేదు. పురుషుల సింగిల్స్‌లో ప్రజ్నేశ్ గుణేశ్వరన్ నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించినా... ఒక్క దాంట్లోనూ తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. యూఎస్ ఓపెన్‌లో స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌తో భారత యువతార సుమీత్ నాగల్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్ మ్యాచ్ ఆడాడు. ఫెడరర్‌పై తొలి సెట్ గెలిచిన సుమీత్ ఆ తర్వాత వరుసగా మూడు సెట్‌లు కోల్పోయి ఓడిపోయాడు. డబుల్స్‌లో దివిజ్ శరణ్ రెండు ఏటీపీ టోర్నీ టైటిల్స్ (పుణే ఓపెన్, సెయింట్ పీటర్స్‌బర్గ్ ఓపెన్) సాధించగా... రోహన్ బోపన్న (పుణే ఓపెన్) ఒక టైటిల్ గెలిచాడు. భారత దిగ్గజం, 46 ఏళ్ల లియాండర్ పేస్ 19 ఏళ్ల తర్వాత ర్యాంకింగ్స్‌లో తొలిసారి టాప్–100 నుంచి బయటకు వచ్చాడు. తటస్థ వేదిక కజకిస్తాన్‌లో పాకిస్తాన్‌తో జరిగిన డేవిస్ కప్ ఆసియా ఓసియానియా మ్యాచ్‌లో భారత్ 4–0తో గెలిచి వచ్చే ఏడాది వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్ పోటీలకు అర్హత సాధించింది.

# కొత్త శిఖరాలకు...

సాక్షి క్రీడావిభాగం

విజయాల బాటలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ... తమకంటే మెరుగైన ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ... ఈ ఏడాది భారత క్రీడాకారుల ప్రస్థానం సాగింది. ఈ క్రమంలో మనోళ్లు కొత్త రికార్డులు సృష్టించారు. భవిష్యత్‌పై కొత్త ఆశలు రేకెత్తించారు.

## 'పట్టు' పెరిగింది...



ఈ ఏడాది రెజ్లింగ్‌లో భారత్‌కు మంచి ఫలితాలు లభించాయి. కజకిస్తాన్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు ఏకంగా ఐదు పతకాలను సొంతం చేసుకున్నారు. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో బజరంగ్ పూనియా (65 కేజీలు), రవి దహియా (57 కేజీలు), రాహుల్ అవారే (61 కేజీలు) కాంస్యాలు గెలుపొందగా... దీపక్ పూనియా (86 కేజీలు) రజతం సాధించాడు. మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో వినేశ్ ఫొగాట్ (53 కేజీలు) కాంస్య పతకం దక్కించుకుంది. ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో దీపక్ పూనియా (86 కేజీలు) స్వర్ణం నెగ్గి 18 ఏళ్ల తర్వాత ఈ మెగా ఈవెంట్‌లోని ఓ విభాగంలో భారత్‌కు పసిడి పతకం అందించిన రెజ్లర్‌గా గుర్తింపు పొందాడు. ఈ సంవత్సరం ఉత్తమ ప్రపంచ జూనియర్ రెజ్లర్‌గా కూడా దీపక్ పూనియా ఎంపిక కావడం విశేషం.

## సస్పెన్షన్ ఉన్నా...



భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ) అంతర్గత రాజకీయాల కారణంగా ప్రపంచ ఆర్చరీ సంఘం భారత్‌పై సస్పెన్షన్ విధించింది. దాంతో భారత ఆర్చర్లు భారత పతాకం కింద కాకుండా ప్రపంచ ఆర్చరీ సంఘం పతాకంపై పోటీ పడాల్సి వచ్చింది. జూన్‌లో నెదర్లాండ్స్‌లో జరిగిన ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో అతాను దాస్, ప్రవీణ్ జాదవ్, తరుణ్‌దీప్ రాయ్ బృందం రికర్వ్ టీమ్ విభాగంలో రజతం నెగ్గడంతోపాటు టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఇదే ఈవెంట్ కాంపౌండ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ జ్యోతి సురేఖ వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో కాంస్య పతకాలు సాధించింది. బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో జ్యోతి సురేఖ–అభిషేక్ వర్మ జంట కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణం సొంతం చేసుకుంది. ఇదే ఈవెంట్‌లో దీపిక కుమారి మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో టోక్యో ఒలింపిక్స్ బెర్త్‌ను సంపాదించింది.

## సూపర్ 'గురి'...

షూటింగ్‌లో మనోళ్లు గురి చూసి పతకాల పంట పండించారు. ఫిబ్రవరిలో న్యూఢిల్లీ వేదికగా జరిగిన ప్రపంచకప్‌లో అపూర్వీ చండేలా మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో... సౌరభ్ చౌధరీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ప్రపంచ రికార్డులు సృష్టించి పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో సౌరభ్–మను భాకర్ జోడీ స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. ఏప్రిల్‌లో చైనాలో జరిగిన రెండో ప్రపంచకప్ టోర్నీలోనూ భారత షూటర్లు మెరిశారు. మూడు స్వర్ణాలు, ఒక రజతం సాధించి 'టాప్' ర్యాంక్‌ను సంపాదించారు. ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ భారత షూటర్లు అదుర్స్ అనిపించారు. ఓవరాల్‌గా ఈసారి భారత్ నుంచి అత్యధికంగా 15 మంది షూటర్లు టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు.



## జగజ్జేత...



గత పదేళ్లుగా అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో తమదైన ముద్ర వేస్తున్న భారత షట్లర్లు ఈసారి అద్భుతమే చేశారు. పూసర్ల వెంకట (పీవీ) సింధు రూపంలో భారత బ్యాడ్మింటన్‌కు తొలిసారి ప్రపంచ చాంపియన్ లభించింది. ఆగస్టులో స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సింధు మహిళల సింగిల్స్ విభాగంలో విశ్వవిజేతగా నిలిచింది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు పొందింది. ఇక పురుషుల సింగిల్స్‌లో మరో తెలుగు తేజం భమిడిపాటి సాయిప్రణీత్ 36 ఏళ్ల నిరీక్షణకు తెరదించాడు. ప్రకాశ్ పదుకొనే (1983లో) తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో కాంస్యం గెలిచిన భారత క్రీడాకారుడిగా సాయిప్రణీత్ ఘనత వహించాడు. వీరిద్దరి ప్రతిభ కారణంగా 42 ఏళ్ల ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్‌కు తొలిసారి మహిళల, పురుషుల సింగిల్స్ విభాగాల్లో పతకాలు లభించాయి. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ప్రదర్శనను మినహాయిస్తే వరల్డ్ టూర్ సూపర్ టోర్నమెంట్‌లలో ఈసారి భారత అగ్రశ్రేణి క్రీడాకారులెవరూ ఆకట్టుకోలేకపోయారు. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జంట థాయ్‌లాండ్ ఓపెన్‌లో టైటిల్ సాధించి మేటి జోడీకి ఉండాల్సిన లక్షణాలు తమలో ఉన్నాయని చాటిచెప్పింది. సీజన్ చివర్లో యువతార లక్ష్య సేన్ ఐదు సింగిల్స్ టైటిల్స్ సాధించి ఊరటనిచ్చాడు. ఏడాది ఆరంభంలో జరిగిన ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో బెంగళూరు రాప్టర్స్ జట్టు టైటిల్ దక్కించుకుంది. ఫైనల్లో బెంగళూరు 4–3తో ముంబై రాకెట్స్‌పై గెలిచింది.

## మరింత 'ఎత్తు'కు...

భారత చెస్‌కు ఈ ఏడాది కలిసొచ్చింది. ఈ సంవత్సరం ఆరుగురు గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదా పొందారు. ఈ జాబితాలో విశాఖ్ (తమిళనాడు), గుకేశ్ (తమిళనాడు), ఇనియన్ (తమిళనాడు), స్వయమ్స్ మిశ్రా (ఒడిశా), గిరిశ్ కౌశిక్ (కర్ణాటక), ప్రీతూ గుప్తా (ఢిల్లీ) ఉన్నారు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల వయస్సులో డి.గుకేశ్ గ్రాండ్‌మాస్టర్ హోదా పొంది భారత్ తరఫున ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా... ప్రపంచంలో రెండో పిన్న వయస్కుడిగా గుర్తింపు పొందాడు. 2002లో సెర్గీ కర్యాకిన్ (రష్యా) 12 ఏళ్ల 10 నెలల వయస్సులో జీఎం హోదా సాధించాడు. 'ఫిడే' మహిళల గ్రాండ్‌ప్రి టూర్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి రష్యా గ్రాండ్‌ప్రిలో టైటిల్ సాధించి... మొనాకో గ్రాండ్‌ప్రిలో రన్నరప్‌గా నిలిచింది.



## 'పంచ్' అదిరింది...

బాక్సింగ్‌లోనూ ఈ సంవత్సరం భారత క్రీడాకారులు అదరగొట్టారు. రష్యాలో జరిగిన పురుషుల సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో అమిత్ పంఘాల్ (52 కేజీలు) రజతం సాధించి ఈ ఘనత సాధించిన తొలి భారతీయ బాక్సర్‌గా కొత్త చరిత్ర సృష్టించాడు. మనీశ్ కౌశిక్ (63 కేజీలు) కాంస్యం గెలవడంతో ఈ మెగా ఈవెంట్ చరిత్రలో భారత్‌కు తొలిసారి ఒకేసారి రెండు పతకాలు లభించాయి. సీనియర్ మహిళల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు నాలుగు పతకాలు దక్కాయి. దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ (51 కేజీలు)తోపాటు జమునా బోరో (54 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (69 కేజీలు) కాంస్యాలు సాధించగా... మంజు రాణి (48 కేజీలు) రజత పతకం గెల్చుకుంది.



## చలాకీ... హాకీ

సొంతగడ్డపై జరిగిన టోక్యో ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో తమ ప్రత్యర్థులను ఓడించిన భారత పురుషుల, మహిళల జట్లు ఒలింపిక్ బెర్త్‌లను సంపాదించాయి. క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో రష్యాపై భారత పురుషుల జట్టు... అమెరికాపై భారత మహిళల జట్టు గెలుపొందాయి. అంతకుముందు సీజన్ ఆరంభంలో భారత పురుషుల జట్టు అజ్లాన్ షా హాకీ టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది.

## అదే మందగమనం...

'ఆసియా' స్థాయి మినహాయిస్తే అంతర్జాతీయంగా భారత అథ్లెట్స్ ప్రదర్శన అంతంత మాత్రంగానే ఉంది. టోక్యో ఒలింపిక్స్‌లో పతకాలు తెచ్చే సత్తా ఉన్న అథ్లెట్స్‌గా నీరజ్ చోప్రా (జావెలిన్ త్రో), హిమ దాస్ (మహిళల 400 మీటర్లు)లపై భారీ ఆశలు పెట్టుకున్నా వారిద్దరూ గాయాల బారిన పడ్డారు. సెప్టెంబరులో దోహాలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌కు దూరమయ్యారు. ఇటలీలో జూలైలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో ద్యుతీ చంద్ మహిళల 100 మీటర్ల విభాగంలో స్వర్ణం గెలిచి ఈ ఘనత సాధించిన తొలి భారత అథ్లెట్‌గా గుర్తింపు పొందింది. అయితే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ద్యుతీ చంద్ విఫలమైంది. ఆమె హీట్స్ దాటి ముందుకెళ్లలేకపోయింది. ఇప్పటివరకు టోక్యో ఒలింపిక్స్ అర్హత సమయాన్ని (11.15 సెకన్లు) ఆమె అందుకోలేకపోయింది.




## దీటుగా... టీటీ...

టేబుల్ టెన్నిస్‌లో భారత స్టార్ సత్యన్ జ్ఞానశేఖరన్ అద్భుత పురోగతి సాధించాడు. ఈ ఏడాది అతను ప్రపంచ టాప్–20 ర్యాంకింగ్స్‌లోని పలువురు ఆటగాళ్లను ఓడించాడు. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ 24వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత్ తరఫున పురుషుల సింగిల్స్ ఆటగాడు ఐటీటీఎఫ్ టాప్–25 ర్యాంకింగ్స్‌లో రావడం ఇదే ప్రథమం. సత్యన్, శరత్ కమల్, హర్మీత్ దేశాయ్‌లతో కూడిన భారత జట్టు టీమ్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా ఎనిమిదో ర్యాంక్‌కు చేరుకుంది.

## హైదరాబాద్ 69 ఆలౌట్

**న్యూఢిల్లీ:** ఢిల్లీతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 29 ఓవర్లలో 69 పరుగులకే ఆలౌటై... ఫాలోఆన్‌లో పడింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 20 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే హైదరాబాద్ ఇంకా 195 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 269/6తో రెండో రోజు ఆట కొనసాగించిన ఢిల్లీ 71.4 ఓవర్లలో 284 పరుగులకు ఆలౌటైంది. అనంతరం ఓపెనర్ అక్షత్ రెడ్డి (0) గోల్డెన్ డక్‌తో ఆరంభమైన హైదరాబాద్ పతనం రవి కిరణ్ (0) వరకు నిరాటంకంగా కొనసాగింది. హైదరాబాద్ టాప్ స్కోరర్ సందీప్ చేసిన 16 పరుగులు కావడం గమనార్హం.



ఇషాంత్

## రాణించిన స్మిత్, లబ్‌షేన్

ఆస్ట్రేలియా 257/4



స్మిత్

**మెల్‌బోర్న్:** న్యూజిలాండ్‌తో మొదలైన 'బాక్సింగ్ డే' టెస్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన స్టీవ్ స్మిత్ (192 బంతుల్లో 77 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా, మార్నస్ లబ్‌షేన్ (149 బంతుల్లో 63; 6 ఫోర్లు, 1 సిక్స్) ఈ ఏడాది తన జోరును కొనసాగించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 83 పరుగులు జోడించారు. అంతకుముందు టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలి ఓవర్లోనే జో బర్న్స్ (0)ను బౌల్ట్ అవుట్ చేశాడు. ఆ తర్వాత లబ్‌షేన్, వార్నర్ (41) కలిసి జట్టును ఆదుకోగా, మరో బ్యాట్స్‌మన్ మాథ్యూ వేడ్ (38) కూడా ఫర్వాలేదనిపించాడు.

**రికార్డు ప్రేక్షకులు...**

టెస్టు మ్యాచ్ తొలి రోజు భారీ సంఖ్యలో అభిమానులు ఎంసీజీలో హాజరు కావడం విశేషం. గురువారం ఏకంగా 80, 473 మంది ప్రేక్షకులు మ్యాచ్ చూసేందుకు వచ్చారు. 'యాషెస్' సిరీస్ కాకుండా ఇతర జట్టు ఆడిన బాక్సింగ్ డే టెస్టులో ఇంత పెద్ద సంఖ్యలో అభిమానులు రావడం 1975 తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. 1975లో ఆసీస్–విండీస్ మధ్య జరిగిన మ్యాచ్‌కు ఒకే రోజు 85, 661 మంది ప్రేక్షకులు హాజరయ్యారు.

## దక్షిణాఫ్రికా 277/9



డి కాక్

**సెంచూరియన్:** ఇంగ్లండ్‌తో ప్రారంభమైన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా కోలుకుంది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. క్వింటన్ డి కాక్ (128 బంతుల్లో 95; 14 ఫోర్లు) సెంచరీ కోల్పోయాడు. మ్యాచ్ తొలి బంతికే ఎల్గర్ (0)ను అండర్సన్ అవుట్ చేయగా... ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి సఫారీలు 111 పరుగులకే 5 వికెట్లు కోల్పోయారు. ఈ దశలో ప్రిటోరియస్ (33)తో కలిసి ఆరో వికెట్‌కు డి కాక్ 87 పరుగులు జోడించాడు. స్యామ్ కరన్ 4 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా, బ్రాడ్‌కు 3 వికెట్లు దక్కాయి. 37 ఏళ్ల ఇంగ్లండ్ సీనియర్ పేసర్ జేమ్స్ అండర్సన్‌కు ఇది 150వ టెస్టు మ్యాచ్ కావడం విశేషం. తద్వారా ఈ జాబితాలో చోటు దక్కించుకున్న మొదటి బౌలర్‌గా అతను గుర్తింపు పొందాడు.

## బెంగాల్ 289 ఆలౌట్



విహారి శశికాంత్

**కోల్‌కతా:** ఆంధ్ర బౌలర్లు చీపురుపల్లి స్టీఫెన్ (4/78), శశికాంత్ (4/64) తమ పేస్ బౌలింగ్‌తో హడలెత్తించడంతో బెంగాల్ తన తొలి ఇన్నింగ్స్‌లో 289 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 241/4తో గురువారం ఆట కొనసాగించిన బెంగాల్ మరో 48 పరుగులు జోడించి మిగిలిన 6 వికెట్లు కోల్పోయింది. వెలుతురు లేమి కారణంగా రెండో రోజు ఆట 21 ఓవర్లకు మాత్రమే పరిమితం కావడంతో ఆంధ్ర ఇన్నింగ్స్ ప్రారంభం కాలేదు.

**గాంధీకి ప్రవేశం లేదు!**

ఆంధ్ర, బెంగాల్ రంజీ మ్యాచ్ సందర్భంగా వివాదాస్పద ఘటన చోటు చేసుకుంది. బెంగాల్ మాజీ క్రికెటర్, ప్రస్తుత సీనియర్ జట్టు సెలక్టర్ దేవాంగ్ గాంధీని బెంగాల్ జట్టు డ్రెస్సింగ్ రూమ్‌నుంచి అనూహ్యంగా బయటకు పంపించారు. సీనియర్ క్రికెటర్ మనోజ్ తివారి ఇందుకు కారణమని తెలుస్తోంది. టీమ్ డ్రెస్సింగ్ రూమ్‌లో జట్టు సభ్యులు, సహాయక సిబ్బంది మాత్రమే ఉండాలని, బయటి వ్యక్తులు ఎవరూ రాకూడదనేది నిబంధన. గాంధీ అనుమతి లేకుండా వచ్చారని అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతోనే వారు అతడిని బయటకు పంపినట్లు సమాచారం. అయితే తాను ఎలాంటి నిబంధనలను అతిక్రమించలేదని గాంధీ స్పష్టం చేశాడు. ఈ విషయంలో గాంధీకి మద్దతుగా నిలిచిన బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) తివారీపై చర్య తీసుకునే అవకాశం ఉంది. మరో వైపు జట్టు బౌలింగ్ కోచ్ రణదేబ్ బోస్‌ను బహిరంగంగా తిట్టడం వల్లే ఈ మ్యాచ్‌లో సీనియర్ బౌలర్ అశోక్ దిండాను తప్పించినట్లు తెలిసింది. అతనిపై క్రమశిక్షణాచర్యల్లో భాగంగానే చివరి నిమిషంలో జట్టునుంచి దూరంగా ఉంచారు.

## భారత అండర్–19 విజయం

**ఈస్ట్ లండన్ (దక్షిణాఫ్రికా):** యూత్ సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికా అండర్–19తో జరిగిన తొలి వన్డేలో భారత అండర్–19 జట్టు 9 వికెట్లతో విజయం సాధించింది. తొలుత దక్షిణాఫ్రికా 48.3 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటైంది. ల్యూక్ బ్యూఫోర్ట్ (64) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆ తర్వాత భారత్ 42.3 ఓవర్లలో వికెట్ నష్టపోయి 190 పరుగులు చేసింది. దివ్యాన్ష్ సక్సేనా (116 బంతుల్లో 86 నాటౌట్; 11 ఫోర్లు), తిలక్ వర్మ (95 బంతుల్లో 59; 9 ఫోర్లు) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. తిలక్ వర్మ అవుటైనా... కుషాగ్ర (43 బంతుల్లో 44 నాటౌట్; 6 ఫోర్లు)తో కలిసి దివ్యాన్ష్ జట్టును గెలిపించాడు. రెండో వన్డే ఈ నెల 28న జరుగుతుంది.

## బాక్సర్ సుమీత్‌పై ఏడాది నిషేధం

**న్యూఢిల్లీ:** ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్ మాజీ రజత పతక విజేత, భారత బాక్సర్ సుమీత్ సాంగ్వాన్‌పై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) గురువారం ఏడాది నిషేధాన్ని విధించింది. గత అక్టోబర్ నెలలో అతని నుంచి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షించగా... అందులో ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నిషేధిత జాబితాలో ఉన్న 'ఎసిటజోలమైడ్' ఉన్నట్లు తేలింది. దీంతో అతనిపై నిషేధం విధిస్తున్నట్లు 'నాడా' డైరెక్టర్ జనరల్ నవీన్ అగర్వాల్ ప్రకటించారు. దీంతో 91 కేజీల విభాగంలో ఒలింపిక్స్ అర్హత పోటీలకు నిర్వహించే ట్రయల్స్‌కు సుమీత్ దూరమయ్యాడు.

## చెరో 3.5 పాయింట్లతో...

**మాస్కో:** ప్రపంచ మహిళల ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక శుభారంభం చేశారు. తొలిరోజు 4 గేమ్‌ల అనంతరం హంపి 3.5 పాయింట్లతో ఐదో స్థానంలో, హారిక (3.5 పాయింట్లు) తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్నారు. తొలి గేమ్‌లో పొటపోవా మార్గరిటాపై గెలిచిన హంపి చారోచికినా డారియాతో రెండో గేమ్‌ను డ్రా చేసుకుంది. ఖోమెరికి, ఎకతెరినాలతో వరుసగా మూడు, నాలుగు గేమ్‌ల్లో విజయాలు సాధించింది. హారిక తొలి గేమ్‌లో ఏగ్రెస్ట్ ఇనాపై నెగ్గి, మమెజరోవాతో రెండోగేమ్‌ను డ్రా చేసుకుంది. మూడు, నాలుగు గేమ్‌లలో వరుసగా బివోల్ అలీనా, గిర్సెయా సిల్వియాలపై గెలుపొందింది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
27-12-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 298 ▼ | 41,164 |
| నిఫ్టీ | 88 ▼ | 12,127 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు 11.30గంటలకు)


| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 9,001 | ▲ 48 |
| డోజోన్స్ | 28,572 | ▲ 57 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 (బుధవారం) | 7,632 | ▲ 9 |
| డాక్స్ (బుధవారం) | 13,301 | ▼ 18 |
| షాంఘై | 3,007 | ▲ 25 |
| నికాయ్ | 23,925 | ▲ 142 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.49 | 72.13 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.04 | 94.24 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.64 | 80.57 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.90 | 66.30 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 48.36 | 50.56 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.74 | 53.55 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.23 | 19.83 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.95 | 19.96 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.57 | 10.97 |

# వామ్మో.. ఏటీఎం?




- భద్రతపై ఆర్‌బీఐ ఆదేశాలు బేఖాతరు...
- లైట్ తీసుకుంటున్న బ్యాంకులు
- సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్‌కు దగ్గరపడుతున్న డెడ్‌లైన్
- పూర్తి స్థాయిలో అమలు కాని పరిస్థితి

ఒకపక్క ఏటీఎంలలో భద్రత లోపాలు అనేకసార్లు బైటపడుతున్నప్పటికీ బ్యాంకులు తగు చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయంలో బ్యాంకింగ్ రంగ నియంత్రణ సంస్థ రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలను కూడా అంతగా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఏటీఎంలలో విండోస్ 7 సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవడం మొదలుకుని యాంటీ స్కిమ్మింగ్ కార్డ్ రీడర్లు ఇన్‌స్టాల్ చేయడం, నగదు సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తల దాకా వివిధ అంశాలపై ఏప్రిల్ 2018 నుంచి ఆగస్టు 2019 మధ్యలో ఆర్‌బీఐ, హోంశాఖ పలు సర్క్యులర్‌లు జారీ చేశాయి. నగదు భర్తీ చేసే సంస్థలు పాటించాల్సిన నిబంధనలు కూడా వీటిల్లో ఉన్నాయి. విండోస్ 7 సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేసుకునేందుకు ఆర్‌బీఐ విధించిన జనవరి 2020 డెడ్‌లైన్ దగ్గరపడుతోంది. అయినప్పటికీ.. మిగతా నిబంధనల్లాగే దీన్ని కూడా పూర్తి స్థాయిలో అందుకునే పరిస్థితి కనిపించడం లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

### తీవ్రంగా పరిగణిస్తున్న ఆర్‌బీఐ...

భారత్‌లో బ్యాంకింగ్ తీరుతెన్నులు, పురోగతిపై రిజర్వ్ బ్యాంక్ ఇటీవల విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం.. ఏటీఎం, డెబిట్ కార్డు లావాదేవీలపై బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌కి 2017–18లో 24,672 ఫిర్యాదులు రాగా, 2018–19లో 36,539కి పెరిగాయి. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యల గురించి అనేక సార్లు హెచ్చరించినప్పటికీ బ్యాంకులు పట్టించుకోకపోతుండాన్ని రిజర్వ్ బ్యాంక్ తీవ్రంగా పరిగణిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఏటీఎంలలో భద్రతా ప్రమాణాలకు సంబంధించి 2017 మార్చి, నవంబర్‌లలో చేసిన సిఫార్సులను అమలు చేయాలంటూ 2018 జూన్ 21న ఆర్‌బీఐ ఒక సర్క్యులర్ పంపించింది. ఆర్‌బీఐ ఆదేశాల ప్రకారం.. ఏటీఎంలను కచ్చితంగా గోడలు లేదా పిల్లర్లలోకి అమర్చడం, నగదు భర్తీ కోసం వన్ టైమ్ కాంబినేషన్ (ఓటీసీ) తాళాలను ఉపయోగించడం తదితర నిబంధనలు అమలు చేయాల్సి ఉంటుంది. కానీ ఆర్‌బీఐ ఆదేశాల అమలు పురోగతి నత్తనడకన సాగుతోందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం దేశంలో ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి మొత్తం 2,06,589 ఏటీఎంలు నిర్వహణలో ఉన్నాయి. అయితే, ఇప్పటికీ సగం ఏటీఎంలలో ఓటీసీ వినియోగంలోకి రాలేదు. ఆపరేటింగ్ సిస్టమ్‌ను అప్‌గ్రేడ్ చేసుకోకపోవడం, తగిన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల.. బ్యాంకు ఖాతాదారులు నష్టపోవడంతో పాటు బ్యాంకు ప్రతిష్ట కూడా దెబ్బతింటుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.



### వ్యయాల భయంతో వెనుకంజ..

ఏటీఎంలలో నగదు భర్తీకి ప్రస్తుతం ఉపయోగిస్తున్న విధానానికి బదులుగా మరింత సురక్షితమైన లాకబుల్ క్యాసెట్స్ (పెట్టె) విధానాన్ని అమల్లోకి తేవాలని సూచిస్తూ 2018 ఏప్రిల్ 12న.. ఆర్‌బీఐ మరో సర్క్యులర్ కూడా ఇచ్చింది. 2020–21 నాటికి మొత్తం ఏటీఎంలలో కనీసం 60% ఏటీఎంలలో దీన్ని అమల్లోకి తేవాలని నిర్దేశించింది. అయితే, దీనిపై బ్యాంకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల ఖర్చులు తడిసిమోపెడవుతాయని, పరిశ్రమపై సుమారు రూ. 6,000 కోట్ల భారం పడుతుందంటున్నాయి. భారీ ఆర్థిక భారం పడే అవకాశాలు ఉన్నందున ఈ ఆదేశాల విషయంలో జోక్యం చేసుకోవాలంటూ కేంద్ర ఆర్థిక శాఖను కోరాయి. మరోవైపు, నగదు రవాణా చేసే సంస్థలకు (సీఎల్‌సీ) సంబంధించి కూడా ఆర్‌బీఐ 2018 ఏప్రిల్ 6న మరో కీలక సర్క్యులర్ జారీ చేసింది. సీఎల్‌సీల వద్ద పటిష్టమైన, తేలికపాటి వాణిజ్య వాహనాలు కనీసం 300 అయినా ఉండాలని నిర్దేశించింది. దీన్నే పునరుద్ఘాటిస్తూ 2018 ఆగస్టు 8న కేంద్ర హోంశాఖ కూడా ఒక నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందుకు నిర్దేశించిన గడువు దాటిపోయి ఏడాది గడిచిపోయినా.. ఇంతవరకూ పూర్తిగా అమలు కావడం లేదని పరిశ్రమవర్గాలు పేర్కొన్నాయి.

## డేటా వాడేస్తున్నారు



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** దేశంలో వైర్‌లెస్ డేటా వినియోగం అనూహ్యంగా పెరుగుతోంది. 2014లో కస్టమర్లు 82.8 కోట్ల గిగాబైట్స్ (జీబీ) డేటా వాడితే.. 2018 వచ్చే సరికి ఇది 4,640 కోట్ల జీబీకి చేరిందని ట్రాయ్ గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత సంవత్సరం జనవరి–సెప్టెంబర్‌లో ఇది ఏకంగా 5,491.7 కోట్ల జీబీగా నమోదైంది. 2017లో వినియోగదార్లు 2,009 కోట్ల జీబీ డేటాను వాడారు. 2014తో పోలిస్తే వైర్‌లెస్ డేటా యూజర్ల సంఖ్య 28.16 కోట్ల నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ చివరినాటికి 66.48 కోట్లకు చేరారు. 2017తో పోలిస్తే 2018లో యూజర్ల వృద్ధి 36.36 శాతంగా ఉంది. గత నాలుగేళ్లలో డేటా వాడకం ఊహించనంతగా అధికమవుతోందని ట్రాయ్ అంటోంది. '4జీ/ఎల్‌టీఈ రాక, ఈ టెక్నాలజీ విస్తృతితో ఇది సాధ్యమైంది. దేశంలో మొబైల్ నెట్‌వర్క్స్ అత్యధిక ప్రాంతం 2జీ నుంచి 4జీకి మారడం, అందుబాటు ధరలో స్మార్ట్‌ఫోన్లు లభించడం ఇంటర్నెట్ వాడకాన్ని పెంచింది. మొబైల్ టారిఫ్‌లు పడిపోవడం, ఇంగ్లిష్, హిందీ తోపాటు ప్రాంతీయ భాషల్లో కంటెంట్ లభించడం కూడా ఇందుకు దోహదం చేసింది. ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం కోట్లాది మందిని సాధికారత వైపు నడిపించింది. వీరికి రియల్ టైమ్ సమాచారం, ప్రభుత్వ సేవలు, ఈ–కామర్స్, సోషల్ మీడియా ఎప్పటికప్పుడు చేరింది. దీంతో వీరి జీవితాలపై సానుకూల ప్రభావం చూపింది' అని ట్రాయ్ తెలిపింది.

## జీఎస్‌టీ రిటర్ను ఎగవేస్తే.. ఖాతా జప్తే

### రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేసే అవకాశం



**న్యూఢిల్లీ:** వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) రిటర్నులు దాఖలు చేయని అసెసీలు కఠిన చర్యలు ఎదుర్కొనాల్సి రానుంది. ప్రభుత్వం.. అలాంటి అసెసీల బ్యాంకు ఖాతాలను స్తంభింప చేయడం లేదా ఏకంగా రిజిస్ట్రేషన్‌ను కూడా రద్దు చేసే అవకాశాలు ఉన్నాయి. జీఎస్‌టీ రిటర్నులను దాఖలు చేయని సంస్థలతో వ్యవహరించాల్సిన విధానాలకు సంబంధించి కేంద్రీయ పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) ప్రత్యేకంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని రూపొందించింది. ఇందులో నిర్దిష్ట కఠిన చర్యలను కూడా చేర్చినట్లు తెలుస్తోంది.

**దఫదఫాలుగా నోటీసులు...**

కాంపొజిషన్ స్కీమ్ ఎంచుకున్న అసెసీలు.. మూడు నెలలకోసారి, మిగతా వారు నెలకోసారి జీఎస్‌టీ రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటోంది. అయితే, జీఎస్‌టీ అసెసీల్లో 20 శాతం మంది రిటర్నులు దాఖలు చేయడం లేదని, దీనివల్ల పన్ను వసూళ్లు గణనీయంగా దెబ్బతింటున్నాయని అధ్యయన నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సీబీఐసీ... ఎస్‌వోపీని తెరపైకి తెచ్చింది. దీని ప్రకారం గడువులోగా చెల్లింపులు జరపని పక్షంలో డిఫాల్టరుకు ముందు సిస్టమ్ నుంచి ఒక నోటీస్ వెడుతుంది. ఆ తర్వాత అయిదు రోజుల్లోగా చెల్లించకపోతే.. ఫారం 3–ఎ కింద మరో నోటీసు జారీ అవుతుంది. ఇది వచ్చాక 15 రోజుల్లోగానైనా చెల్లించాల్సి ఉంటుంది. అప్పటికీ కట్టకపోతే.. అధికారులు సదరు అసెసీ కట్టాల్సిన పన్ను బాకీలను మదింపు చేసి, ఫారం ఏఎస్ఎంటీ–13 జారీ చేస్తారు.

## భీమ్ యూపీఐతో ఫాస్టాగ్ రీచార్జ్



**న్యూఢిల్లీ:** నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ (ఎన్ఈటీసీ) ఫాస్టాగ్‌లను భీమ్ యూపీఐ ద్వారా కూడా రీచార్జ్ చేసుకునే వెసులుబాటును కల్పించినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించింది. దీనితో ఫాస్టాగ్ రీచార్జ్ ప్రక్రియ మరింత సులభతరం కాగలదని సంస్థ సీవోవో ప్రవీణ రాయ్ తెలిపారు. టోల్ చెల్లింపునకు సంబంధించి వాహనదారుల సమయం వృధా కాకుండా చూసేలా 'ఫాస్టాగ్' అమల్లోకి రావడం తెలిసిందే. ప్రీపెయిడ్ లేదా సేవింగ్స్ అకౌంటుకు అనుసంధానించే ఫాస్టాగ్ ట్యాగ్‌లను వాహనం విండ్‌స్క్రీన్‌పై అతికిస్తారు. టోల్‌ప్లాజాల్లో ఏర్పాటు చేసిన రీడర్లు వీటిని స్కాన్ చేశాక.. వాహనదారు ఖాతా నుంచి నిర్దేశిత టోల్ ఫీజు చెల్లింపు ప్రక్రియ ఆటోమేటిక్‌గా జరుగుతుంది. దీనివల్ల టోల్ ప్లాజాల్లో వాహనాల రద్దీ తగ్గడంతో పాటు వాహనదారుల సమయం కూడా ఆదా అవుతుంది.

## 'మిల్లీమీటర్' స్పెక్ట్రం విక్రయంపై కసరత్తు

- వచ్చే ఏడాదే వేలానికి అవకాశం
- ధరపై ట్రాయ్‌తో చర్చించనున్న టెలికం శాఖ
- మార్చి–ఏప్రిల్‌లో విక్రయించే స్పెక్ట్రంనకు ఇది అదనం




**న్యూఢిల్లీ:** 5జీ సర్వీసుల కోసం మరింత స్పెక్ట్రంను అందుబాటులోకి తేవడంపై కేంద్రం దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా కీలకమైన 24.75–27.25 గిగాహెట్జ్ బ్యాండ్‌విడ్త్‌లో స్పెక్ట్రంను విక్రయించే అంశాన్ని పరిశీలిస్తోంది. దీన్ని వీలైతే వచ్చే ఏడాదే వేలం వేసే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ధర, వేలం విషయంలో పాటించాల్సిన ఇతరత్రా విధి విధానాల గురించి టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌తో టెలికం శాఖ (డాట్) త్వరలో చర్చలు జరపనున్నట్లు వివరించాయి. సుమారు రూ. 5.22 లక్షల కోట్ల ధరతో 22 సర్కిళ్లలో 700 మెగాహెట్జ్ నుంచి 3400–3600 మెగాహెట్జ్ బ్యాండ్‌లో స్పెక్ట్రం వేలం నిర్వహించేందుకు డిజిటల్ కమ్యూనికేషన్స్ కమిషన్ (డీసీసీ) డిసెంబర్ 20నే ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. 2020 మార్చి–ఏప్రిల్ మధ్యలో ఈ వేలం నిర్వహించనున్నారు. దీనికి అదనంగా 'మిల్లీమీటర్ వేవ్ బ్యాండ్స్'గా వ్యవహరించే 24.75–27.25 గిగాహెట్జ్ బ్యాండ్‌లోనూ కొంత స్పెక్ట్రంను విక్రయించాలని డాట్ భావిస్తోంది. దీనిపైనే వచ్చే నెలలో ట్రాయ్ అభిప్రాయాన్ని తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా స్పెక్ట్రంతో కలిపి దీన్ని కూడా విక్రయించాలని డాట్ యోచించినప్పటికీ.. ట్రాయ్‌తో సంప్రదింపులకు నిర్దిష్ట కాలావధులు ఉండటం వల్ల అది సాధ్యపడే అవకాశం లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

**స్వాగతించిన సీవోఏఐ..**

కొత్త బ్యాండ్ స్పెక్ట్రం వేలంపై ట్రాయ్‌ను సంప్రదించాలన్న డాట్ నిర్ణయాన్ని టెల్కోల సమాఖ్య సీవోఏఐ స్వాగతించింది. దీనితో తగినంత స్థాయిలో 5జీ స్పెక్ట్రం లభించగలదని సీవోఏఐ డైరెక్టర్ జనరల్ రాజన్ మాథ్యూస్ తెలిపారు. అయితే, రిజర్వ్ ధర ఎంత నిర్ణయిస్తారన్నది వేచి చూడాల్సిన అంశమని పేర్కొన్నారు. మార్చి–ఏప్రిల్‌లో నిర్వహించే వేలంలో తగినంత 5జీ స్పెక్ట్రం అందుబాటులో ఉండదని, 26 గిగాహెట్జ్ బ్యాండ్‌లోనూ వేలం వేసే విషయంపై ట్రాయ్ అభిప్రాయాలు తీసుకోవాలంటూ కొంతకాలంగా కేంద్రాన్ని సీవోఏఐ కోరుతూ వస్తోంది. తాజాగా ఆ దిశలోనే డాట్ చర్యలు తీసుకుంటూ ఉండటం గమనార్హం. మరోవైపు, ఇప్పటికే అధిక రుణభారం, ఆర్థిక సంక్షోభంతో కుదేలవుతున్న టెల్కోలు .. మార్చి –ఏప్రిల్‌లో విక్రయించే స్పెక్ట్రంనకు భారీ రేటు నిర్ణయించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మిగతా దేశాలతో పోలిస్తే ఈ ధర నాలుగు నుంచి ఆరు రెట్లు ఎక్కువగా ఉంటోందంటున్నాయి. అయితే, దీన్ని తగ్గించాలని టెలికం సంస్థలు కోరినప్పటికీ కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదు.

**ఐవోటీకి 5జీ ఊతం..**

వచ్చే ఏడాది నుంచీ ఎడ్జ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) మరింత ప్రాచుర్యంలోకి వచ్చేందుకు 5జీ సర్వీసులు గణనీయంగా ఉపయోగపడతాయని పరిశ్రమవర్గాలు తెలిపాయి. టెలికం, హెల్త్, వాహనాలు, గృహాలు ఇలాంటి వివిధ విభాగాల్లో ఐవోటీ పరిశ్రమ వచ్చే ఏడాది ఏకంగా 9 బిలియన్ డాలర్ల స్థాయికి చేరగలదని పేర్కొన్నాయి. అంతర్జాతీయంగా ఐవోటీ పరిశ్రమ 2020లో 300 బిలియన్ డాలర్లకు చేరనుందని, వచ్చే అయిదేళ్లలో భారత్ ఈ మార్కెట్లో కనీసం 20 శాతం వాటాను దక్కించుకోగలదని ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ ఒక నివేదికలో పేర్కొంది.

## రిలయన్స్ రిటైల్... @ 2.4 లక్షల కోట్లు!

- డీమార్ట్ కంటే డబుల్
- షేర్ల మార్పిడి స్కీమ్ ఆధారంగా విలువ మదింపు




**న్యూఢిల్లీ:** రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన రిలయన్స్ రిటైల్ విలువ రూ.2.4 లక్షల కోట్లు(3,400 కోట్ల డాలర్లు) అని అంచనా. రిలయన్స్ రిటైల్ వాటాదారుల కోసం రిలయన్స్ గ్రూప్ ప్రతిపాదించిన షేర్ల మార్పిడి స్కీమ్ ఆధారంగా చూస్తే, రిలయన్స్ రిటైల్ విలువ రూ.2.4 లక్షల కోట్లుగా తేలుతుంది. దేశంలో అతి పెద్ద సూపర్ మార్కెట్ చెయిన్, డిమార్ట్‌ను ను నిర్వహించే అవెన్యూ సూపర్ మార్ట్స్ మార్కెట్ విలువ(రూ.1.20 లక్షల కోట్లు)కు ఇది దాదాపు రెట్టింపు విలువ. ఇంగ్లాండ్‌లో అతి పెద్ద సూపర్ మార్కెట్ చెయిన్ టెస్కో విలువ (3,200 కోట్ల డాలర్లు)కంటే కూడా అధికం కావడం విశేషం. షేర్ల మార్పిడి స్కీమ్‌లో భాగంగా ప్రతి నాలుగు రిలయన్స్ రిటైల్ షేర్లకు గాను ఒక రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్‌ను పొందవచ్చని రిలయన్స్ రిటైల్ వెబ్‌సైట్ వెల్లడించింది.

**షేర్ల మార్పిడి స్కీమ్ ఎందుకంటే..,**

రిలయన్స్ రిటైల్ కంపెనీ తన ఉద్యోగులకు 2006, 2007 సంవత్సరాల్లో స్టాక్ ఆప్షన్స్ ఇచ్చింది. కొంత మంది ఉద్యోగులు ఈ ఆర్ఎస్‌యూ(రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్లు)ను ఈక్విటీ షేర్లుగా మార్చుకున్నారు. ఈక్విటీ షేర్లు పొందిన ఉద్యోగులు వీటిని నగదుగా మార్చుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారని రిలయన్స్ రిటైల్ వివరించింది. ఈ కంపెనీని ఇప్పటికిప్పుడు స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ చేసే ఆలోచన ఏదీ లేదని, అందుకే ఈ షేర్ల మార్పిడి స్కీమ్‌ను అందుబాటులోకి తెచ్చామని వివరించింది. రిలయన్స్ రిటైల్‌లో 99.95% వాటా రిలయన్స్ రిటైల్ వెంచర్‌కు ఉందని, మిగిలిన 0.05 శాతం వాటా ఉద్యోగుల వద్ద ఉందని వివరించింది. ఈ షేర్ల మార్పిడి స్కీమ్‌కు ఆమోదం పొందడం కోసం వచ్చే నెల 23న ఈక్విటీ వాటాదారుల సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపింది.

**పదివేలకు పైగా రిటైల్ స్టోర్స్...**

దేశవ్యాప్తంగా 10,901 స్టోర్స్‌ను నిర్వహిస్తున్న రిలయన్స్ రిటైల్ కంపెనీ ఆదాయం ఈ ఏడాది మార్చితో ముగిసిన సంవత్సరానికి 89% వృద్ధితో రూ.1.3 లక్షల కోట్లకు పెరిగింది. నిర్వహణ లాభం 169 శాతం ఎగసి రూ.5,550 కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు పరోక్ష అనుబంధ సంస్థగా రిలయన్స్ రిటైల్ వ్యవహరిస్తోంది. గురువారం రిలయన్స్ షేర్ రూ.1,516 వద్ద ముగిసింది. ఈ ధర వద్ద కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.9.6 లక్షల కోట్లు. రిలయన్స్ రిటైల్ కంపెనీని ఐదేళ్ల లోపు స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేస్తామని ఈ ఏడాది ఆగస్టులోనే రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలిపింది.

# ఐపీఓ నిధులు అంతంతే!

- మందగమనం ప్రభావం
- ఈ ఏడాది 60 శాతం తగ్గుదల
- మెరుగుపడ్డ ఓఎఫ్ఎస్; డిజిన్వెస్ట్‌మెంట్ డీలా
- ప్రైమ్ డేటాబేస్ గణాంకాల్లో వెల్లడి




ఆర్థిక వ్యవస్థ అంతంతమాత్రంగానే ఉన్న ప్రభావం కంపెనీల ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) నిధుల సమీకరణపై పడింది. ఈ ఏడాది కంపెనీలు ఐపీఓల ద్వారా సమీకరించిన నిధులు 60 శాతం మేర తగ్గాయి. గత ఏడాది ఐపీఓల ద్వారా రూ.30,959 కోట్లుగా ఉన్న ఐపీఓల ద్వారా నిధుల సమీకరణ ఈ ఏడాది రూ.12,362 కోట్లకు తగ్గింది. గత ఏడాది 24 కంపెనీలు ఐపీఓకు రాగా, ఈ ఏడాది 16 కంపెనీలే ఐపీఓకు వచ్చాయి. ఈ వివరాలను క్యాపిటల్ మార్కెట్ గణాంకాలను అందించే ప్రైమ్ డేటాబేస్ వెల్లడించింది. మరిన్ని వివరాలు....

- ఈ ఏడాది క్యూ2 జీడీపీ ఏడేళ్ల కనిష్ట స్థాయి, 4.5 శాతానికి పడిపోయింది. జీడీపీ మెరుగుపడుతున్న సూచనలు ఏమీ లేవు. రూ.51,000 కోట్ల సమీకరణ నిమిత్తం సెబీ ఆమోదం పొందిన 47 కంపెనీల ఐపీఓల గడువు తీరిపోవడం ఈ విషయాన్ని మరింత ప్రతిబింబిస్తోంది.
- ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ 60 శాతం తగ్గినా, ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్), క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్(క్యూఐపీ)ల ద్వారా నిధుల సమీకరణ మాత్రం మెరుగ్గానే ఉంది. ఈ రెండు మార్గాల ద్వారా గత ఏడాది వివిధ కంపెనీలు రూ.63,651 కోట్లు సమీకరించాయి. ఇది ఈ ఏడాది రూ.81,174 కోట్లకు పెరిగింది. 2017తో పోల్చితే(రూ.1,60,032 కోట్లు) ఇది 49% తక్కువ.
- ఈ ఏడాది అతి పెద్ద ఐపీఓగా స్టెర్లింగ్ అండ్ విల్సన్ సోలార్ నిలిచింది. ఈ కంపెనీ ఐపీఓ సైజు రూ.2,850 కోట్లు.
- ఈ ఏడాది వచ్చిన మొత్తం 16 ఐపీఓల్లో ఏడు కంపెనీల ఐపీఓలకు అనూహ్యమైన స్పందన లభించింది. ఈ ఐపీఓలు 10 రెట్లకు పైగా సబ్‌స్క్రైబయ్యాయి.
- ఐఆర్‌సీటీసీ ఐపీఓ 109 రెట్లు, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్‌బ్యాంక్ వంద రెట్లకు మించి సబ్‌స్క్రైబయ్యాయి.
- లిస్టింగ్ లాభాల్లో ఈ ఏడాది ఐపీఓలు అదరగొట్టాయి.
- ఐపీఓకు వచ్చిన కంపెనీల షేర్లు వాటి ఇష్యూ ధరల కంటే దిగువకు పడిపోవడం గత కొన్నేళ్లలో పరిపాటిగా ఉండేది. ఈ ఏడాది దీనికి భిన్నంగా ఉంది. ఈ ఏడాది ఐపీఓకు వచ్చిన కంపెనీల్లో 3 కంపెనీల షేర్లు మాత్రమే ఇష్యూ ధర కంటే దిగువకు పడిపోయాయి. మిగిలిన 13 కంపెనీల షేర్లు 21–170 శాతం రేంజ్ లాభాల్లో ట్రేడవుతున్నాయి.
- ఈ ఏడాది ఐపీఓ నిధుల సమీకరణ అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) ద్వారా ప్రమోటర్లు బాగానే లాభపడ్డారు. 2018లో ఓఎఫ్ఎస్ ద్వారా రూ.10,672 కోట్లు రాగా, ఈ ఏడాది రూ.25,811 కోట్లు వచ్చాయి.
- ఈ ఏడాది ప్రభుత్వ వాటాల విక్రయం(డిజిన్వెస్ట్‌మెంట్)కు కలిసిరాలేదు. డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.1,05,000 కోట్లు సమీకరించాలనేది ప్రభుత్వ లక్ష్యం. కానీ ఇప్పటిదాకా రూ.17,744 కోట్లు (17 శాతం మాత్రమే) సమీకరించింది.
- వచ్చే ఏడాది ఐపీఓలు ఆశావహంగానే ఉండే అవకాశాలున్నాయి. ఇప్పటివరకూ 21 కంపెనీలు ఐపీఓల కోసం సెబీ ఆమోదం పొందాయి. ఈ కంపెనీలు రూ.18,700 కోట్లు సమీకరించనున్నాయి. మరో 13 కంపెనీలు సెబీ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇవి రూ.18,000 కోట్ల సమీకరించడం కోసం సెబీకి దరఖాస్తు చేశాయి.

**సంవత్సరాల వారీ ఐపీఓలు, నిధులు**

| సంవత్సరం | ఐపీఓల సంఖ్య | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2014 | 5 | 1,201 |
| 2015 | 15 | 13,614 |
| 2016 | 26 | 26,494 |
| 2017 | 36 | 67,147 |
| 2018 | 24 | 30,959 |
| 2019 | 16 | 12,362 |

**ఈ ఏడాది ఐపీఓల పనితీరు ఇదీ...**

| కంపెనీ పేరు | ఇష్యూ ధర | ప్రస్తుత ధర | (వృద్ధి/క్షీణత%) |
|---|---|---|---|
| నియోజెన్ కెమికల్స్ | 132 | 358 | 171 |
| ఐఆర్‌సీటీసీ | 320 | 877 | 170 |
| ఆఫిల్ ఇండియా | 745 | 1,593 | 114 |
| ఇండియామార్ట్ ఇంటర్‌మెష్ | 973 | 2,078 | 114 |
| పాలీక్యాబ్ ఇండియా | 538 | 960 | 78 |
| మెట్రోపొలిస్ | 880 | 1,382 | 57 |
| ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ | 37 | 54 | 45 |
| ఎంబసీ ఆఫీస్ పార్క్స్ | 300 | 422 | 41 |
| ఛాలెట్ హోటల్స్ | 280 | 340 | 22 |
| రైల్ వికాస్ | 19 | 23 | 21 |
| సీఎస్‌బీ బ్యాంక్ | 195 | 231 | 19 |
| ఎమ్ఎస్‌టీసీ | 128 | 143 | 12 |
| గ్జెల్ప్‌మాక్ డిజైన్ | 66 | 64 | -3 |
| స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ | 1,202 | 1,191 | -1 |
| స్టెర్లింగ్ అండ్ విల్సన్ | 780 | 290 | -63 |

## ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌లో రోజంతా నెఫ్ట్ సేవలు

రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలకు అనుగుణంగా నగదు బదిలీ లావాదేవీలకు సంబంధించి ఇరవై నాలుగు గంటల నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) సేవల విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు వెల్లడించింది. దీనితో సెలవు రోజుల్లో కూడా ఖాతాదారులు నెఫ్ట్ ద్వారా ఎక్కడి నుంచైనా, ఏ బ్యాంకుకైనా నగదు బదిలీ చేయొచ్చని పేర్కొంది. ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్ లేదా ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ వెబ్‌సైట్ ద్వారా ఈ లావాదేవీలు చేయొచ్చు.

### బులియన్ రూ.లలో

| | |
|---|---|
| **ముంబై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,320 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,450 |
| వెండి (కిలో) | 50,400 |
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,770 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,920 |
| వెండి (కిలో) | 50,400 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,150 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,250 |
| వెండి (కిలో) | 47,700 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,750 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,970 |
| వెండి (కిలో) | 47,000 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,950 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,920 |
| వెండి (కిలో) | 47,900 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 61.69 (రాత్రి 11.30కు) | $ 61.11 (మంగళవారం ముగింపు) |
| బ్రెంట్ | 67.81 (రాత్రి 11.30కు) | $ 67.20 (మంగళవారం ముగింపు) |

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 27-12-2019

| | |
|---|---|
| విశాఖ | 475-00 |
| చిత్తూరు | 468-00 |
| వరంగల్ | 448-00 |
| విజయవాడ | 462-00 |
| గోదావరి | 462-00 |
| **26-12-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 445-00 |

# మార్కెట్‌కు ఎక్స్‌పైరీ నష్టాలు

**డిసెంబర్ సిరీస్ డెరివేటివ్స్ ముగింపు**

- సూచీల ఒడిదుడుకులు
- 3వ రోజూ కిందికే
- 298 పాయింట్లు పతనమై 41,164కు సెన్సెక్స్
- 88 పాయింట్ల నష్టంతో 12,127కు నిఫ్టీ



స్టాక్ మార్కెట్ నష్టాలు వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్‌లోనూ కొనసాగాయి. క్రిస్మస్ సందర్భంగా బుధవారం సెలవు అనంతరం గురువారం ట్రేడింగ్ ఒడిదుడుకులమయంగా సాగింది. డిసెంబర్ డెరివేటివ్స్ కాంట్రాక్టులకు చివరి రోజు కావడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్‌ల్లో భారీగా అమ్మకాలు చోటు చేసుకున్నాయి. ఇంట్రాడేలో 328 పాయింట్ల మేర పతనమైన సెన్సెక్స్ చివరకు 298 పాయింట్లు క్షీణించి 41,164 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కీలకమైన 12,200 పాయింట్ల దిగువకు పడిపోయింది. 88 పాయింట్లు నష్టంతో12,127 పాయింట్ల వద్దకు చేరింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఫ్లాట్‌గా ఉండగా, ముడి చమురు ధరలు స్వల్పంగా పెరిగాయి. బ్యాంక్, టెలికం, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. లోహ, వినియోగ ఆధారిత షేర్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. ఆ తర్వాత అర గంటకే నష్టాల్లోకి జారిపోయింది. మార్కెట్ నష్టాలు కొనసాగాయి. ఒక దశలో 83 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ మరో దశలో 328 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద రోజంతా 411 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. సంవత్సరాంత సెలవుల కారణంగా దేశీయ, విదేశీ స్టాక్ మార్కెట్లలో లావాదేవీల జోరు తగ్గడం.... ప్రతికూల ప్రభావం చూపించింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. బాక్సింగ్ డే సందర్భంగా యూరప్ మార్కెట్లకు సెలవు.

**బడ్జెట్ కోసం ఎదురు చూపు...**

అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మరింతగా తొలగిపోతాయనే ఆశలతో ప్రపంచ మార్కెట్లు ఊపిరి పీల్చుకుంటున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎనలిస్ట్ వినోద్ నాయర్ పేర్కొన్నారు. బడ్జెట్ ప్రకటనల కోసం మన మార్కెట్ ఎదురు చూస్తోందని వివరించారు.

- భారతీ ఎయిర్‌టెల్ షేర్ 2.2 శాతం నష్టంతో రూ.447 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.
- మరికొన్ని వారాల్లో రుణ కార్యకలాపాలు మొదలయ్యే అవకాశాలున్నాయన్న వార్తల నేపథ్యంలో డీహెచ్‌ఎఫ్‌ఎల్ షేర్ 5 అప్పర్ సర్క్యూట్‌తో రూ.15.80 వద్ద ముగిసింది.
- అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ షేర్ వరుసగా మూడో రోజూ 5 శాతం అప్పర్ సర్క్యూట్ వద్ద ముగిసింది. ఈ ఏడాది బీఎస్ఈ 500 సూచీ షేర్లలో అత్యధికంగా లాభపడిన షేర్ ఇదే. ఈ షేర్ దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ఈ ఏడాది మొదట్లో రూ.42 వద్ద ఉన్న ఈ షేర్ గురువారం రూ.156 వద్ద ముగిసింది.

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 1,660 |
| ఎన్ఎస్ఈ | 28,739 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 25,46,871 |
| ఎఫ్ఐఐ | -504 |
| డీఐఐ | 120 |

## రేటింగ్ ఏజెన్సీలపై సెబీ కొరడా

**ఐఎల్ఎఫ్ఎస్ కేసులో ఇక్రా, కేర్, ఇండియా రేటింగ్స్‌లకు రూ. 25 లక్షల చొప్పున జరిమానా**



న్యూఢిల్లీ: సంక్షోభంలో చిక్కుకున్న ఇన్‌ఫ్రా రుణాల సంస్థ ఐఎల్అండ్ఎఫ్ఎస్ కేసులో రేటింగ్ ఏజెన్సీలపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చర్యలు తీసుకుంది. ఇక్రా, కేర్, ఇండియా రేటింగ్స్ సంస్థలకు చెరి రూ. 25 లక్షల జరిమానా విధించింది. రేటింగ్ ఏజెన్సీల అలసత్వ ధోరణే ఐఎల్అండ్ఎఫ్ఎస్ డిఫాల్ట్‌కు కారణమయ్యిందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కంపెనీ నాన్–కన్వర్టబుల్ డిబెంచర్లకు (ఎన్‌సీడీ) ఇచ్చిన రేటింగ్ స్థాయిలో గ్రూప్ సంస్థల ఆర్థిక స్థితిగతులు లేవన్న సంగతి మదింపు చేయడంలో రేటింగ్ ఏజెన్సీలు విఫలమయ్యాయని పేర్కొంది. ఐఎల్అండ్ఎఫ్ఎస్, దాని అనుబంధ కంపెనీ ఐఎల్అండ్ఎఫ్ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థలు.. కమర్షియల్ పేపర్లు, ఇతరత్రా ఎన్‌సీడీలపై చెల్లించాల్సిన వడ్డీలను చెల్లించక డిఫాల్ట్ అయిన వివాదంలో సెబీ ఈ మేరకు చర్యలు తీసుకుంది.

## రామ్‌కో సిమెంట్స్ ప్లాంట్‌కు 5 స్టార్ రేటింగ్




చెన్నై: రామ్‌కో సిమెంట్స్ గోవిందపురం, అరియలూర్ (తమిళనాడు) కర్మాగారానికి పర్యావరణ, ఆరోగ్య, భద్రతకు సంబంధించి ప్రతిష్టాత్మక సీఐఐ– ఎస్ఆర్, ఈహెచ్ఎస్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఇందుకు సంబం.ధించి ఇటీవల జరిగిన సీఐఐ దక్షిణప్రాంత ఈహెచ్ఎస్ ఎక్సలెన్స్ అవార్డులు, 2019 కార్యక్రమంలో ''5 స్టార్ రేటింగ్'' సర్టిఫికెట్‌ను సంస్థ (అరియలూర్) వైస్ ప్రెసిడెంట్–అడ్మిన్ ఎస్ రామరాజ్ స్వీకరించారు. సీఐఐ–ఎస్ఆర్ ఈహెచ్ఎస్ ఎక్సలెన్స్ అవార్డ్స్, సుప్రా ఆంకాలజీ ఫౌండర్ శ్రీని శ్రీనివాసన్ తదితరులు ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారని కంపెనీ ప్రకటన తెలిపింది.

## మార్చికి నికర ఎన్‌పీఏలు 3.2 శాతానికి దిగొస్తాయి

**బ్యాంకింగ్ రంగంపై ఇక్రా నివేదిక**




ముంబై: దేశ బ్యాంకింగ్ రంగంలో నికర మొండి బకాయిలు (ఎన్‌పీఏలు) వచ్చే మార్చి నాటికి 3.2–3.3 శాతానికి దిగొస్తాయని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. ''బ్యాంకుల ఆస్తుల నాణ్యత మెరుగుపడుతూ వస్తోంది. అదే సమయంలో ఎన్‌పీఏలుగా మారే రుణాలు తగ్గుముఖం పడుతున్నాయి. రుణాల మాఫీ గరిష్ట స్థాయిల్లో కొనసాగుతున్నప్పటికీ 2020 ఆర్థిక సంవత్సరంలో మొండి బకాయిల వసూళ్లలో పురోగతి ఉంటుంది'' అని ఇక్రా తన నివేదికలో వివరించింది. 2019 మార్చి నాటికి బ్యాంకింగ్ రంగ నికర ఎన్‌పీఏలు 3.8 శాతంగా ఉన్నాయి. 2017–18లో మొండి బకాయిల వసూళ్లు 14.9 శాతంగా ఉంటే, 2018–19లో 15.5 శాతానికి మెరుగుపడినట్టు తెలిపింది. నికర ఎన్‌పీఏలు తగ్గడం వల్ల బ్యాంకుల సాల్వెన్సీ ప్రొఫైల్ (భవిష్యత్తు చెల్లింపులకు అనుగుణంగా ఆస్తుల విలువ) వృద్ధి చెందుతుందని ఇక్రా తెలిపింది.

**ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 4.9 శాతానికి..**

ప్రభుత్వరంగ బ్యాంకులకు పెద్ద మొత్తంలో మూలధన సాయం, ఎన్‌పీఏలకు కేటాయింపులు పెరగడం కారణంగా.. వాటి నికర ఎన్‌పీఏలు 2018 సెప్టెంబర్ నాటికి 7.2 శాతం నుంచి, 2019 సెప్టెంబర్ నాటికి 4.8 శాతానికి తగ్గాయని.. వచ్చే మార్చి చివరికి 4.9 శాతం స్థాయిలో ఉండొచ్చని అంచనా వేసింది. ప్రైవేటు బ్యాంకుల నికర ఎన్‌పీఏలు 2019 సెప్టెంబర్ చివరికి 1.7 శాతానికి (1.9 శాతం నుంచి) మెరుగుపడినట్టు వెల్లడించింది. ఇక 2018–19లో బ్యాంకుల రుణ వృద్ధి 13.3 శాతంగా ఉంటే, 2019–20లో 6.5–7 శాతానికి తగ్గొచ్చని ఇక్రా అంచనా వేసింది.

**రేపు బ్యాంకర్లతో ఆర్థికమంత్రి భేటీ**

ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల అధినేతలతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రేపు (శనివారం) సమావేశం కానున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల పనితీరు, వ్యాపార వృద్ధి, మొండి బకాయిల రికవరీ, తదితర అంశాలపై ఈ సమావేశంలో సమీక్షిస్తారని సమాచారం.

## లేలాండ్ వాహన కొనుగోళ్లకు 'సిటీ' రుణాలు




న్యూఢిల్లీ: అశోక్ లేలాండ్ వాణిజ్య వాహనాల కొనుగోళ్లకు సిటీకార్ప్ ఫైనాన్స్ రుణాలివ్వనున్నది. ఈ మేరకు సిటీకార్ప్ ఫైనాన్స్ కంపెనీతో వ్యూహాత్మక ఆర్థిక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నామని అశోక్ లేలాండ్ తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ వాహనాలను కొనుగోలు చేసే వినియోగదారులకు సిటీకార్ప్ రుణాలందిస్తుందని అశోక్ లేలాండ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనుజ్ ఖతురియా పేర్కొంది. బస్సులు, ట్రక్కులు కొనుగోలు చేసే వినియోగదారులకు వారి అవసరాలకు తగ్గట్లుగా, వేగవంతంగా రుణాలిస్తామని సిటీకార్ప్ ఫైనాన్స్ ఇండియా డైరెక్టర్ రోహిత్ రంజన్ పేర్కొన్నారు.

## మ్యాక్స్ బూపా నుంచి 'హెల్త్ ప్రీమియా' ప్లాన్





న్యూఢిల్లీ: ప్రైవేటు రంగంలోని ప్రముఖ బీమా సంస్థ 'మ్యాక్స్ బూపా' సమగ్ర ఆరోగ్య బీమా పథకం 'హెల్త్ ప్రీమియా'ను గురువారం ఆవిష్కరించింది. గరిష్టంగా రూ.3 కోట్ల వరకు ఈ ప్లాన్‌లో బీమా రక్షణ తీసుకోవచ్చు. 360 డిగ్రీల కోణంలో ఆరోగ్య రక్షణతోపాటు, విదేశీ పర్యటనల సమయంలోనూ కవరేజీ లభిస్తుందని కంపెనీ తెలిపింది. ఒక ఏడాదిలో సమ్ ఇన్సూర్డ్ మొత్తం ఖర్చయిపోతే, అంతే మొత్తానికి బీమా రక్షణ తిరిగి అమల్లోకి వస్తుంది. ఈ ప్లాన్ కింద విదేశాల్లోనూ మెటర్నిటీ కవరేజీ లభిస్తుంది. ఒబెసిటీ సర్జరీ, లేజర్ సర్జరీ, రోబోటిక్స్ సర్జరీలు, 20 తీవ్ర అనారోగ్య సమస్యలకు (కేన్సర్, ఓపెన్ హార్ట్‌సర్జరీ) ఇందులో కవరేజీ పొందొచ్చు. ప్రీమియం వైవర్, లాయల్టీ అడిషన్స్ తదితర సదుపాయాలు కూడా ఉన్నాయి.

## రూ.1,500 కోట్లు సమీకరించిన పీఎన్‌బీ



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) బాసెల్ త్రి బాండ్ల జారీ ద్వారా రూ.1,500 కోట్లు సమీకరించింది. వ్యాపార విస్తరణ నిమిత్తం ఈ నిధులను వినియోగిస్తామని పీఎన్‌బీ పేర్కొంది. 15,000 రిడీమబుల్ బాసెల్ త్రి టైర్ టూ బాండ్లను ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన జారీ చేశామని, ఈ బాండ్లకు 8.15 శాతం వార్షిక వడ్డీ చెల్లిస్తామని తెలిపింది. బ్యాంక్‌ల రుణ నాణ్యత, పనితీరు, లాభదాయకతలపై ప్రతికూల ప్రభావం పడకుండా ఈ నిధులు ఉపయోగపడతాయి.

## అలహాబాద్ బ్యాంకుకు రూ.2,153 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే (వచ్చే మార్చిలోపు) ప్రభుత్వం ఉంచి రూ.2,153 కోట్ల తాజా మూలధన సాయాన్ని అందుకోనున్నట్టు అలహాబాద్ బ్యాంకు ప్రకటించింది. ఈ మేరకు నిధుల సాయానికి సంబంధించిన వివరాలతో కేంద్ర ఆర్థిక శాఖ నుంచి లేఖను అందుకున్నట్టు తెలిపింది. ప్రభుత్వానికి ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపు రూపంలో ఈ నిధులను అందుకోనున్నట్టు వివరించింది. ఇండియన్ బ్యాంకులో అలహాబాద్ బ్యాంకు విలీనం కానున్న సంగతి తెలిసిందే.

## 30న ప్రభుత్వ సెక్యూరిటీల కొనుగోలు



ముంబై: ఆర్‌బీఐ ఈ నెల 30న ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంవో) ద్వారా రూ.10,000 కోట్ల విలువ మేర ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయడంతోపాటు, అంతే విలువకు సరిపడా ప్రభుత్వ సెక్యూరిటీలను విక్రయించనుంది. ఈ విషయాన్ని గురువారం ప్రకటన రూపంలో తెలియజేసింది. గత సోమవారం కూడా ఆర్‌బీఐ ఓఎంవో ద్వారా రూ.10,000 కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయగా, రూ.6,825 కోట్ల విలువైన సెక్యూరిటీలను విక్రయించింది. లిక్విడిటీ (ద్రవ్య లభ్యత) పరిస్థితులను సమీక్షించిన అనంతరం మరో విడత ఈ నెల 30న ఓఎంవో ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు, విక్రయం చేపట్టాలని నిర్ణయించినట్టు ఆర్‌బీఐ తెలిపింది.

**రాష్ట్రీయం**

# లేదు.. తెలియదు.. కాదు!

**జడ్జి ప్రశ్నలకు సైకో శ్రీనివాస్‌రెడ్డి సమాధానం**

- హాజీపూర్ హత్యల కేసులో నిందితుడిని విచారించిన నల్లగొండ కోర్టు
- తదుపరి విచారణ జనవరి 3వ తేదీకి వాయిదా

నల్లగొండ: 'మనీషాను తీసుకెళ్లావా.. అత్యాచారం జరిపి హత్య చేసి బావిలో పూడ్చి పెట్టావా?'అన్న జడ్జి ప్రశ్నలకు 'లేదు.. తెలియదు.. కాదు..'అని నిర్భయంగా సమాధానమిచ్చాడు సైకో శ్రీనివాస్‌రెడ్డి. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్ వరుస హత్యల కేసులో నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డిని గురువారం నల్లగొండ మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారించారు. ముగ్గురు బాలికల హత్యలకు సంబంధించి 101 మంది సాక్షుల వాంగ్మూలాలను కోర్టు ఇప్పటికే నమోదు చేసింది. ఈ క్రమంలో గురువారం మనీషా కేసుకు సంబంధించి నిందితుడి నుంచి వాంగ్మూలం రికార్డ్ చేశారు. ఒక్కో సాక్షి వాంగ్మూలాన్ని నిందితుడు శ్రీనివాస్‌రెడ్డికి జడ్జి చదివి వినిపించారు. కాగా, వీటిపై జడ్జి అడిగిన ప్రశ్నలకు నిందితుడు తాపీగా 'తెలియదు.. కాదు'అని జవాబు ఇచ్చాడు. హత్యకు గురైన బాలికల దుస్తులపై స్పెర్మ్ ఆనవాళ్లు నీకు సంబంధించినవేనని ఫోరెన్సిక్ రిపోర్టులో తేలింది కదా? అని అడగగా, ఎస్ఓటీ పోలీసులు సిరంజీలతో చల్లారని చెప్పుకొచ్చాడు. పోర్న్ వీడియోలు చూస్తావా అన్న ప్రశ్నకు తన దగ్గర స్మార్ట్ ఫోన్ లేదని చెప్పాడు. మనీషా హత్య జరిగిన రోజు తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేశానని, అందుకే టవర్ లొ కేషన్ ఆ ప్రాంతంలో చూపించిందని తెలిపాడు. కర్నూల్‌లో జరిగిన సువర్ణ హత్యపై అడగ్గా, ఆమె ఎవరో తనకు తెలియదని సమాధానం ఇచ్చాడు. ఈ కేసు తదుపరి విచారణను జడ్జి జనవరి 3వ తేదీకి వాయిదా వేశారు.

**కనిపించని ఆందోళన**

విచారణ సందర్భంగా జడ్జి అడిగిన ప్రతి ప్రశ్నకు శ్రీనివాస్‌రెడ్డి నిర్భయంగా సమాధానాలు చెప్పాడు. అతని ముఖంలో ఎటువంటి ఆందోళన కనిపించక పోవడం గమనార్హం.



కోర్టు నుంచి నిందితుడు శ్రీనివాస్‌రెడ్డిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

**ఆగస్టులో చార్జిషీట్ దాఖలు**

గత ఏప్రిల్‌లో హాజీపూర్‌కు చెందిన శ్రావణి మిస్సింగ్ కేసుపై విచారణ చేస్తున్న పోలీసులు శ్రీనివాస్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా శ్రావణితోపాటు కల్పన, మనీషాను కూడా అత్యాచారం చేసి చంపి పాతి పెట్టినట్టుగా ఒప్పుకున్నాడు. పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ ఆధ్వర్యంలో పోలీసులు సాక్ష్యాలన్నింటినీ పకడ్బందీగా సేకరించారు. ఆగస్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నల్లగొండలోని ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో విచారణ సాగుతోంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో వంద మంది సాక్షులను విచారించారు. కాగా, ఈ కేసు విచారణ వారంరోజుల్లోగా పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని పీపీ సిరిగిరి వెంకట్ రెడ్డి తెలిపారు.

## మానస కేసులో చార్జిషీట్ దాఖలు

వరంగల్ క్రైం: అత్యాచారం, హత్యకు గురైన వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ దీన్‌దయాళ్‌నగర్‌కు చెందిన గాదం మానస కేసులో సుబేదారి పోలీసులు గురువారం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నెమలిగొండకు చెందిన సాయిగౌడ్.. నవంబర్ 27న మానసను ప్రేమ పేరుతో నమ్మించి అత్యాచారం, ఆపై హత్య చేసిన విషయం విదితమే. ఈ ఘటనలో పోలీసులు 24 గంటల్లో నిందితున్ని అరెస్టు చేశారు. అనంతరం వారం పాటు పోలీసు కస్టడీకి తీసుకుని శాస్త్రీయంగా వివరాలను సేకరించారు. మృతురాలి దుస్తులపై ఉన్న రక్తం, వీర్యం మరకలతో పాటు, పోస్టుమార్టం నివేదిక, డీఎన్ఏ రిపోర్ట్, ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు అన్నీ నిందితుడు సాయిగౌడ్ ఆధారాలతో సరిపోయినట్లు పోలీసులు తెలిపారు. కాగా, మానసపై అత్యాచారం, హత్యకు సంబంధించిన ప్రతి ఆధారాన్ని సేకరించామని సుబేదారి ఇన్‌స్పెక్టర్ సీహెచ్.అజయ్ తెలిపారు. నేరం జరిగిన 30 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేశామన్నారు.

## దెబ్బతిన్న డీఎన్‌ఏపై పరిశోధనలు

**ఐఐటీహెచ్ వెల్లడి**

సాక్షి, సంగారెడ్డి: దెబ్బతిన్న లేదా పాడైన డీఎన్‌ఏను సరిచేసే (మరమ్మతు) ప్రొటీన్ పనివిధానాన్ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) పరిశోధకులు ఆవిష్కరించారు. ఈ అధ్యయన ఫలితాలు పీర్–రివ్యూ జర్నల్ 'న్యూక్లియిక్ యాసిడ్ రీసెర్చ్'లో ప్రచురితమైనట్లు ఐఐటీహెచ్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. గువాహటి ఐఐటీ బయో సైన్సెస్ అండ్ బయో ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ అరుణ్ గోయెల్ సహకారంతో ఈ అధ్యయనాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. జర్నల్‌లో వచ్చిన డాక్యుమెంట్‌ను అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనింద్యారాయ్, డాక్టర్ అరుణ్ గోయెల్, మోనిషామోహన్, ఆకుల దీప, అరుణ్ ధిల్లాన్‌లు సంయుక్తంగా రచించినట్లు తెలిపారు. శరీరంలో సహజంగా ఉత్పత్తయ్యే కొన్ని రకాల రసాయనాలు డీఎన్‌ఏకు నష్టాన్ని కలిగిస్తాయని డాక్టర్ అనింద్యారాయ్ వివరించారు. ఈ సమస్యకు సత్వరం చికిత్స చేయకపోతే మరణం వరకు దారితీస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే దెబ్బతిన్న డీఎన్‌ఏకు చికిత్స చేయడానికి పరిశోధనలు చేపట్టినట్లు వివరించారు.



ప్రొఫెసర్ అనింద్యారాయ్‌తో పరిశోధకులు

## ఎన్నార్సీపై మీ వైఖరి ప్రకటించాలి

**కేసీఆర్‌కు రాఘవులు డిమాండ్**

సాక్షి, యాదాద్రి: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నార్సీపై తన వైఖరిని ప్రకటించాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎన్నార్సీని విస్తరిస్తామంటున్నా కేసీఆర్ మాట్లాడకుండా నిశ్శబ్దం పాటించడాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలన్నారు. ఎన్‌డీఏ కూటమి నేతలు నితీశ్‌కుమార్, పాశ్వాన్, బీజేడీ నేతలు ఎన్నార్సీని వ్యతిరేకిస్తున్నారన్నారు. ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కూడా వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఎన్‌డీఏ ప్రభుత్వం తీరు ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ దేశంలోని 130 కోట్ల మంది ప్రజలంతా హిందువులే అనడం సరికాదన్నారు. ఎన్నార్సీ, సీఏఏ పేరుతో ఒక వర్గం ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా గుర్తించే పద్ధతి మంచిది కాదన్నారు. కేంద్రం నిరంకుశ విధానాలపై సీపీఎం పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పాల్గొన్నారు.

## నేటి నుంచి భద్రాద్రిలో 'ముక్కోటి' అధ్యయనోత్సవాలు

భద్రాచలం టౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకలు జనవరి 16 వరకు కొనసాగుతాయి. పది రోజుల పాటు స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. జనవరి 5వ తేదీన శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి గోదావరి నదిలో తెప్పోత్సవం జరుపుతారు. 6వ తేదీ తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. ఈ సందర్భంగా రామాలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తెప్పోత్సవానికి హంస వాహనాన్ని సిద్ధం చేశారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.

దేదీప్యమానంగా రామాలయం



## తెరుచుకున్న యాదాద్రి



యాదాద్రి క్షేత్రంలో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: సూర్యగ్రహణం సందర్భంగా బుధవారం రాత్రి 9.30 గంటలకు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ద్వారబంధనం చేసిన అర్చకులు గురువారం గ్రహణం పూర్తయిన తరువాత మధ్యాహ్నం 12 గంటలకు తెరిచారు. ముందుగా బాలాలయంలో సుప్రభాతం చేపట్టి అనంతరం సంప్రోక్షణ నిర్వహించారు. మహా మండపంలో స్వామివారికి అర్చన, అభిషేకాలు చేశారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.

**రామాలయం కూడా..**

భద్రాచలం టౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. సూర్యగ్రహణం సందర్భంగా బుధవారం రాత్రి 9.15 గంటలకు ఆలయ తలుపులను మూసివేసిన విషయం తెలిసిందే. గురువారం సూర్యగ్రహణం వీడిన తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి చేశారు. తర్వాత అంతరాలయంలోని మూలమూర్తులకు సుప్రభాత సేవ, యాగశాలలో శాంతి హోమం జరిపారు. ముందుగా మూలమూర్తులకు, ఉత్సవ పెరుమాళ్లకు నిత్యకల్యాణ మూర్తులకు పరివార దేవతలకు, లక్ష్మీతాయారమ్మవారికి, అభయాంజనేయ స్వామివారికి అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా ఆండాళ్ అమ్మవారికి 30 పాశురాలను పఠించి 11వ పాశురాన్ని ప్రత్యేకంగా విన్నవించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సర్వ దర్శనం కల్పించారు.

## నిలబడిన రోకలి బండ



తాంబాలంలో నిలబెట్టిన రోకలి బండ

పాలకుర్తి టౌన్ : సూర్య గ్రహణం సందర్భంగా జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రం గౌడకాలనీలో ఒకరు తాంబాలంలో నీరు పోసి రోకలి బండను నిలబెట్టి తీసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కేవలం గ్రహణ సమయంలో మాత్రమే రోకలి బండ నిలబడి తరువాత పడిపోతుందని ప్రచారం చేయడంతో స్థానిక ప్రజలు ఆసక్తిగా వీక్షించారు. ఈ వీడియో పట్ల పలువురు విద్యావంతులు స్పందించి.. అవన్నీ మూఢ నమ్మకాలనీ, శాస్త్రీయత లేని ఇలాంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఓయూ ఆస్ట్రాలజీ అసిస్టెంటు ప్రొఫెసర్ అరూరి మహేందర్ సూచించారు.

## భలేగుంది బంగారు చేప



బంగారు, ఎరుపు వర్ణాలు కలిగిన చేప

కేసముద్రం: మనం తెలుపు, నలుపు వర్ణాల్లో చేపలను చూస్తుంటాం. అయితే బంగారు, ఎరుపు వర్ణాలను కలిగిన అరుదైన చేప మహబూబాబాద్ జిల్లా కేసముద్రం గ్రామంలో గురువారం కనిపించింది. గ్రామానికి చెందిన ఓ వ్యాపారి చేపలను విక్రయిస్తుండగా బుట్టలో ఉన్న అన్ని చేపల్లో ఒకటి బంగారు, ఎరుపు వర్ణాలు కలిగి ఉంది. దానిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

# రైట్ రైట్@ 4940

- 4వేలకు పైగా సంక్రాంతి స్పెషల్ బస్సులు
- జనవరి 10 నుంచి 13 మధ్య అందుబాటులోకి
- దూర ప్రాంత సర్వీసులకు 50% అదనపు చార్జీ
- స్థానిక బస్సుల్లో అప్పటికప్పుడు చార్జీల నిర్ణయం
- రూ.6 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా

**సాక్షి, హైదరాబాద్:** సంక్రాంతి సందర్భంగా నగరం నుంచి వివిధ ప్రాంతాలకు తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేకంగా 4,940 బస్సులను నడపాలని నిర్ణయించింది. జనవరి 10 నుంచి 13 వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. తెలంగాణ



పరిధిలో 3,414 బస్సులు, ఆంధ్రప్రదేశ్ పరిధిలోని ప్రాంతాలకు 1,526 బస్సులు ప్రత్యేక సర్వీసులుగా తిరగనున్నాయి. రోజువారీ నడిచే రెగ్యులర్ సర్వీసులకు ఇవి అదనం. మహాత్మాగాంధీ బస్ స్టేషన్, సీబీఎస్, జూబ్లీబస్ స్టేషన్, దిల్‌సుఖ్‌నగర్, లింగంపల్లి, చందానగర్, కేపీహెచ్‌బీ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, టెలిఫోన్ భవన్, ఈసీఐఎల్, ఉప్పల్ క్రాస్ రోడ్డు, ఎల్‌బీనగర్‌లతోపాటు నగరంలోని కొన్ని ముఖ్యమైన కాలనీల నుంచి ఈ సర్వీసులు బయల్దేరనున్నాయి. తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలతోపాటు, ముఖ్యమైన పట్టణాలు, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విజయనగరం, తెనాలి, గుంటూరు, గుడివాడ, రాజమండ్రి, కాకినాడ, రాజోలు, పోలవరం, మచిలీపట్నం, ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, విశాఖపట్నం, శ్రీకాకుళం, భీమవరం, నర్సాపురం, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, ఉదయగిరి, కనిగిరి, కందుకూరు, పొదిలి తదితర ప్రాంతాలకు ఈ ప్రత్యేక బస్సులు తిరుగుతాయి. పదో తేదీన 965 బస్సులు, 11న 1,463, 12న 1,181 బస్సులు, 13న మిగతావి నడుపుతారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ అదనపు బస్సులకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు.

**రూ.6 కోట్ల ఆదాయం లక్ష్యం**

గత సంక్రాంతి సమయంలో 4,600 బస్సులు తిప్పగా దాదాపు రూ.5 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి చార్జీల పెంపు, బస్సుల సంఖ్య ఎక్కువ కావటంతో దాదాపు రూ.6 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఇలాంటి ప్రత్యేక సర్వీసులకు 50% అదనపు రుసుము వసూలు చేసుకునే వెసులుబాటు ఉంది. ఈసారి అంతర్రాష్ట్ర సర్వీసులకు అంతమేర వసూలు చేస్తూ, రాష్ట్రం పరిధిలో తిరిగే వాటి విషయంలో రీజినల్ మేనేజర్లకు స్వేచ్ఛనిచ్చారు. ఇటీవలే చార్జీలు పెంచినందున, 50 అదనపు మొత్తం వసూలు చేస్తే ప్రయాణికుల నుంచి వ్యతిరేకత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితిని బట్టి స్థానిక ఆర్ఎంలు అదనపు చార్జీల విషయంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఈమేరకు ఈడీ ఆపరేషన్స్ యాదగిరి గురువారం సీటీఎం మునిశేఖర్, రీజినల్ మేనేజర్లతో భేటీ అయి ఈ అదనపు సర్వీసుల గురించి చర్చించారు.

### ఎక్కడ్నుంచి ఎక్కడకు..

**జేబీఎస్:** కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పరిధిలోని ప్రాంతాలకు బస్సులు ప్రారంభం.
ఉప్పల్ క్రాస్‌రోడ్డు, ఉప్పల్ బస్‌స్టేషన్: యాదగిరిగుట్ట, జనగామ, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, వరంగల్ వైపు వెళ్లేందుకు బస్సులు మొదలు.
**దిల్‌సుఖ్‌నగర్:** మిర్యాలగూడ, నల్లగొండ, కోదాడ, సూర్యాపేట వైపు వెళ్లే బస్సులు సిద్ధం.
**సీబీఎస్:** కర్నూలు, తిరుపతి, మాచర్ల, ఒంగోలు, నెల్లూరు, అనంతపురం, గుత్తి, మదనపల్లి తదితర ప్రాంతాల వైపు వెళ్లేందుకు ఏర్పాటు.
**ఎంజీబీఎస్:** ప్లాట్‌ఫామ్ 1–5: గరుడప్లస్, గరుడ, అంతర్రాష్ట్ర షెడ్యూల్ బస్సులు. 6–7: బెంగళూరు వైపు, 10–13: ఖమ్మం వైపు, 14–15: దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్‌కు ప్రతి 10 నిమిషాలకో సిటీ బస్సు. 18–19: ఉప్పల్ క్రాస్‌రోడ్డుకు ప్రతి 10 ని.కు సిటీ బస్సు. 23–25: శ్రీశైలం, కల్వకుర్తి వైపు, 26–31: రాయచూర్, మహబూబ్‌నగర్ వైపు, 32–34 నాగర్‌కర్నూలు, షాద్‌నగర్ వైపు, 35–36, 39: విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు వైపు, 37–38, 40: ఏపీ బస్సులు, **41–42:** పెబ్బేరు, కొత్తకోట, గద్వాల వైపు, **46–47:** మెదక్, బాన్సువాడ, బోధన్ వైపు, **48–52:** జహీరాబాద్, బీదర్, సంగారెడ్డి, నారాయణపేట వైపు, 56–58: నాగ్‌పూర్, అమరావతి, నాందేడ్, అకాలా వైపు, 62: దేవరకొండ వైపు, 63–65: పరిగి, తాండూరు, వికారాబాద్ వైపు






# ఆర్టీసీ సిబ్బందికి మొబైల్ టాయిలెట్లు

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ సిబ్బంది కోసం ఆ సంస్థ సంచార బయోటాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. కండీషన్ తప్పిన పాత బస్సులను బయోటాయిలెట్లుగా రూపొందించారు. సిబ్బంది డ్రెస్ మార్చుకోవటం, కాసేపు విశ్రాంతిగా కూర్చోవటం, మూత్రశాల, మరుగుదొడ్డి వినియోగం.. వంటి అవసరాల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా ఈ బస్సులను రూపొందించింది. నగరంలో కొన్ని ప్రాంతాల్లో డ్యూటీ చేంజ్ ఓవర్ పాయింట్ల వద్ద స్థలాభావంతో సిబ్బందికి వసతులు లేక మహిళా కండక్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్‌తో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఈ సమస్య చర్చకు వచ్చింది. దీంతో సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆయన అధికారులను ఆదేశించారు. స్థలాభావం ఉన్న చోట నిర్మాణాలు చేపట్టే అవకాశం లేకపోవటంతో, ఇలా పాత బస్సులనే చేంజ్ ఓవర్ గదులుగా మార్చేశారు. ప్రస్తుతానికి 9 పాయింట్ల వద్ద వీటిని అందుబాటులో ఉంచనున్నారు. వీటిల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా టాయిలెట్లు ఉన్నాయి. ఉదయం షిఫ్ట్ సమయానికి ఈ వాహనాలు అక్కడికి వచ్చి సెకండ్ షిఫ్ట్ పూర్తయ్యే వరకు ఉంటాయి. తర్వాత డిపోలోకి వెళ్లిపోతాయి. అవసరాన్ని బట్టి ఇలాంటి మరికొన్ని వాహనాలను కూడా సిద్ధం చేసి అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోతున్నారు. ఆర్టీసీ సిబ్బంది వాడకానికి మాత్రమే వీటిని వినియోగిస్తామని అధికారులు చెబుతున్నారు. నగరంలో చాలా ప్రాంతాల్లో సాధారణ ప్రజలకు కూడా రోడ్లపై ఇలాంటి ఇబ్బందులున్నాయి. జీహెచ్ఎంసీ ఈ తరహాలోనే ఆలోచించి కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులు కొని ఇలా మార్చి కూడళ్లలో ఏర్పాటు చేస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్న సూచన వస్తోంది.

# ప్రైవేటు వాహనాలకు బ్రేకులు!

- నిబంధనలు ఉల్లంఘించి ప్రయాణికులను తరలించే వాహనాలకు చెక్
- 15 ఏళ్ల తర్వాత అందుబాటులోకి రాబోతున్న కొత్త కమిటీలు
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, రవాణా–ఆర్టీసీ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు
- ఉల్లంఘనలకు భారీ జరిమానా, వాహనాల జప్తు.. ఇటు ఆర్టీసీకి ఆదాయం

**సాక్షి, హైదరాబాద్:** చార్జీల పెంపు, సర్వీసుల హేతుబద్ధీకరణతో టికెట్ రూపంలో ఆదాయాన్ని పెంచుకుంటున్న ఆర్టీసీ, నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతూ ప్రయాణికులను తన్నుకుపోతున్న ప్రైవేటు వాహనాల నియంత్రణపై దృష్టి సారించింది. వాటిని నియంత్రించడం ద్వారా.. ఇంత కాలం కోల్పోతున్న అదనపు ఆదాయాన్ని తన ఖాతాకు మళ్లించుకునే ప్రయత్నం ప్రారంభించింది. ఇటీవల సమ్మె సమయం నుంచి సీఎం ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీలో పూర్తిగా కొత్త ఉత్సాహం పెల్లుబుకుతోంది. దీంతో అధికారులు రెట్టించిన ఉత్సాహంతో సరికొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపించటమే కాకుండా వెంటనే వాటిని కార్యరూపంలోకి తేవటంతో ఉద్యోగుల్లో కూడా ఉత్సాహం కనిపిస్తోంది. వెరసి సరికొత్త ఆర్టీసీ సాక్షాత్కారమవుతోంది. ఈ ఊపులోనే ఇప్పుడు ప్రైవేటు వాహనాలపై ఆర్టీసీ దృష్టిసారించింది. వాటి వల్ల సాలీనా రూ.వేయి కోట్ల వరకు ఆదాయాన్ని కోల్పోతున్నట్టు ఆర్టీసీ గతంలోనే గుర్తించింది. కానీ నియంత్రించే వీల్లేక చేతులెత్తేసింది. ప్రస్తుతం ప్రైవేటు వాహనాలను నియంత్రించేందుకు నడుం బిగించింది.

**15 ఏళ్ల క్రితమే తెచ్చిన అప్పటి ప్రభుత్వం..**

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్ల వద్ద బస్సుల కంటే ప్రైవేటు వాహనాలే ఎక్కువగా కనిపిస్తాయి. నిబంధనలు పట్టించుకోకుండా ఈ వాహనాలు ఆర్టీసీ బస్సుల కోసం వచ్చే ప్రయాణికులను స్టేజీ క్యారియర్లుగా తిరుగుతూ తరలిస్తున్నాయి. ఇది రవాణాశాఖ నిబంధనలకు పూర్తి విరుద్ధం. కానీ వాటిపై ఇంతకాలం ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంతో క్రమంగా వాటి సంఖ్య భారీగా పెరిగింది. మినీ వ్యాన్లు, కార్లు, జీపులు, వ్యాన్లు, బస్సులు.. ఇలా అన్ని రకాల వాహనాలు ప్రయాణికులను తరలిస్తున్నాయి. కాంట్రాక్టు క్యారేజీ పర్మిట్ ఉన్నవి కూడా స్టేజీ క్యారియర్లుగా నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్నాయి. వీటిని నియంత్రించాలని చాలాకాలంగా ఆర్టీసీ కోరుతోంది. దాదాపు 15 ఏళ్ల క్రితమే అప్పటి ప్రభుత్వం ఇందుకోసం కొన్ని ఏర్పాట్లు కూడా చేసింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ, రవాణాశాఖ, ఆర్టీసీ అధికారులతో కలిపి కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వు జారీ చేసింది. ఆ కమిటీలు క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలించే వాహనాలపై చర్యలు తీసుకునే అధికారం కల్పించింది. కానీ ఆ కమిటీలు ఎప్పుడూ సరిగా పనిచేయలేదు. వాటిని పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు ఎలాంటి సమావేశాలు కూడా ఏర్పాటు చేయటం లేదు. దీంతో అవి నిర్వీర్యమయ్యాయి. ఇప్పుడు వాటిని పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈమేరకు ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మ ఆయా విభాగాల ఉన్నతాధికారులకు తాజాగా లేఖలు రాశారు.

**ఏం చేస్తారు..**

ఈ కమిటీలోని అధికారులు క్రమం తప్పకుండా అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేస్తూ ఆయా వాహనాలకు ఉన్న పర్మిట్లు, డ్రైవర్ల లైసెన్సులు పరిశీలిస్తారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలిస్తే వెంటనే డ్రైవర్లపై పెనాల్టీ విధించటంతోపాటు అవసరమైతే వాహనాలను జప్తు చేస్తారు. డ్రైవర్ లైసెన్సును కూడా రద్దు చేస్తారు.

# ఆర్టీసీ హాలిడేలివే

**సాక్షి, హైదరాబాద్:** 2020 సంవత్సరానికి ఆర్టీసీ హాలిడేలను అధికారులు ప్రకటించారు. ఆర్టీసీ పరిపాలనా విభాగాలు, తార్నాక ఆర్టీసీ ఆసుపత్రి, డిస్పెన్సరీలు, బాడీ బిల్డింగ్ వర్క్‌షాప్, జోనల్ వర్క్‌షాప్, స్టోర్స్, టైర్ రీట్రేడింగ్ యూనిట్ తది తర విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ సెలవు లు పెయిడ్ హాలిడేలుగా ఉంటాయి. 20 సెలవులను ఈ జాబితాలో పేర్కొన్నారు. జనవరి 1 కొత్త సంవత్సరం, 14 భోగి, 15 మకర సంక్రాంతి, ఫిబ్ర వరి 21 మహాశివరాత్రి, మార్చి 9 హోలీ, మార్చి 25 ఉగాది, ఏప్రిల్ 2 శ్రీరామనవమి, ఏప్రిల్ 10 గుడ్‌ఫ్రైడే, ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతి, మే 1 కార్మిక దినోత్సవం, మే 25 రంజాన్, ఆగస్టు 1 బక్రీద్, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినం, ఆగస్టు 22 వినాయకచవితి, అక్టోబర్ 2 గాంధీ జయంతి, అక్టోబర్ 17 బతుకమ్మ ప్రారంభం, అక్టోబర్ 24 దుర్గాష్టమి, అక్టోబర్ 30 ఈద్ మిలాద్ ఉన్ నబి, నవంబర్ 14 దీపావళి, డిసెంబర్ 25 క్రిస్మస్

**వయోపరిమితి పెంపు ఉత్తర్వుల విడుదల**

ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 నుంచి 60 ఏళ్లకు పెంచుతూ సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో, వెంటనే దాన్ని అమ ల్లోకి తెస్తూ ఆర్టీసీ గురువారం ఉత్తర్వులు వెలువ డ్డాయి. ఈ మేరకు డిపోల్లో అధికారులు చర్యలు తీసుకోవాలంటూ ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మ ఆదేశించారు. ఆర్టీసీ ఉద్యోగుల మధ్య సహృద్భావ వాతావరణం పెంచే చర్యల్లో భాగంగా వనభోజ నాల విధానాన్ని అమల్లోకి తెస్తున్నారు. తొలికార్యక్రమం హకీంపేట డిపో ఉద్యోగుల కోసం శామీర్‌పేటలో ఏర్పాటు చేశారు. దీన్ని రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించ నున్నారు. అంతకు ముందు ఆయన జూబ్లీ బస్టాండును తనిఖీ చేస్తారని అధికారులు పేర్కొన్నారు.

## సమస్యల వలయంలో జీహెచ్ఎంసీ

**పౌర సేవల లేమిపై హైకోర్టులో పిల్**

**సాక్షి, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని చెత్త పేరుకుపోతోందని, పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, అనేక సమస్యలు తాండవిస్తున్నాయని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలైంది. హైదరాబాద్‌లోని మూసాపేటకు చెందిన జి.సత్యనరేష్‌కుమార్ అనే వ్యక్తి ఈ పిల్ దాఖలు చేశారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్/వైద్య, ఆరోగ్య/ప్రణాళిక శాఖల ముఖ్య కార్యదర్శులు, జీహెచ్ఎంసీ కమిషనర్, మహానగర మంచినీటి సరఫరా, మురుగు నీటిపారుదల మండలి ఎండీ, కేంద్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శులను ప్రతివాదులుగా చేశారు.




# గవర్నర్ గిరి.. ఐపీఎస్‌లపై గురి!

- సమర్థమైన అధికారుల కోసం అన్వేషణ
- తెలంగాణ అధికారితో కేంద్రం మంతనాలు?
- ఏ నిర్ణయమూ వెల్లడించని అధికారి..
- కిరణ్‌బేడీ, నరసింహన్, పీఎస్ రామ్మోహన్ తరహాలో!



**సాక్షి, హైదరాబాద్:** త్వరలో పలు రాష్ట్రాల గవర్నర్ల పదవీ కాలం ముగిసిపోనున్న నేపథ్యంలో సమర్థమైన వారి కోసం కేంద్రం అన్వేషణ మొదలుపెట్టింది. రాజకీయ నాయకులతో పాటు ఐపీఎస్ అధికారులను ఈసారి గవర్నర్లుగా నియమించాలని భావిస్తోంది. ఇందుకోసం సరైన ఐపీఎస్ అధికారుల వేట మొదలుపెట్టింది. సాధారణంగా గవర్నర్ పోస్టులో రాజకీయ నాయకులే ఉంటారు. సీనియర్లు, పరిపాలనలో సమర్థులుగా పేరున్న వారిని వారిని కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ గవర్నర్లుగా నియమించడం పరిపాటే. అయితే అప్పుడప్పుడూ సివిల్ సర్వీసెస్ అధికారులను కూడా నియమిస్తూ ఉంటారు. సీనియర్ అధికారులైన ఈఎస్ఎల్ నరసింహన్ (ఏపీ), కిరణ్‌బేడీ (పుదుచ్చేరి), పీఎస్ రామ్మోహన్‌రావు (తమిళనాడు) గవర్నర్లుగా పనిచేసిన విషయం తెలిసిందే.

**ఇటీవలే భేటీ..**

అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం.. దక్షిణాది నుంచి ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులను గవర్నర్లుగా నియమించాలని కేంద్రంలోని ఓ కీలక నేత ప్రయత్నాలు చేస్తున్నారు. పనిపై నిబద్ధత, విధి నిర్వహణలో సమర్థులు, ట్రబుల్ షూటర్లు అని ఆ ఇద్దరు అధికారులకు ఉన్న రికార్డే ఇందుకు కారణం. అందులో భాగంగా తెలంగాణకు చెందిన ఓ ఐపీఎస్ అధికారితో ఆ సీనియర్ నేత ఇటీవల సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ పదవిని చేపట్టే విషయమై ఆయన అభిప్రాయం అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఊహించని ఈ ఆఫర్‌కు అవాక్కయిన ఆ అధికారి.. తొలుత నమ్మలేదు. కానీ, సీరియస్‌గా అడిగేసరికి.. తాను ఎటూ తేల్చుకోలేకపోతున్నానని, ఆలోచించుకునేందుకు కాస్త సమయం కావాలని కోరినట్లు తెలిసింది.

**ఐపీఎస్‌లే ఎందుకు?**

రాజకీయ సంక్షోభం, సరిహద్దు, తీవ్రవాదం, ఉగ్రవాదం, తిరుగుబాటు తదితర జఠిల సమస్యలు ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లుగా ఐపీఎస్‌లు రాణించేందుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. పరిపాలనాపరంగా ఉన్న అనుభవం, శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడని మనస్తత్వం, క్లిష్ట పరిస్థితుల్లో పరిస్థితులను చేయిదాటకుండా సమన్వయం చేసుకోవడంలో వీరికి అపార అనుభవం ఉంటుంది. అందుకే ఐపీఎస్‌లను కేంద్ర ప్రభుత్వాలు గవర్నర్లుగా నియమిస్తుంటాయి. వామపక్ష తీవ్రవాదం ఉచ్ఛస్థితిలో ఉన్న 2007లో జార్ఖండ్ గవర్నర్‌గా ఐపీఎస్ అధికారి ఈఎస్ఎల్ నరసింహన్‌ను అప్పటి యూపీఏ ప్రభుత్వం పంపింది. ఆయన గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించాక అన్ని విధాలా సఫలీకృతమయ్యారు. అదే సమయంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడటంతో ఆయనకు ఉమ్మడి ఏపీ బాధ్యతలను కూడా అప్పగించారు. 2014లో రాష్ట్ర విభజన నుంచి 2019 సెప్టెంబర్ వరకు ఏపీ, తెలంగాణలకు ఆయనే గవర్నర్‌గా విజయవంతంగా విధులు నిర్వహించారు. మరోవైపు కిరణ్‌బేడీ ప్రస్తుతం పుదుచ్చేరి గవర్నర్‌గా కొనసాగుతున్నారు. వీరిద్దరి కంటే ముందే.. 2002లో ఉమ్మడి ఏపీ నుంచి సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన పీఎస్ రామ్మోహన్‌రావు తమిళనాడు గవర్నర్‌గా పనిచేశారు. ఇప్పటి వరకు దాదాపు 15 మంది ఐపీఎస్ ఆఫీసర్లు దేశంలోని వివిధ రాష్ట్రాలకు గవర్నర్లుగా పనిచేశారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com